మార్చి 2009

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 1 రంగారెడ్డి జిల్లా పేజీలు: 64 వెల: రూ. 20/-

## ఉగాదికి స్వాగతం !

## ఉగాది ఒక ఉత్సవమే కాదు ఒక కాలస్పృహ కూడా...





# వసంత రుతుశోభ



స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 2
మార్చి, 2009

చీఫ్ ఎడిటర్
ఫణి కుమార్

ఎడిటోరియల్ బోర్డు
డి. రామకృష్ణ, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)
కె. అంబరీష్, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)
సెబాస్టియన్ రాజు, ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)
బ్రిగేడియర్ డి.వి. రావు
మహమ్మద్ తకీయుద్దీన్
ఎమ్.ఏ. కుమార రాజా
హెచ్. కూర్మారావు
డాక్టర్ ఆర్. అరుణ జ్యోతి
ఎన్. విజయ కుమార్
బి. నరేంద్రనాథ్ రావు
ఆర్. సూర్యనారాయణ రెడ్డి
డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్
డాక్టర్ సి. కృష్ణ మోహనరావు

ప్రచురణ
ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ & ఫ్యాక్స్ : 040-24018656
E-mail ID: peshicomamapard@ap.gov.in

# విషయ సూచిక

సంపాదకీయం ..... 2
గ్రామీణాభివృద్ధి వికేంద్రీకృత ప్రణాళిక కోర్సు ప్రారంభం ..... 3
ఉగాది ఒక ఉత్సవమే కాదు ఒక కాలస్పృహ కూడా..... 4
చిరస్మరణీయం-గ్రామీణాభివృద్ధి శాఖ క్రీడోత్సవాలు ..... 8
మహిళా ప్రతినిధులకు మేలు 'అపార్డ్' శిక్షణ ..... 9
వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి ..... 11
గ్రామపంచాయితీలను సమర్ధవంతంగా నిర్వహించటం ఎట్లా? ..... 14
భార్యలను కొట్టడం భర్తల హక్కు కాదు, చట్టప్రకారం నేరం ..... 18
భారతదేశంలో పంచాయితీ రాజ్ వ్యవస్థ పరిణామం ..... 22
నీటి విషయంలో పరిశుభ్రత చాలా అవసరం..... 25
పంచాయితీ రాజ్ సంస్థలలో అకౌంటింగ్..... 31
సంతోష జీవనానికి పర్యావరణమే పునాది ..... 32
బాలకార్మిక వ్యవస్థ సమాజానికి శాపం..... 39
భవిష్యత్ చిత్రపటం (కథ) ..... 41
ఈ ఛార్టర్ అమలు పరిస్తే పంచాయితీలు బలోపేతం ..... 54
అఖిల భారత హౌస్ జర్నల్స్ పోటీల్లో 'స్థానిక పాలన' పత్రికకు అవార్డు ..... 57
పంచాయితీ రాజ్ సంస్థల ముందున్న సవాళ్లు..... 59
మన టి.వి. ఛానల్‌లో 'అపార్డ్-గ్రామ వికాసం'..... 62

# ఉగాదికి స్వాగతం

ఉగాది వసంతంతో ప్రారంభమై శిశిరంతో ముగుస్తుంది. ఇది ఒక సంవత్సర కాలం. 'యుగం' యొక్క 'ఆది' యుగాది. ఈ యుగాదే కాలక్రమంలో ఉగాదిగా మారింది. కాల మహిమను నిరంతరం గుర్తు చేసేదే ఉగాది.

మనకున్న కృత, త్రేత, ద్వాపర, కలియుగాల్లో మొదటిదైన కృతయుగాది చైత్రశుద్ధ పాడ్యమి తిథినాడు ప్రారంభమైంది. కృత యుగాది నాడు సృష్టి ఆరంభమైందని పెద్దల భావన కనుక, ప్రతి చైత్ర శుద్ధ పాడ్యమిని యుగాది (ఉగాది) పండుగగా జరుపుకుంటున్నాం.

ఉగాది అనేక శుభసూచకాల శుభారంభం. శిశిర రుతువు ముగిసి, లేలేత చిగుళ్లతో పూల సోయగాలతో వసంత రుతువు రారాణిలా ఏతెంచుతుంది. అంటే మన తెలుగువారి కొత్త సంవత్సరం వసంత రుతువుతో ప్రకృతి శోభాయమాన వైభవంతో ప్రారంభమవుతుంది.

వసంత రుతువును ఆనాటి కవులు అన్ని రకాలుగా వర్ణించారంటే, అది ఉగాది ప్రశంసే అనుకోవాలి.

నన్నయ్య ఏమంటారో చూడండి.

*కమ్మని సుమ సౌరభాలకు*
*నినదించే తుమ్మెదలు*
*మామిడి చివుళ్ల చుట్టూ*
*పంచమ స్వరాలు వినిపించే కోయిల మురిపాలు*
*పుష్పించిన అశోక, కౌంచుక*
*చంపక, చందన, కదళీ వనాలు*
*తామర కొలనుల మీదుగా*
*ప్రసరించే మందమల యానిలాలు*
*ఆదికవి కవితా విలాసాలు ఇవి*
*నేటి ఉగాది శారదకు*
*భావనా విన్యాస నీరాజనాలు*

*వసంతరుతువు ఎంత అందంగా, ఆహ్లాదంగా, కమనీయంగా, రమణీయంగా ఉంటుందో, అది మరెంత అందంగా ఉగాదికి నీరాజనాలర్పిస్తూ స్వాగతం పలుకుతుందో ఈ కవితలో గొప్పగా వర్ణించారు. వసంతరుతువులో ప్రకృతి యావత్తూ పరవశించి పోతూ, ఎంతో అందంగా ఉంటుంది. వాతావరణం మరీ వేడిగా, మరి చల్లగా లేకుండా ఆహ్లాదకరంగా ఉంటుంది.*

*అయితే, ఇటీవల ముప్పలా పరిణమించిన వాతావరణ కాలుష్యం ప్రభావంతో మన రుతువుల క్రమం కుడా దెబ్బ తింటున్నట్లు కన్పిస్తోంది. ఈ సమయానికి ఆహ్లాదకరంగా ఉండాల్సిన వాతావరణం భరించలేని ఉక్కపోతతో, వేడిగా తయారవుతోంది. జనవరి నెలనుంచే ఉష్ణోగ్రత తీవ్ర స్థాయికి చేరి ప్రతాపం చూపుతోంది.*

*వసంత రుతువు ఉగాది మనకు ఆహ్లాదకరంగా ఉండాలంటే, అట్లాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో కోకిలగానాలు వీనుల విందు చేస్తూ, శుభసంకేతాలు పంపిస్తూ, మన మనసులను ఆనంద డోలికల్లో ఊయల లూగించాలంటే... మనం వాతావరణాన్ని పరిరక్షించుకుని తీరాలి. కాలుష్యాన్ని దూరంగా తరమాలి. అప్పడే మనం ప్రకృతి రమణీయత మధ్య, షడ్రుచులతో, ఆధ్యాత్మిక భావనలతో ఉగాదికి స్వాగతం పలకగలం.*



**ఫణి కుమార్**




# గ్రామీణాభివృద్ధి
# వికేంద్రీకృత ప్రణాళిక కోర్సు ప్రారంభం

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రంగాలలో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు నిర్వహించటానికి 2009 జనవరి 1వ తేదీన జరిగిన ఒప్పందం మేరకు ఎ.ఎం.ఆర్. గ్రామీణాభివృద్ధి అకాడమీ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'గ్రామీణాభివృద్ధి వికేంద్రీకృత ప్రణాళికీకరణ' సర్టిఫికెట్ కోర్సును గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి శ్రీ కె.రాజు ఫిబ్రవరి 7న లాంఛనంగా ప్రారంభించారు.**

**మూ**డు నెలలు నిర్వహించే ఈ కోర్సులో భాగంగా ఎంపిక చేసిన అధికారులు, విద్యార్థులకు 'టిస్' తుల్జాపూరు, ముంబయి, హైదరాబాదులలో తరగతులు, క్షేత్ర పర్యటనలు నిర్వహించబడతాయని ఆయన తెలియజేసారు. ప్రజాప్రతినిధులకు వివిధ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణా బ్రోచర్లను కూడా శ్రీ కె.రాజు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అపార్డు కమీషనరు శ్రీ ఫణికుమార్ మాట్లాడుతూ, సమీప భవిష్యత్తులో గ్రామీణాభివృద్ధి రంగంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా వివిధ కార్యక్రమాల సక్రమ నిర్వహణకు నిపుణులైన సిబ్బంది ఆవశ్యకత దృష్ట్యా వివిధ యూనివర్శిటీలు, విద్యా సంస్థలతో కలసి సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ కోర్సులను నిర్వహించనున్నట్లు తెలియచేసారు.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ స్టడీస్, గుంటూరు వారితో కలిసి 'సమీకృత సహజవనరుల అభివృద్ధి' పై మూడు నెలల సర్టిఫికెట్ కోర్సును నిర్వహించనున్నట్లు, ప్రభుత్వ కార్యాలయాలలో ఓపెన్‌సోర్సు సాఫ్ట్‌వేర్ వినియోగాన్ని పెంచటానికి నేషనల్ ఇన్‌ఫార్మాటిక్సు సెంటరు, హైదరాబాదు, ఎంటర్‌ప్రైజెస్ డి.బి. సంస్థల సహకారంతో ఓపెన్ సోర్సు టెక్నాలజీపై సర్టిఫికెట్ కోర్సును నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హైదరాబాదు ఛైర్ పర్సను ప్రొఫెసర్ లక్ష్మీలింగం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ స్టడీస్ డైరక్టర్ ప్రొఫెసర్ మాంటే, 'టిస్' ఆసోసియేట్ ప్రొఫెసర్ నరేంద్రబాబు, అపార్డు ఫాకల్టీ డా॥ శివశంకర ప్రసాద్, శ్రీ కూర్మారావు తదితరులు పాల్గొన్నారు. ★



# ఉగాది

## ఒక ఉత్సవమే కాదు, ఒక కాల స్పృహ కూడా...

**'యుగాది కృత్, యుగావర్తః . . .**

**శ్రీ విష్ణు సహస్ర నామస్తోత్రంలోని నాల్గవ శతకం తొలి రెండు నామాలివి. (301, 302) 'యుగాది కృత్' అంటే యుగం యొక్క ఆదిని చేసేవాడు - యుగ ప్రారంభకుడు అని అర్థం. మరి, 'యుగావర్త' అంటే యుగాలను ఒకటి తరువాత ఒకటిగా ప్రవర్తింప జేసేవాడని అర్థం.**

శ్రీ మహావిష్ణువు లోక స్థితి కారకుడు - లోక సుస్థితిని, ప్రవృత్తిని పరిరక్షించేవాడు. అంతేకాదు, ఆయన కాల స్వరూపుడు. కాలమే ఆయన, ఆయనే కాలం. కాలం సృష్టి స్థితి లయాత్మకమయింది. సమస్త విశ్వంలో ప్రతిదీ కాల నియతమయి జన్మిస్తుంది, పెరుగుతుంది, నశిస్తుంది. ఈ క్రియల్లో కాల ప్రమేయమే తప్ప మరెవరి ప్రమేయమూ ఉండదు. మనం కావాలన్నా, వద్దన్నా మన 'వయస్సు' పెరుగుతూనే ఉంటుంది.

కాలం అనాద్యనంతమూ, అపరిచ్ఛేద్యమూ అయింది. ఈ మొదలయిన అంశాలన్నీ పరమేశ్వర లక్షణాలు. కాలంలో జన్మించి, కాలంలో ఉండి, కాలంలో లీనమవుతూ ఉంటుందీ సృష్టి అంతా. పోతనగారన్నట్లు '*ఎవ్వనిచే జనించు జగమెవ్వని యందున నుండు లీనమై ఎవ్వని యందు డిందు, పరమేశ్వరుడెవ్వడు? మూలకారణం బెవ్వ, డనాది మధ్యలయుడెవ్వడు, సర్వము తానయైన వాడెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్*' - కాలమునే శరణంబు వేడెదన్ అనవచ్చు. 'కాలోస్మి' అన్నది భగవంతుని గీతావాక్యం. కాగా, కాల-భగవత్తత్వాలు అభిన్నమయినవి.

అయితే, అనాద్యనంతమూ, అపరిచ్ఛేద్యమూ మొదలయిన లక్షణాలుగల భగవత్తత్వాన్ని ఏకమొత్తంగా భావించటానికి గానీ, దర్శించటానికిగానీ, అనుభవించటానికిగానీ అలవికాక మనకు అందుబాటుగా, మనకు తోచిన రీతులలోనికి తెచ్చుకొని దర్శిస్తున్నాం, అనుభవిస్తున్నాం. అట్లాగే కాల విషయం గూడా! కాలాన్ని ఏకమొత్తంగా భావించటం కుదురక, నిమిషాన్ని కనిష్ఠ పరిమితిగా, యుగాన్ని గరిష్ఠ పరిమితిగా రకరకాల తీరులుగా భావించి అనుభవిస్తున్నాం. ఈ యుగాలు నాలుగు - కృత, త్రేత, ద్వాపర, కలి యుగాలు. ఒక్కొక్క యుగ పరిమితి ఒక్కొక్క విధంగా ఉంటుంది. అన్నింటిలో ఎక్కువ కాల పరిమితి గలది కృతయుగం కాగా, తక్కువ పరిమితి కలది కలియుగం. మిగతా రెండు ఈ రెండింటి నడిమివి. ఇక్కడ గమనించవలసిన అంశం ఒకటి. ధర్మం ఆధారంగా ఈ యుగ పరిమితులు భావించబడ్డాయి.

కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో సమగ్రంగా ఆచరణలో ఉంటుందని, తరువాత వాటిలో నాలుగు వంతుల్లో ఒకటొక్కవంతుగా క్షీణిస్తుందనీ, కలిలో సాగుతున్న కొద్దీ ధర్మం లుప్తప్రాయమవుతూ ఉంటుందంటారు. (ప్రస్తుతం ఈ పరిస్థితిని మనం సర్వత్రా అనుభవిస్తూనే ఉన్నాం. అదట్లా ఉంచి -) ఇట్లా ధర్మప్రాతిపదికన భావింపబడిన ఈ నాలుగు యుగాలు ఒక వలయం తిరిగితే ఒక మహాయుగం. మన్వంతరాలు మహాయుగాల కన్నా ఎంతో పెద్ద పరిమితికలవి - ఒక్కొక్క మన్వంతరంలో (మనువు కాలంలో) ఎన్నెన్నో మహాయుగాలు. మనువులు పదునలుగురు. ఇట్లా లెక్కవేసుా పోదామంటే అంకెలకందని విషయమయిపోతుంది. అందుకని, ప్రస్తుతానికి ఇక్కడనే ఆగితే - ఇప్పుడు



మనం జీవిస్తున్నది వైవస్వత మన్వంతరం. ఈ మన్వంతరంలో ఇప్పటికే ఇరవయ్యేడు మహాయుగాలు గడిచిపోయినవి.

ఇరవయ్యెనిమిదవ మహాయుగంలోని చివరిదయిన కలియుగంలో మనం జీవిస్తున్నాం. ఈ కలియుగంలోనూ ఇప్పటికి అయిదువేల నూట పది సంవత్సరాలు గడిచిపోయినవి. ప్రతి సంవత్సరమూ ఈ లెక్కలన్నీ వేసి 'పంచాంగాలు' మనకు తెలియజేస్తున్నాయి.

ప్రతి యుగాంతాన ఒక 'ప్రళయం'. ప్రతి మహాయుగాంతాన ఒక మహాప్రళయం – జన క్షయం, సర్వ క్షయం జరుగుతుంది. ద్వాపరాంతాన జరిగిన 'ప్రళయం' కురుక్షేత్రంలో జరిగిన పద్దెనిమిది అక్షౌహిణుల సంహారం. (మహాయుగాంతంలో మహా జలప్రళయ మంటారు. అదేదో మనకు తెలిసే అవకాశమే లేదు. కాగా) ద్వాపర ప్రళయానంతరం కలియుగారంభం. కలియుగంలో ప్రస్తుతం నడుస్తున్నది మొదటి (నాల్గవ) భాగమే కాగా, ఒక యుగం తరువాత మరో యుగం, ఒక మహాయుగం తరువాత మరొక మహాయుగం – ఈ యుగాలను ప్రారంభించేది మహావిష్ణువు. ఈ యుగాల ప్రవృత్తి వ్యవస్థను నిర్దేశించి నిర్వహించేది మహావిష్ణువు. అందుకే ఆయనను 'యుగాది కృత్' అనీ, 'యుగావర్తః' అని వ్యాస భగవానుడు భారతం అనుశాసనిక పర్వంలో విష్ణు సహస్ర నామస్తోత్రంలో నిర్దేశించాడు.



అయితే, మనవంటి సామాన్యులకు ఈ యుగ / మహాయుగాదుల విషయం అంతగా మనస్సు కెక్కేదిగానీ, నిజానికి నిత్య వ్యవహారంలో ఉపయోగకరమయింది గానీ కాదనిపిస్తుంది. అందుకే మనం సాధారణంగా 'సంవత్స'రాలకు మాత్రమే పరిమితులమయి ప్రవర్తిస్తున్నా మనిపిస్తుంది. అందుకే కావచ్చు, మన **ఉగాది నుంచి వసంత నవరాత్రులు మొదలవుతాయి. తొమ్మిదవ దినం శ్రీరామనవమి. ఈ తొమ్మిది దినాలూ జపధ్యాన పూజా వ్రతాలు. ఇవన్నీ శ్రీరామనవమి నాడు రామచంద్ర భావనలో సమాప్తమవుతున్నాయి.**

ప్రాచీన జ్యోతిర్వేత్తలు సంవత్సర పర్వంత విషయాలనే మనకు అనువుగా వివరించి ఉంటారు. వారు మనకు ప్రసాదించిన ఖగోళ శాస్త్రీయాంశాలు మాత్రమే మనకు ఉపయోగ్యమయిన అంశాలనిపిస్తుంది.

సంవత్సరానికి పన్నెండు నెలలు. ఆరు ఋతువులు. రెండు అయనాలు. నెలకు రెండు – శుక్ల కృష్ణ పక్షాలు. ఇవే మనకు అనువయిన, అలవాటయిన లెక్కలు. ఈనాడు మనకు సంవత్సరారంభం చైత్ర శుద్ధ ప్రతిపత్తునుంచి (ప్రతిపత్తు = పాడ్యమి) అయితే, సంవత్సరారంభం విషయంలో రకరకాల మార్పులు సంభవించాయి.

'హేమాద్రి' అనే ఖగోళ శాస్త్రవేత్త ప్రకారం (చూ.చతుర్వర్గ చింతామణి వ్రతఖండం) చైత్ర శుద్ధ పాడ్యమి నాడు యుగాది సృష్టి ఆరంభమయింది అయితే సంవత్సరారంభం విషయంగా మతభేదాలున్నయి. కాలక్రమంలో మార్గశిర, పుష్య, మాఘ, ఫాల్గుణ, వైశాఖ మాసాలు సంవత్సరారంభ



మాసాలుగా గుర్తింపబడినయి కాని, చివరకు చైత్రశుద్ధ పాడ్యమి సంవత్సరాదిగా స్థిరపడిపోయింది. అందువల్ల ఈనాడు చైత్ర శుద్ధ పాడ్యమి సంవత్సరారంభంగా మనం పాటిస్తున్నాం. కాగా, ఈనాడే యుగాది జరిగిందనే తాత్పర్యంలో ఆ యుగాదికి ప్రతీకగా చైత్రశుద్ధ పాడ్యమి 'యుగాది'గా పాటించటం జరుగుతున్నట్లు అనిపిస్తుంది.

'యుగాది' అనేదే 'ఉగాది'గా తెలుగులో పరిణమించిందంటారు. అయితే 'యుగాది' అనే సంస్కృతపదం ప్రాంతీయ భాషల్లోకి వచ్చినప్పుడు పదాది 'య'కారం 'జ'కారంగా మారటం సహజం. యమ=జమ, యుగళబంధం = జుగల్‌బందీ. కాని యుగాది అనేది 'ఉగాది' – పదాదియకార లోపంతో 'ఉగాది'గా మారటం ఒక ప్రత్యేక విషయంగా భావించవలసి ఉంటుందేమో! భాషాశాస్త్రవేత్తలు విచారించవలసిన విషయమిది. కాగా మన 'ఉగాది' సంవత్సరారంభంగా గుర్తించబడటం ప్రత్యేకంగా గమనించవలసిన అంశం. ఉగాది మాత్రం సంవత్సరారంభంగా గుర్తించబడుతున్నదనేది ఒక నిశ్చిత విషయం.

సంవత్సరంలో మొట్టమొదటి పండుగ ఉగాది. ఏ కార్యమయినా ఆరంభంలో ఏ ఆటంకమూ లేకుండా సాగితే, చివరిదాకా ఏ ఆటంకమూ, ఏ అపశ్రుతీ ఉండదనేది ఒక విశ్వాసం. ఆ విధంగానే, సంవత్సరంలో మొట్ట మొదటిదయిన 'ఉగాది' ఏ విధమైన ఇబ్బంది లేకుండా సాగితే, సంవత్సరమంతా సరిగా సాగుతుందనేది ఈ విధమయిన గొప్ప విశ్వాసమే. అందుకే ఉగాదిని ఒక ఉత్సవంగా, ఒక పండుగ – పర్వంగా నిరాటంకంగా ఈ దేశ జనులు పాటిస్తారు.

ఆ దినం ఉదయమే అభ్యంగన స్నానం చేసి, నూతన వస్త్ర ధారణం చేస్తారు. ఉగాది పచ్చడి ప్రత్యేకంగా చేస్తారు. కొత్తబెల్లం, కొత్త చింతపండు, మామిడిపిందెలు, వేపపూత వంటివన్నీ ఈ కాలం మనకు ప్రసాదించే వస్తువులు. అందుకని వీటన్నిటిని కలిపి 'ఉగాది' పచ్చడి చేయటం, దాన్ని ఆస్వాదించటం ఒక ఆచారం. జీవితం 'సర్వ మధురం' కాదు. తీపి–చేదు అనుభవాలే జీవితం. ఈ భావనకు ప్రతీక 'ఉగాది పచ్చడి'. అది వివిధ రసాల సమన్విత వస్తువు. సంవత్సరమంతా మనం అనుభవించబోయే తీపి – చేదు అనుభవాలకు ప్రతీకగా ఈ పచ్చడిని ఆస్వాదించటం ఒక ఆచారమయి పోయింది.

ఉగాది నాటి ఒక ప్రధానమయిన అంశం 'పంచాంగ శ్రవణం'. పంచాంగమంటే అయిదు అంగాలు కలది అని అర్థం. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ అనే అయిదు అంశాలను మనకు తెలియజేసేది 'పంచాంగం'. ఈ అయిదంశాలను వివరిస్తూ, వాటికి అనుబంధంగా ఇతర

**ఆ దినం ఉదయమే అభ్యంగన స్నానం చేసి, నూతన వస్త్ర ధారణం చేస్తారు. ఉగాది పచ్చడి ప్రత్యేకంగా చేస్తారు. కొత్తబెల్లం, కొత్త చింతపండు, మామిడిపిందెలు, వేపపూత వంటివన్నీ ఈ కాలం మనకు ప్రసాదించే వస్తువులు. అందుకని వీటన్నిటిని కలిపి 'ఉగాది' పచ్చడి చేయటం, దాన్ని ఆస్వాదించటం ఒక ఆచారం. జీవితం 'సర్వ మధురం' కాదు. తీపి–చేదు అనుభవాలే జీవితం. ఈ భావనకు ప్రతీక 'ఉగాది పచ్చడి'. అది వివిధ రసాల సమన్విత వస్తువు. సంవత్సరమంతా మనం అనుభవించబోయే తీపి –చేదు అనుభవాలకు ప్రతీకగా ఈ పచ్చడిని ఆస్వాదించటం ఒక ఆచారమయి పోయింది.**

అనేకాంశాలను పంచాంగం మనకు తెలియజేస్తుంది.

నాటినుంచి మొదలయి సాగే పన్నెండు నెలల సంవత్సరంలో శుభాశుభాలకు సంబంధించిన విషయాలను పంచాంగం వివరిస్తుంది. ఈ వివరాలన్నీ సంవత్సరంలో మన ప్రవృత్తిని తీర్చి దిద్దుకోవాలనే ఒకానొక

'ప్రభవ'తో మొదలయి 'క్షయ'తో ఈ సంవత్సర క్రమం పూర్తవుతున్నది. ('క్షయ' అంటే అమంగళమనే తాత్పర్యంలో 'అక్షయ' అని గూడా వ్యవహరించటం ఉంది) కాగా, ఈ సంవత్సరాల పేర్లన్నీ సృష్టి – స్థితి లయాలను సూచిస్తున్నాయనిపిస్తుంది. ఇవన్నీ మనలో కాల స్పృహ కలిగిస్తున్నాయి.

ప్రకృతి గూడా తనలో కలిగే ఋతుపరివర్తనాలతో ఈ కాల స్పృహ కలిగిస్తున్నది. వసంతర్తువులో ఉగాది వస్తున్నది. వసంతానికి కుసుమాకరమని మరొకపేరు. ప్రకృతి అంతా పచ్చగా రకరకాల పూలతో బహువర్ణ శోభితంగా, మనోమోహకంగా ఉంటుంది.

సంవత్సరం శిశిరంతో పూర్తవుతున్నది. అప్పుడు ప్రకృతి అంతా మోడువారి ఆగామి పునః సృష్టి కోసం ఉన్ముఖంగా ఉంటుంది. ఈ విధంగా ఈ దిన, వార, మాస, సంవత్సరాల పరిగణనం ఖగోళంలోని నక్షత్ర గ్రహతారాదుల గమనాల భూమికపై సాగింది కావచ్చుగాని, ప్రకృతి మాత్రం ఎప్పటికప్పుడు మనకు 'కాల స్పృహ' కలిగిస్తూనే ఉన్నది. ఆ స్పృహలో జీవితాలను తీర్చిదిద్దుకొమ్మని ఉద్బోధిస్తున్నది. ఈ ఉద్బోధకు ఉగాది ఒక ఆరంభం.



జాగ్రత్తను కలిగిస్తాయి. మనకు అరవయి సంవత్సరాలు ఒక లెక్క. మన వారాలకు గ్రహాల పేర్లున్నాయి. తిథులకు పేర్లు లేవు. నెలలకు నక్షత్రాలను బట్టి పేర్లు ఉన్నాయి. మరి, సంవత్సరాలకు ఉన్న పేర్లు దేన్ని బట్టి ? ప్రస్తుతం ఉగాదితో మొదలవుతున్న సంవత్సరం విరోధి. ఇట్లా అరవయి సంవత్సరాలకు అరవై పేర్లు. ఈ పేర్లకు గ్రహనక్షత్రాలు భూమికి ఉన్నట్లు కన్పించదు. బహుశః ఆయా సంవత్సర కాలాల్లో ప్రకృతిలోనూ, సమాజంలోనూ కలిగే మార్పులకు, ప్రవృత్తులకూ స్థూల సూచకాలుగా ఈ పేర్లు ఉన్నాయనిపిస్తుంది.

ఉగాది నుంచి వసంత నవరాత్రులు మొదలవుతాయి. తొమ్మిదవ దినం శ్రీరామనవమి. ఈ తొమ్మిది దినాలూ జపధ్యాన పూజా వ్రతాలు. ఇవన్నీ శ్రీరామనవమి నాడు రామచంద్ర భావనలో సమాప్తమవుతున్నాయి.

మానవీయ జీవన మూల్యాలను, లక్ష్యాలను మనకివన్నీ ఉద్బోధిస్తున్నాయి. ఈ ఉద్బోధనలను ఎంతవరకు ఎట్లా పాటిస్తే అంతవరకు అట్లా ఫలితాలు. కాగా మన పండుగలు కేవలం వేడుకలు కావు. మనకు కాల స్పృహ కలిగించే సన్నివేశాలు. అందువల్లనే ఈ ఉగాది కూడా ఒక కాల స్పృహ.

**– ఆర్.కె.**




**నిత్యం కార్యాలయ విధులతో బిజీ బిజీగా గడిపే వారికి ఆదివారం వస్తుందంటే ఒక పండుగ. ఎంతో పడక్బందీతో ముందే వేసుకున్న ప్రణాళికా ప్రకారంగా ఆ ఆదివారాన్ని ఆనందంగా గడిపి, రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ సోమవారం నుండి విధులకు హాజరుకావడం ఉద్యోగస్తులకు పరిపాటి.**

# చిరస్మరణీయం గ్రామీణాభివృద్ధి శాఖ క్రీడోత్సవాలు

ఉద్యోగులు తమ విధులను ఒక వైపు నిర్వహిస్తూనే, అదే కార్యాలయ ఉన్నతాధికారుల మధ్య వారం రోజులపాటు వివిధ క్రీడా, సాంస్కృతిక, సాహిత్య ఉత్సవాల్లో పాల్గొనే చారిత్రాత్మక సంఘటన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ చరిత్రలో మొదటి సారిగా జరిగింది.

2009, జనవరి 20 నుడి 26 వరకు, ఒక వారం రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో పని చేస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖలోని ఐదు ప్రధాన కార్యాలయ విభాగాలైన కమీషనర్, గ్రామీణాభివృద్ధి శాఖ, ముఖ్య కార్యనిర్వాహణాధికారి, పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్), కమీషనర్ గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ (ఎ.ఎం. ఆర్. అపార్డ్). డైరెక్టర్, స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ మరియు సచివాలయ గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది మధ్య ఈ క్రీడోత్సవాలు జరిగాయి. సుమారు 21 క్రీడాంశాలలో జరిగిన ఈ పోటీలలో దాదాపు 300 మంది ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

క్రీడోత్సవాల్లో ప్రధానంగా 100 మరియు 400 మీటర్ల రన్నింగ్ రేస్, షటిల్, టేబుల్ టెన్నిస్, టగ్ – ఆఫ్ – వార్ పోటీలు పురుషులకు, మహిళలకు వేరువేరుగా నిర్వహించగా, టెన్నికాయిట్, లెమన్ స్పూన్ ప్రత్యేకంగా మహిళలకోసం, క్రికెట్, కబడ్డీ, ఫ్రాగ్ జంప్, క్రీడలు పురుషుల కోసం నిర్వహించబడ్డాయి. మ్యూజికల్‌చైర్స్, క్యారమ్స్, చెస్, మ్యూజిక్, జోక్స్, మిమిక్రీ, క్విజ్, మోనో యాక్షన్, పొయట్రీ తదితర పోటీలు అందరికీ కలిపి నిర్వహించడమైంది.

ఈ క్రీడోత్సవాలను భారీ స్థాయిలో వివిధ స్పోర్ట్స్ స్టేడియంలలో నిర్వహించడమైనది. ట్రాక్ ఈవెంట్స్ గోషా మహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో నిర్వహించగా, టెన్నికాయిట్, షటిల్, టేబుల్ టెన్నిస్ క్రీడలు విజయ నగర్ కాలనీలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలోనూ, కబడ్డీ నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో, క్రికెట్ సనత్‌నగర్ స్టేడియంలో నిర్వహించబడ్డాయి. అన్ని క్రీడలు అత్యంత ప్రొఫెషనల్ గా నిర్వహించబడ్డాయి. చాలా క్రీడలలో న్యాయ నిర్ణేతలుగా బయటి వారిని ఆహ్వానించడమైనది.

క్రీడోత్సవాల్లో చివరి రోజు జనవరి 26, 2009న అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. బాగ్ లింగంపల్లిలోని ఆర్.టి.సి కళ్యాణ మండపంలో జరిగిన ముగింపు వేడుకలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు డాక్టర్ జి. చిన్నారెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేయగా, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ కె. రాజు సమావేశానికి అధ్యక్షత వహించారు. వీరితో పాటుగా వేదికపై 'సెర్ప్' ముఖ్య కార్యానిర్వాహణాధికారి శ్రీ టి. విజయకుమార్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ శ్రీమతి ఎ. శాంతికుమారి, అపార్డ్ కమీషనర్ శ్రీ జి. ఫణికుమార్, రామానంద తీర్థ డైరెక్టర్ డా॥ హనుమంత రావుతో పాటుగా గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ కమీషనర్ మరియు క్రీడోత్సవాల నిర్వహణా కమిటీ ఛైర్మన్ డా॥ కె. తిరుపతయ్య ఆసీనులయ్యారు.

ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు డా॥ చిన్నారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా పనిచేస్తున్నందుకు తానెప్పుడూ గర్వపడుతుంటానని, ఇందుకు కారణం ఈ శాఖలో పని చేస్తున్న ఉన్నతాధికారులంతా పేదలంటే ఎంతో ప్రేమ ఉన్నవారని, వారి ఆలోచనా విధానాలెప్పుడూ పేదల సంక్షేమం చుట్టూ తిరుగుతుంటాయని అన్నారు. ఇందిరాక్రాంతి పథం, గ్రామీణ ఉపాధి హామీ పథకం, తదితర భారీ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు సంపాదిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. ప్రిన్స్‌పల్ సెక్రటరీ శ్రీ రాజు మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పోటీలు ఇక ముందు జిల్లా స్థాయిలో కూడా జరగాలని, ఏటా జనవరి 26న రాష్ట్ర స్థాయి అవార్డుల ఉత్సవాలను జరుపుకోవాలని అన్నారు. అంతకు ముందు క్రీడోత్సవాలని ప్రతిబింబించే విధంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను మంత్రి, ఇతర ఉన్నతాధికారులు తిలకించారు.

అవార్డుల ప్రధానోత్సవంలో ఉద్యోగస్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొనటం, అనంతరం ఏర్పాటు చేసిన విందులో అందరూ పాల్గొనటం మరుపురాని మధుర ఘట్టంగా గ్రామీణాభివృద్ధి చరిత్రలో నిలిచి

– కె. మనోహరాచారి

# మహిళా ప్రతినిధులకు మేలు అపార్డ్ శిక్షణ

**భారత రాజ్యాంగం తన ప్రవేశికలో ఇచ్చిన సామాజిక న్యాయం, సమానత్వ వాగ్దానం, ఆర్టికల్స్ 14, 15, 16 లలో ప్రతిబింబించగా, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా అది ప్రతిఫలించి, ప్రజ్వలించి మహిళలకు కూడా పదవులలో, నాయకత్వంలో నిర్ణయాధికారంలో స్థానం పదిలపరచబడి, పటిష్టపరచబడింది. మహిళా సాధికారత దిశగా ఇది ఓ ముందడుగు. పంచాయితీ రాజ్ సంస్థలలో ఎన్నికైన మహిళా ప్రజా ప్రతినిధుల సాధికారత అపార్డ్ శిక్షణ ద్వారా మరింత పదును తేలుతుంది.**

దేశవ్యాప్తంగా ఈనాడు మొత్తం 542 జిల్లాలలో 5,810 మంది జిల్లా ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు, 6094 బ్లాకు/మండల పంచాయతీలలో 58,191 మంది యం.పి.టి.సి సభ్యులు మరియు 2,32,855 గ్రామపంచాయతీలలో 9,75,057 మంది వార్డు సభ్యులు కలిసి మొత్తం 10,39,058 మంది మహిళలు పంచాయతీ రాజ్ సంస్థలలో ఎన్నుకోబడగా, రాష్ట్రంలోని 22 జిల్లాలలో హైదరాబాదు మినహాయించి, 21 జిల్లా ప్రజా పరిషత్‌లకు గాను 7 మంది మహిళలు చైర్ పర్సన్లు గాను, 1104 మండలాలకు గాను 368 మంది మండల అధ్యక్ష పదవులలోను అదే సంఖ్యలో జిల్లా ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులుగాను ఎన్నుకోబడ్డారు. 14 వేల మంది మండల ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులుగాను, 22 వేల గ్రామ పంచాయతీలలో 3వ వంతు సర్పంచులుగాను, దాదాపు 70,000 మంది వార్డు సభ్యులు గాను మహిళలు ఎన్నుకోబడ్డారు. ఐతే ఇదంతా రాజ్యాంగ పరమైన, చట్టపరమైన ప్రక్రియ.

### వీరి పరిస్థితి ఎలావుంది?

చట్టపరమైన పదవులలో ఎన్నుకోబడిన వారికి ఆ పదవుల ద్వారా, నిర్వర్తించవలసిన విధులు, బాధ్యతలు ఉంటాయి. విభిన్న వ్యక్తులతో, సంస్థలతో, అధికారులతో వ్యవహరించవలసి ఉంటుంది. ఆయా సందర్భాలలో మెలగాల్సిన తీరు, స్వయంగా నిర్ణయాలు తీసుకోగల చొరవ, నలుగురిని కలుపుకుపోగల, ఒప్పించగల నేర్పు, ఓర్పు ఉండాలి. ఎన్నికలలో గెలవగానే, పదవులను అధిష్టించగానే ఇవన్నీ రావు. ఏళ్ళ తరబడి ప్రజా జీవనంలో మెలగటం ద్వారా, ఆచరించడం ద్వారా అలవడుతుంది.

పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి ఏర్పడి కేవలం 15 సంవత్సరాలే కావడం చేత, ఈ సంస్థలు పరిపుష్టం కావడానికి చాలినంత సమయం లేకపోవడం చేత, ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు, ముఖ్యంగా మొదటి సారిగా ప్రజా ప్రతినిధులుగా ప్రభుత్వ పదవులలో ప్రవేశించే యస్.సి., యస్.టి., బి.సి. మరియు మహిళా ప్రజా ప్రతినిధులకు పైన పేర్కొన్న నాయకత్వ లక్షణాలన్నీ ఉండాలని కోరుకోవడం అసమంజసం, అసహజం. పైగా ప్రతి ఐదు ఏళ్ళకు జరిగే ఎన్నికలలో ఒకే వ్యక్తి అదే పదవిలో, అదే స్థాయిలో ఎన్నికయ్యే అవకాశం ఈ ఎన్నికల ప్రక్రియలో లేదు. కనుక, ఈ సంస్థలలో ఎన్నికయ్యే ప్రజా ప్రతినిధులకు నిరంతరం శిక్షణ ద్వారా పరిపాలనా దక్షతను అందించడమే సముచితమైన, సమంజసమైన చర్య.

### సామర్థ్యాల పెంపు దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు

2004 మే 27న కేంద్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖను ఏర్పాటు చేసింది. పంచాయతీ రాజ్ సంస్థలు "స్థానిక స్వయం ప్రతిపత్తి గల ప్రభుత్వాలు"గా రూపాంతరం చెందే దిశగా వాటి సామర్థ్యాల పెంపును తన కర్తవ్యాలలో ప్రధానంగా ఈ శాఖ పేర్కొంది. ప్రభుత్వ సంస్థలలో పని చేసే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా కనీసపు శిక్షణ పొందాలని "నేషనల్ ట్రైనింగ్ పాలసీ" నిర్దేశించింది. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ ప్రతినిధులకు శిక్షణ ఇచ్చే బాధ్యతను రాష్ట్రప్రభుత్వం 'అపార్డ్'కు అప్పగించింది. రాష్ట్రంలో మూడు సార్లు పంచాయతీ రాజ్ సంస్థలకు ఎన్నికలు జరగగా, 'అపార్డ్' ఈ మూడు సార్లు ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు సమర్థవంతంగా శిక్షణ నిర్వహించింది. 2006లో మూడవసారి ఎన్నికలు జరిగిన ఆరు నెలలోనే మూడంచల ప్రజా ప్రతినిధులకు మొదటి దశ శిక్షణ పూర్తి చేసింది.

### రెండవ దశ శిక్షణ – మహిళా ప్రజా ప్రతినిధులకు ప్రత్యేకం

రెండవ దశ శిక్షణ జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు ఎన్నికైన మొత్తం మహిళా ప్రజా ప్రతినిధులకు ప్రత్యేకించబడింది.

### శిక్షణాంశాలపై వర్క్ షాపు

మహిళా ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నందున వారికై ఏ ఏ అంశాలలో ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడానికి మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విస్తరణ శిక్షణా సంస్థ (ఇ.టి.సి.)ల మరియు 'అపార్డ్' ఫాకల్టీ సభ్యులతో నవంబరు 2008 మొదటి వారంలో ఒక వర్క్ షాపును 'అపార్డ్'లో నిర్వహించడం జరిగింది. మహిళా చట్టాలు, ఆరోగ్యం, విద్య, నాయకత్వం, సమావేశాల నిర్వహణ, వివిధ పథకాలకు అసలైన లబ్దిదారుల ఎంపికలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సూక్ష్మ ప్రణాళిక రూపకల్పనలో ప్రజలను భాగస్వామ్యం చేసే పద్ధతులు మొదలైనవి శిక్షణాంశాలుగా ఉండాలని, శిక్షణ పూర్తిగా భాగస్వామ్య పద్ధతిలో, చర్చా గోష్ఠి రూపంలో ఉండాలని నిర్ణయించడం జరిగింది. ప్రత్యేకించి శిక్షకులుగా అందరూ మహిళలే ఉండాలని నిర్ణయించారు.

### శిక్షణా కేంద్రాల ఎంపిక

జిల్లా ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులకు 'అపార్డ్' నందు, యం.పి.టి.సి.లకు, సర్పంచులకు సమితి స్థాయిలోను, వార్డు సభ్యులకు మండల స్థాయిలలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది. విస్తరణ శిక్షణా కేంద్రాలు (ఇ.టి.సి.)న్న జిల్లాలలో మాత్రం సర్పంచు, యం.పి.టి.సి.లకు ఇ.టి.సి.లలో నే శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

### శిక్షకులకు శిక్షణ (టి.ఓ.టి)

ప్రతి జిల్లా నుండి పంచాయతీ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్.జి.ఓ.ల నుండి మండలానికి ఇద్దరు లేక ముగ్గురు

మహిళలను ఎంపిక చేసి సంబంధిత ఇ.టి.సి.లలో నవంబరు రెండవ, మూడవ వారాలలో ఐదు రోజుల పాటు శిక్షకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షకుల ఎంపిక, మండల స్థాయిలో, సమితి స్థాయిలో శిక్షణా కేంద్రాల ఎంపిక జిల్లా పరిషత్ ట్రైనింగ్ సెల్ నుండి జిల్లా రిసోర్స్ పర్సన్లు కీలక పాత్ర వహించారు. శిక్షకులు ముగ్గురు ఒక టీముగా ఏర్పడి శిక్షణకు అవసరమైన చార్టులు, టైం టేబుల్ మొదలైనవి టి.ఓ.టి నిర్వహణాకాలంలోనే నిర్ణయించుకోవడం జరిగింది.

### శిక్షణ ఏర్పాట్లు

జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి నుండి శిక్షణకు సంబంధించి ఆదేశాలు జారీ చేయబడ్డాయి. జిల్లా పరిషత్ సమీక్షా సమావేశాలలోనూ శిక్షణాంశాన్ని ప్రస్తావించి మహిళా ప్రజా ప్రతినిధులకు శిక్షణకు అవసరమయిన ఏర్పాట్లు చేయవలసినదిగా ఆదేశించారు. కొన్ని జిల్లాల్లో నెట్ కాన్ఫరెన్స్‌ల ద్వారా మండలాలకు ఆదేశాలిచ్చారు. పత్రికల ద్వారా ప్రచారం కావించబడినది. మహిళా ప్రజా ప్రతినిధులకు వ్యక్తిగత లేఖలు, మౌఖిక సమాచారం ద్వారా శిక్షణకు ఆహ్వానించడం జరిగినది.

### శిక్షణ జరిగిన విధానము

సమితి స్థాయి లో, ఇ.టి.సి.ల స్థాయిలో సర్పంచులు, యం.పి.టి.సి. సభ్యులకు మరియు మండల స్థాయిలో వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. శిక్షణార్థులకు పెన్ను, ఫోల్డరు, నోట్ బుక్కులు అందించారు. శిక్షణకు హాజరైనవారికి ఉదయం అల్పాహారం, టీ మధ్యాహ్నం భోజనం, టీ ఏర్పాటు చేయబడినది. రాత్రి పూట బస, భోజనము ఏర్పాటు చేయబడినాయి. ఇ.టి.సి. నుండి జిల్లా కో-ఆర్డినేటర్లు, జిల్లా పరిషత్ నుండి జిల్లా రిసోర్సు పర్సన్లు శిక్షణా కేంద్రాలను సందర్శించారు. అపార్డు నుండి ఇ.టి.సి.లకు పర్యవేక్షకులను పంపించడం జరిగినది. అపార్డు నుండి కోర్సు డైరెక్టరు శ్రీమతి శారద ఈ మొత్తం శిక్షణా కార్యక్రమాన్ని ఆద్యంతం పర్యవేక్షించారు.

### శిక్షణా మూల్యాంకనం

ఏ శిక్షణా కార్యక్రమం విజయానికైన దానికి హాజరైన సభ్యుల సంఖ్య లేదా హాజరు శాతమే గీటు రాయి. పలు విధాల చర్యలు తీసుకున్నపటికీ, మహిళా ప్రజా ప్రతినిధుల హాజరు శాతం ఆశించినస్థాయిలో జరగలేదు.

మహిళా సర్పంచుల శాతం వివిధ జిల్లాలలో 50 నుండి 55 శాతం, యం.పి.టి.సి. సభ్యులు 30 నుండి 36 శాతం కాగా వార్డు సభ్యులు 40 నుండి 50 శాతం మాత్రమే హాజరయ్యారు. దళిత వర్గాలకు చెందిన సభ్యుల సంఖ్య మరీ స్వల్పం.

- ❖ హాజరైనవారిలో అధిక శాతం మహిళా ప్రజా ప్రతినిధులు నిధులు/ ఆర్థికాంశాల పైనే దృష్టి సారించారు.
- ❖ పురుషుల సహకారంతోనే వచ్చిన మహిళలు మగవారి సమయానుకూలతను బట్టి క్లాసులో ఉన్నారు.
- ❖ ఎక్కువ మంది మహిళా ప్రతినిధులు రైతులు లేదా వ్యవసాయ కూలీలు కావడంచేత ఆ పనులలో నిమగ్నమవ్వడంచేత హాజరుకాలేక పోయినారు.
- ❖ దళిత వర్గాల మహిళా ప్రజా ప్రతినిధులు కొందరు రవాణా చార్జీలు సైతం లేక శిక్షణా కేంద్రాలకు రాలేక పోయారు.
- ❖ మహిళా ప్రజా ప్రతినిధుల శిక్షణకు శిక్షకులుగా మహిళలని ఎంపిక చేయడం ఒక వినూత్న ప్రయోగం. అయితే మండల స్థాయిలో అందుబాటులో గల కొద్ది మంది నుండే చురుకైన మహిళలనే ఎంపిక చేసినప్పటికీ వారు ఆశించిన స్థాయిలో శిక్షణను ఇవ్వలేకపోయారు.
- ❖ ఒక స్థాయి ప్రజా ప్రతినిధుల శిక్షణకు ఆ స్థాయి టి.ఓ.టి నిర్వహించి తదుపరి ప్రజా ప్రతినిధులకు శిక్షణ పూర్తి అయిన తరువాత మరో శిక్షణా కార్యక్రమానికి టి.ఓ.టి నిర్వహించడం ఆనవాయితీ. అలా కాక మూడు స్థాయిలకు ఒకేసారి టి.ఓ.టి. నిర్వహించడం వలన శిక్షకులలో స్పష్టత కొరవడింది.
- ❖ తాము పని చేస్తున్న మండలము దాటి వేరే మండలానికి వెళ్ళి శిక్షణని ఇవ్వడానికి శిక్షకులు ఉత్సుకత చూపలేదు.

### శిక్షణ సమర్థవంతంగా నిర్వహించటానికి తీసుకోదగిన చర్యలు

- ❖ సర్పంచులకు, యం.పి.టి.సి. సభ్యులకు సమితి స్థాయిలోనూ, వార్డు సభ్యులకు క్లస్టరు స్థాయిలలో శిక్షణ ఇవ్వాలి.
- ❖ హాజరైన ప్రజా ప్రతినిధులకు కనీస దినసరి భృతి, ప్రయాణ ఖర్చులు ఇవ్వాలి.
- ❖ శిక్షణకు తీసుకురావడానికి, వదలి రావడానికి గ్రామ స్థాయి అధికారిని బాధ్యుణ్ణి చెయ్యాలి.
- ❖ సమర్థులైన శిక్షకులని ఎంపిక చేయడానికి సి.ఇ.ఓ. లకు తగిన సమయం ఇవ్వాలి.
- ❖ శిక్షణకు సంబంధించిన బడ్జెట్‌ను మండలాలకు ముందుగానే పంపాలి.
- ❖ దైనందిన సమస్యల ప్రాతిపదికగా శిక్షణాంశాలని మెరుగు పర్చాలి.
- ❖ సర్పంచు, వార్డు సభ్యుల శిక్షణా బాధ్యతను జిల్లా పంచాయతీ అధికారికి అప్పగించాలి.
- ❖ శిక్షణ పొందే ప్రజా ప్రతినిధుల స్థాయికనుగుణంగా ప్రశిక్షకుల ఎంపిక జరగాలి. ఉదాహరణకు యం.పి.టి.సి. సభ్యులకు శిక్షణ ఇవ్వడానికి టీములో కనీసం మండల స్థాయి అధికారి ఒకరు ఉండాలి.
- ❖ ప్రతి స్థాయి సభ్యుల శిక్షణకు ప్రత్యేక టి.ఓ.టి. నిర్వహించాలి.
- ❖ జిల్లా పరిషత్ సమీక్షాసమావేశాలలో శిక్షణాంశాన్ని కూడా చేర్చి, ఏ ఏ కేటగిరీలకు శిక్షణ ఇవ్వాల్సి ఉన్నది, శిక్షణా కేంద్రాల ఎంపిక, సదుపాయాలు మొదలైనవి చర్చించాలి.
- ❖ జిల్లా, మండల స్థాయిలో శిక్షణకు ముందు, తరువాత కార్యాచరణ ప్రణాళిక ఉండాలి.
- ❖ సమర్థవంతంగా శిక్షణ నిర్వహించిన అధికారులకు ప్రత్యేక గుర్తింపు/ ప్రోత్సాహకాలు ఇవ్వాలి.
- ❖ ప్రజా ప్రతినిధుల శిక్షణగూర్చి జిల్లా కలక్టరు, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్‌లు కూడా తగు సహాయ సహకారాలిచ్చి ప్రోత్సహించాలి.

### ముగింపు


మహిళా సాధికారత అనేది ఒక్క సారిగా చేకూరేది కాదు. అది దీర్ఘకాలిక ప్రయాణం, పురుషాధిక్య సమాజ విలువలు, నిరక్షరాస్యత, గృహ సంబంధిత బాధ్యతలు మహిళా సాధికారతకు ప్రతి బంధకాలు. ఐతే వాటిని నెమ్మదిగా అధిగమిస్తూ, ప్రజా సంబంధిత కార్యకలాపాలలో పాల్గొనడం, అక్షరాస్యతను పెంచుకోవడం, గ్రామాభివృద్ధి కోసం సూక్ష్మ ప్రణాళికల తయారీలో చురుకైన పాత్ర పోషించటం మొదలైన చర్యల ద్వారా మాత్రమే మహిళలు సాధికారత దిశగా బలమైన అడుగులు వేయగలుగుతారు. ఆ రకమైన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని, ఆత్మ స్థైర్యాన్ని వారి వైఖరులలో గుణాత్మకమైన మార్పును తేవడం కోసం శిక్షణ తప్పక ఉపయోగపడుతుంది. అలాంటి శిక్షణ ఇచ్చే బాధ్యతను నెరవేర్చడానికి 'అపార్డ్' ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుంది. తద్వారా మానవ అభివృద్ధి సూచికలలో అగ్రభాగాన నిలవడానికి అందరూ కలిసి ముందడుగు వేద్దాం.

**– ఎ. గవర్రాజు, ఫాకల్టీ, ఇ.టి.సి., రాజేంద్ర నగర్, హైదరాబాద్**

# వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి - ఆంధ్రప్రదేశ్‌లో అమలు తీరుతెన్నులు

**స్వాతంత్ర్యానంతరం దేశాన్ని అభివృద్ధి పథంలో నడపటానికి, ఆర్థికవృద్ధి సాధించటానికి ప్రణాళికా బద్ధమైన విధానాన్ని అవలంబించిన భారతదేశం వివిధ రకాలయిన ప్రణాళికా వ్యూహాలను అమలుచేసింది. దేశంలో ప్రాంతాలవారీగా నెలకొని ఉన్న విభిన్న భౌగోళిక పరిస్థితులు, శీతోష్ణస్థితి, సహజవనరుల లభ్యత, సామాజిక, చారిత్రాత్మక పరిస్థితుల నేపథ్యంలో, నేటికీ పలు రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడి ఉండటమే కాక అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో సైతం పలు ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండి పోయాయి.**

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పారిశ్రామికీకరణ దోహదపడుతుందని ప్రణాళికా వ్యూహకర్తలు భావించి రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఒరిస్సా, బీహారు, మధ్యప్రదేశ్ లాంటి వెనుకబడిన రాష్ట్రాలలో పెద్ద ఎత్తున కేటాయింపులు జరిపి భారీపరిశ్రమలు స్థాపించినప్పటికీ రాజకీయ సమీకరణల నేపథ్యంలో, కాలక్రమేణా ఈ కేటాయింపులలో పెద్ద రాష్ట్రాలకే సింహభాగం దక్కటం చేత నేటికీ ప్రాంతాల వారీగా అభివృద్ధిలో అసమానతలు రూపుమాసిపోలేదు.



అంతేగాక పంజాబు, హర్యానా, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాలు సరళీకృత విధానాలతో ప్రైవేటు పెట్టుబడులను సైతం ఆకర్షించటానికి పలు ప్రోత్సాహకాలు ఇవ్వటంతో అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితమైన పరిస్థితులు ఉత్పన్నం అయ్యాయి. అందువల్ల స్థానిక ప్రాంతాలలో అభివృద్ధికి నిరోధకాలను గుర్తించి, స్థానికంగా లభించే వనరులను అభిలాషణీయమైన పద్ధతిలో ఉపయోగించుకుంటూ, సంతులిత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించటానికి ఆరవ పంచవర్ష ప్రణాళిక (1980-85) ప్రాధాన్యత ఇచ్చింది. జాతీయ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కమిటీని కూడా ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలోనే ఏర్పాటు చేసారు.

ఏడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో (1985-90) ప్రాంతీయ అసమానతలు తగ్గించటానికి మానవవనరుల అభివృద్ధి కూడా కీలకాంశం అన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకొని కరువు ప్రాంతాలు, ఎడారి ప్రాంతాలు, పర్వత ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వ్యక్తిగత ప్రయోజనాలతో కూడిన ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమాలను అమలులోకి తీసుకొనివచ్చారు. దేశంలో 1991 దశకంలో ప్రవేశపెట్టిన సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో, దేశంలోని అభివృద్ధి చెందిన ప్రాంతాలలోనే ప్రైవేటు పెట్టుబడులు కేంద్రీకృతమయ్యే పరిస్థితుల దృష్ట్యా, ప్రభుత్వ పెట్టుబడులు ద్వారా వెనుకబడిన ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు ఎనిమిది, తొమ్మిదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది.

పదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో (2002-2007) వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దమొత్తంలో నిధుల కేటాయింపు, అభివృద్ధిలో స్థానిక సంస్థలను భాగస్వాములను చేయటం, పథకాల అమలులో ప్రజా భాగస్వామ్యాన్ని సాధించటం వంటి బహుముఖ వ్యూహాన్ని అవలంబిస్తూ రాష్ట్రీయ సమ వికాస యోజన పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం ప్రధానంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రాంతీయ అసమానతలు తగ్గించటం, అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయుటం, పేదరికం, నిరుద్యోగితను తగ్గించటం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చటం వంటి అంశాలపై దృష్టి సారించడానికి ఉద్దేశించబడింది. కానీ ఈ పథకంలో ఆశించిన మేర ప్రజా భాగస్వామ్యం సాధించటంలోను, స్థానిక సంస్థలను భాగస్వామ్యులను చేయటంలోనూ నిర్దేశిత లక్ష్యాలను చేరలేకపోయింది. ప్రాంతీయ అసమానతలపై 2005లో ప్లానింగు కమీషను ఏర్పాటు చేసిన అంతర్ మంత్రిత్వ టాస్క్‌ఫోర్సు సిఫారసు మేరకు పదకొండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో అభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బ్యాక్‌వర్డు రీజియన్సు గ్రాంట్ ఫండ్-బి.ఆర్.జి.ఎఫ్) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

**వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి**

దేశవ్యాప్తంగా అత్యల్ప మానవాభివృద్ధి సూచికలు, మౌలిక

సదుపాయాల కొరత, వర్షాధార వ్యవసాయ భూముల సాంద్రత ఎక్కువగా గల 250 జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా పరిగణనలోని తీసుకొని 2007 సం. నుండి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా స్థాయి అభివృద్ధి సూచికల ఆధారంగా నేరుగా జిల్లాలకు నిధులు విడుదల చేయటం ఈ పథకం ప్రత్యేకత. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతంలో హైదరాబాదు మినహాయించి మిగిలిన 9 జిల్లాలు, రాయలసీమలో కర్నూలు మినహాయించి మిగిలిన 3 జిల్లాలు, కోస్తా ఆంధ్ర ప్రాంతంలో విజయనగరం జిల్లాను కలిపి మొత్తం 13 జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా గుర్తించటం జరిగింది. 2007-08 ఆర్థిక సంవత్సరం నుండి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రూ. 4670 కోట్లు ప్రతి ఏటా కేటాయిస్తోంది. ఈ పథకం క్రింద గుర్తించబడిన జిల్లాల్లో ప్రస్తుతం జిల్లా అభివృద్ధి కొరకు అమలులో ఉన్న అన్ని పథకాల నిధులను సంఘటిత పర్చినప్పటికీ, ఇంకా అభివృద్ధి పనులను చేపట్టటానికి నిధులు అవసరమైనచో అటువంటి లోటును భర్తీ చేయడానికి ఈ బి.ఆర్.జి.ఎఫ్ నిధులను అందచేయటం జరుగుతుంది.

### ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యాలు

- ❖ మౌలిక వసతుల లభ్యతలో గల కీలక అంతరాలను తగ్గించటం
- ❖ పంచాయతీ, మునిసిపాలిటీ స్థాయిలో స్థానిక అవసరాలు తీర్చటానికి భాగస్వామ్య పద్ధతిలో ప్రణాళికలను తయారు చేయటం, అమలు చేయటం, పథకాల అమలు తీరుని పర్యవేక్షించటానికి వీలుగా స్థానిక సంస్థల సామర్థ్యాలను పెంచడం.
- ❖ ప్రణాళికా నిపుణుల సేవలను స్థానిక సంస్థలకు అందచేయటం.
- ❖ పంచాయతీ రాజ్ సంస్థలకు బదలాయించిన విధులు, కార్యక్రమాలు నిరహించటంలో సంస్థల నిర్వహణా సామర్థ్యాలను పెంచటం.

బి.ఆర్.జి.ఎఫ్. కార్యక్రమం క్రింద జిల్లాలకు నిధులు రెండు ప్రత్యేక పద్దుల క్రింద విడుదల అవుతాయి. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారుల సామర్థ్యాలను మెరుగుపరచడానికి ప్రతి జిల్లాకు రూ.ఒకకోటి చొప్పున సామర్థ్యాల పెంపుదల నిధి పద్దు కింద, భాగస్వామ్య పద్ధతిలో గుర్తించబడిన పనులు నిర్వహించుటకు గాను అభివృద్ధి నిధి పద్దు క్రింద నిధులు విడుదల అవుతాయి. కేంద్ర స్థాయిలో బి.ఆర్.జి.ఎఫ్. కార్యక్రమానికి కేటాయించిన అభివృద్ధి నిధి పద్దు క్రింద కేటాయించబడిన మొత్తం నిధులలో ప్రతి జిల్లాకు ప్రతి సంవత్సరం కనీసం రూ. 10 కోట్లు కేటాయించగా, ఇంకనూ మిగిలిన నిధులలో 50 శాతాన్ని జిల్లా విస్తీర్ణం, మరొక 50 శాతం జిల్లా జనాభా ప్రాతిపదికన జిల్లాలకు నేరుగా కేటాయించడం జరుగుతుంది. జిల్లాలకు కేటాయించిన నిధులతో స్థానిక ప్రాంతాలలో అవసరాల ప్రాధాన్యతా ప్రాతిపదికన భాగస్వామ్య పద్ధతిలో తయారు చేసుకొన్న ప్రణాళికలలోని పనులను చేపట్టడానికి గ్రామపంచాయతీలకు 50 శాతం, మండల పరిషత్తులకు 30 శాతం, జిల్లా పరిషత్తుకు 20 శాతం, జిల్లాలోని మునిసిపాలిటీలకు జనాభా ప్రాతిపదికన నిధులు విడుదల అవుతాయి.

### జిల్లా అభివృద్ధి ప్రణాళిక తప్పనిసరి

బి.ఆర్.జి.ఎఫ్. నిధులను జిల్లాలు పొందాలంటే జిల్లా అభివృద్ధి ప్రణాళికా రచనను తప్పనిసరిగా చేపట్టాలి. స్థానిక ప్రాంతాలలో లభ్యమయ్యే సహజ, మానవ, ఆర్థిక వనరుల ప్రాతిపదికగా జిల్లా స్థాయిలో రూపొందించే అభివృద్ధి ప్రణాళికల ద్వారా ప్రాంతీయ అసమానతలను తగ్గించి త్వరితగతిన అభివృద్ధి సాధించటానికి ఈ బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం వెసులుబాటు కల్పిస్తోంది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 243 జి లో సూచించిన విధంగా స్థానిక ప్రాంతాలలో సామాజిక వికాసానికి, ఆర్థిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే స్థానిక ప్రభుత్వాలుగా పంచాయతీ రాజ్ సంస్థలు రూపాంతరం చెందే పరిణామానికి ఈ బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం దోహదం చేస్తున్నదనటంలో సందేహం లేదు. జిల్లా/మండల/గ్రామ స్థాయిలలో ప్రణాళికా రచనకు అవసరమయ్యే ప్రణాళికా నిపుణుల సేవలను పొందటానికి కూడా ఈ కార్యక్రమం క్రింద అవకాశం ఉంది. ఈ నిధులు నూరుశాతం నిబంధితం కానందున గ్రామాలలో దీర్ఘకాలికంగా నెలకొని ఉన్న చిన్న చిన్న అభివృద్ధి నిరోధక సమస్యలను తీర్చటానికి పంచాయతీ రాజ్ సంస్థలకు ఒక చక్కని సాధనంగా ఈ నిధులు ఉపయోగపడుతాయి. పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ఆరోగ్య ఉప కేంద్ర భవనాలు, గ్రామీణ పశుగణ కేంద్రాలు, త్రాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చుకోవటానికి స్థానిక సంస్థలకు ఈ నిధులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. విద్య, వైద్యం, ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుద్ధ్యం వంటి కనీస సేవల కల్పనకు ఈ నిధులను వినియోగించినట్లయితే ప్రజల జీవన ప్రమాణాలలో కూడా గణనీయమైన ప్రగతిని సాధించటానికి అవకాశం ఉన్నది.

### ఆంధ్రప్రదేశ్‌లో బి.ఆర్.జి.ఎఫ్. అమలు తీరు

ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కార్యక్రమాన్ని అమలు చేయటానికి 13 జిల్లాలు (ఆదిలాబాదు, కరీంనగర్, ఖమ్మం, మెదక్, వరంగల్, నిజామాబాదు, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, అనంతపూర్, చిత్తూర్, కడప, విజయనగరం) ఎంపిక చేయబడ్డాయి. ఈ 13 జిల్లాలకు కలిపి ప్రతి సంవత్సరం సుమారు రూ 330 కోట్ల రూపాయలు బి.ఆర్.జి.ఎఫ్. అభివృద్ధి నిధులు విడుదల అవుతాయి. ఈ 13 జిల్లాలలోని పంచాయతీరాజ్ సంస్థల, మునిసిపాలిటీల సామర్థ్యాల పెంపుదల కొరకు జిల్లాకు రూ. కోటి చొప్పున మొత్తం రూ. 13 కోట్లు రాష్ట్ర స్థాయిలోని పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి అకాడమీకి విడుదల చేయబడతాయి. ఎంపిక చేయబడిన జిల్లాలు అభివృద్ధి నిధులను పొందాలంటే ఈ నిధుల వినియోగానికి సంబంధించిన ప్రణాళికలను పంచాయతీరాజ్ సంస్థలు, మునిసిపాలిటీలతో ప్రజాభాగస్వామ్య పద్ధతిలో రూపొందింపచేసి జిల్లా ప్రణాళికా కమిటీలో చర్చించి అమోదించాలి. ఈ 13 జిల్లాల్లో బి.ఆర్.జి.ఎఫ్. నిధులు పొందే క్రమంలో జిల్లా ప్రణాళికా కమిటీలు కూడా క్రియాశీలకం అయ్యాయంటే అతిశయోక్తి లేదు. 1969 నుండి చర్చించబడే జిల్లా ప్రణాళికా రచన కూడా ఆచరణలోకి వచ్చినట్లయింది. స్థానిక సంస్థలకు అధికారాలు, నిధులు ఇచ్చినట్లయితే మానవవనరుల అభివృద్ధికి అందులోని ప్రజాప్రతినిధులు దృష్టి సారించరనే భ్రమలను తొలగిస్తూ 2007-08 కి ఈ 13 జిల్లాలలో ఆమోదించిన బి.అర్.జి.ఎఫ్ ప్రణాళికలలో సెక్టారు వారీగా జరిపిన కేటాయింపులు ఒకసారి పరిశీలిస్తే ఈ సంస్థల పరిణతిని అర్థం చేసుకోవచ్చు. (పట్టిక1). అందుబాటులో ఉన్న గణాంకాల దృష్ట్యా మొత్తం నిధుల కేటాయింపులో మహిళాశిశుసంక్షేమం (26.59%), విద్య (16.82%), పంచాయతీ అవ స్థాపనా సౌకర్యాలు (11.99), నీటిసరఫరా (12.31%) రంగాలలోనే జరిగాయి.

## బి.ఆర్.జి.ఎఫ్ ప్రణాళిక 2007-08

### రంగాల వారీగా కేటాయింపులు

| రంగం | మొత్తం పనులు | అంచనా వ్యయం లక్షలలో | మొత్తం నిధులలో శాతం |
|---|---|---|---|
| మహిళా శిశు సంక్షేమం (అంగను వాడీ భవన నిర్మాణపు పనులు) | 4530 | 8771 | 26.59 |
| విద్య | 5090 | 5549 | 16.82 |
| గ్రామీణ నీటి సరఫరా | 5539 | 4061 | 12.31 |
| పంచాయతీ రాజ్ - గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు | 2125 | 3954 | 11.99 |
| సాంఘిక సంక్షేమం హాస్టలు భవన నిర్మాణం | 179 | 877 | 2.66 |
| వెనుకబడిన తరగతుల సంక్షేమం హాస్టలు భవన నిర్మాణం | 23 | 196 | 0.59 |
| పశుసంవర్ధన | 364 | 972 | 2.95 |
| ప్రాధమిక అరోగ్యం | 445 | 1457 | 4.42 |
| గ్రామీణ విద్యుదీకరణ | 867 | 1090 | 3.30 |
| ఇతర పనులు | 9777 | 6061 | 18.37 |
| **మొత్తం** | **28939** | **32988** | |

**బి.ఆర్.జి.ఎఫ్. అములులో ఎదురవుతున్న సమస్యలు - పరిష్కార మార్గాలు**

స్థానిక సంస్థలను వ్యవస్థాగతంగా పటిష్ట పరుస్తూ గ్రామీణ సేవల రంగంలో పంచాయతీ రాజ్ సంస్థలను భాగస్వాములను చేస్తూ అట్టడుగుస్థాయి నుండి ప్రణాళికా రచనను ప్రోత్సహించి అభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలు తగ్గంచటమే ఉద్దేశ్యంగా గల్గిన బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం అమలులో క్షేత్రస్థాయిలో సమర్దవంతంగా అమలుచేయాలంటే పలు చర్యలు చేపట్టాలి.

ముందుగా జిల్లా స్థాయిలో జిల్లా ప్రణాళికా కమిటీల సామర్ధ్యాలను పెంపుదల చేయటం, జిల్లా ప్రణాళికా కమిటీకి ప్రణాళికా నిపుణుల సేవలను అందుబాటులో ఉంచటం వంటివి తక్షణం చేయాలి. పంచాయతీరాజ్ సంస్థలలోని ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి దశల వారీగా శిక్షణ ద్వారా సామర్థ్యాల పెంపుదల కార్యక్రమాలను చేపట్టి శిక్షణ ఒక నిరంతర ప్రక్రియగా మలచాలి. ఈ దిశలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ ఒక అడుగు ముందుకు వేసి ప్రజాప్రతినిధులకు ప్రత్యక్ష, దూరవిద్యా మాధ్యమం (శాటిలైట్) ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటం ముదావహం. ప్రభుత్వం కూడా గ్రామ స్థాయి ప్రణాళికా రచనకు వీలు కల్పిస్తూ పంచాయతీ రాజ్ సంస్థలకు పెద్ద మొత్తంలో నిబంధితం కాని నిధులను అందుబాటులో ఉంచాలి. గ్రామ స్థాయి ప్రణాళికల రూపకల్పన సాధ్యపడాలంటే వివిధ శాఖల ద్వారా గ్రామపంచాయతీ వరకూ నిధుల కేటాయింపు వివరాలను సకాలంలో అందేలా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు కూడా సంస్థలకు కేటాయించిన నిధులను సమాన వాటాలలో పెంచుకోకుండా ప్రాధాన్యీకరించిన అవసరాల నేపధ్యంలో పనులకు నిధులను కేటాయించటం అలవరుచుకుంటే అభివృద్ధిలో గల కీలక అంతరాలు భర్తీ కావటమే గాక ప్రాంతీయ అసమానతలు గణనీయంగా తగ్గుతాయనటంలో ఏమాత్రం సందేహించనవసరంలేదు.

- డా. వి. శివశంకర్ ప్రసాద్

జూనియర్ ఫాకల్టీ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ

# గ్రామ పంచాయితీలను సమర్ధవంతంగా నిర్వహించడం ఎట్లా?

## ఆంధ్రప్రదేశ్ పంచాయిత్ రాజ్ చట్టం రీత్యా గ్రామ పంచాయతీల కార్య నిర్వహణకు సూచనలు

**గ్రామ పంచాయతీకి కార్యాలయం**

- ★ ప్రతి గ్రామ పంచాయితీకి ఒక కార్యాలయము, భవనము ఉండాలి.
- ★ గ్రామ పంచాయతీకి స్వంత భవనం లేకపోతే అద్దె ఇంటిలో ఏర్పాటు చేసుకోవాలి. ఈ కార్యాలయంలో అన్ని కులాలు, మతాలు, వర్గాల వారికి ప్రవేశం ఉండేవిధంగా సాధ్యమైనంత వరకు గ్రామ మధ్య భాగంలో ఉండాలి.
- ★ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని, సర్పంచ్, ఉప సర్పంచ్, సభ్యుల ఇండ్లలో లేక దారి దగ్గర, బంధువుల ఇండ్లలో ఏర్పాటు చేయరాదు.

**గ్రామ పంచాయతీల ఆదాయం**

గ్రామ పంచాయతీలు ఈ దిగువ వివరించిన అంశాల ద్వారా చట్టరీత్యా ఆదాయం ఏర్పరచుకొనవచ్చు.

- ★ ఇంటి పన్ను
- ★ ఆస్తి బదిలీలపై (క్రయ విక్రయాలపై) సుంకం
- ★ ఖాళీ స్థలంపై అంటే భవనాలతో ఆక్రమించబడినట్టి లేక భవనాలకు సంబంధం కానట్టి ఆక్రమిత భూములపై సంవత్సరపు అద్దె విలువలో రూపాయికి 0.02 చొప్పున లైసెన్సు.
- ★ గ్రామ పంచాయతీ ఆధీనం క్రింద, నియంత్రణ క్రింద గల పోరంబోకు లేదా సాముదాయక భూముల వాడకానికి వసూలు చేసే రుసుములు, పన్నులు.
- ★ గ్రామ పంచాయితీ ఆధీనంలోని చావడీలు, సత్రాలు మొదలైన భవనాల వాడకంపై వచ్చే ఆదాయం
- ★ సీనియరేజి రుసుం, ఖనిజాలు, చిన్న తరహా ఖనిజాలు మినహా గ్రామంలో త్రవ్వబడిన ఖనిజాలు, వస్తువులు మొదలైన వాటిపై ప్రభుత్వం వసూలు చేసిన సీనియరేజి రుసుం ద్వారా గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయం (శాబాసు రాళ్ళ గదులు, సుద్ద గనులు, క్వారీలు మొదలైనవి)
- ★ లోకల్ లైసెన్సు, భూమి శిస్తుపై రుపాయి 0.25 పైసలు మించకుండా వసూలు చేసే లోకల్ లైసెన్సు.
- ★ గ్రామ పంచాయతీ నిర్వహణ క్రింద ఉన్న ధర్మాదాయముల నుండి, ట్రస్టీల నుండి వచ్చే ఆదాయం.
- ★ అపాయకరమగు, దుస్సాహసమగు వృత్తులపై లైసెన్సు ఫీజులు విధించటం ద్వారా వచ్చే ఆదాయం.
- ★ గ్రామ పంచాయితీ ఆధీనంలో ఉన్న చెరువులలోని చేపలు పట్టుకునే హక్కు కౌలుకు ఇచ్చుట ద్వారా, చెరువులలోని తుంగ, రెల్లు వేలం వేయుటం ద్వారా వచ్చే ఆదాయం.
- ★ ఆంధ్రప్రదేశ్ వినోదపు పన్నుల చట్టం క్రింద గ్రామ పంచాయతీకి చెల్లించే మొత్తాలు.
- ★ గ్రామ పంచాయితీ నిర్వహణ క్రింద ఉన్న రేవుల ద్వారా వచ్చే ఆదాయం.
- ★ గ్రామ పంచాయతీ ఆధీనంలో గల పోరంబోకు భూములపై గల చెట్ల ఫలసాయంపై వచ్చే ఆదాయం.
- ★ ప్రభుత్వం నుండి జనాభా లెక్కల ప్రకారంరూ. 10 గ్రాంటు (జనాభా గ్రాంటు)
- ★ గ్రామ పంచాయతీ నిధి నుండి తీసి పెట్టుబడి పెట్టటం వలన వచ్చే ఆదాయం.

  ఉదా : ఎస్టేట్ డెవలప్‌మెంట్ లోన్ బాండ్స్ పోస్టల్ సర్టిఫికెట్స్ వగైరా
- ★ ఆదాయం వచ్చే పథకాలు చేపట్టడం వలన

  ఉదా : షాపింగ్ కాంప్లెక్సులు, పండ్లతోటలు, బంజరు దొడ్లు
- ★ పశువులు, రహదారి ద్వారా వచ్చే ఆదాయం
- ★ గ్రామ పంచాయతీచే నిర్వహించబడే కూరగాయల మార్కెట్లు, పశువుల సంతలు మొదలైనవి.

**సమావేశాలు**

సమావేశాలు నాలుగు రకాలుగా వర్గీకరించబడినవి.

- ★ సాధారణ సమావేశం
- ★ అత్యవసర సమావేశం
- ★ ప్రత్యేక సమావేశం
- ★ అభ్యర్థ సమావేశం

**సాధారణ సమావేశం**

- ★ చట్ట ప్రకారం సర్పంచ్ ప్రతినెలా కనీసం ఒక సాధారణ సమావేశం ఏర్పాటు చేయాలి.
- ★ అంతకు మించి కూడా వ్యవహార నిర్వహణ నిమిత్తం సమావేశాలు జరుపుకోవచ్చు.
- ★ సాధారణ సమావేశానికి (3) పూర్తి దినాల వ్యవధితో (అనగా సమావేశం జరిపే రోజుకు, నోటీసు అందజేసే రోజుకు మధ్యన (3) పూర్తి దినములు) సభ్యులకు అజెండాతో నోటీసు అందజేయాలి.

**అత్యవసర సమావేశం**

అత్యవసర సమావేశానికి తక్కువ వ్యవధితో సభ్యులకు అజెండాతో నోటీసు అందజేసే ఏర్పాటు చేసుకోవచ్చు.

**ప్రత్యేక సమావేశం**

ప్రత్యేక సమావేశానికి 5 దినాల వ్యవధితో సభ్యులకు అజెండాతో నోటీసు అందజేసేటట్లు సమావేశం ఏర్పాటు చేయాలి. ప్రత్యేక సమావేశాన్ని దిగువ వివరించిన కార్యాల నిమిత్తం ఏర్పాటు చేయాలి.

బడ్జెట్టు అంచనాలు, అంతిమ ఆమోదానికి ఉప సర్పంచ్ ఎన్నిక నిమిత్తం నీటి సరఫరా, వీధి దీపాలు, డ్రైనేజి మొదలైన వాటిలో ఏ ఒక్కదాని నిర్వహణ నిమిత్తం ఇంటి పన్నుపై ప్రత్యేక పన్ను విధించుటకు.

**అభ్యర్థన సమావేశం**

ఈ సమావేశం జరపటానికి గ్రామ పంచాయతీలో అప్పుడు ఉన్న మొత్తం సభ్యులలో 1/3 వంతు సభ్యులు రాత పూర్వకంగా సమావేశం ఏర్పాటు చేయాలని కోరాలి.

**కోరం**

మొత్తం సభ్యులలో మూడింట ఒక వంతు సభ్యులు హాజరయితేనే తప్ప ఏ వ్యవహారాలు నిర్వహించరాదు.

**సమావేశానికి నిర్వహించవలసిన రిజిష్టర్లు**

గ్రామ పంచాయతీ సమావేశాలకు

★ తీర్మానాల రిజిష్టరు

★ సభ్యుల హాజరు రిజిష్టరు

★ నోటీసు రిజిష్టరు నిర్వహించాలి.

**తీర్మానాలు రిజిష్టరు - తీర్మానాలు**

ప్రతి సాధారణ సమావేశానికి ఈ క్రింద వివరించిన అజెండా అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

★ గత సమావేశపు మినిట్సు సభ్యులకు చదివి, వినిపించి, ధృవీకరించుట.

★ గత నెల ఆదాయ వ్యయాల (పద్దుల వారి) ఆమోదం గురించి

**గ్రామసభలు**

గ్రామ సభలు ప్రతి సంవత్సరం రెండు పర్యాయాలు ఒకటి. 1వ డిసెంబరు లోగా, రెండవది 20 ఏప్రిల్‌లోగా ఈ దిగువ వివరించిన విషయాలలో పరిశీలించుటకు నిర్ణయించబడు తేదీ, స్థలం, సమయాన సమావేశం కావాలి.

★ వార్షిక లెక్కల వివరణ, ఆడిట్ రిపోర్టు

★ గత సంవత్సరపు పరిపాలనకు చెందిన నివేదిక

★ ఆ సంవత్సరానికి సంబంధించిన పనుల కార్యక్రమం లేక బడ్జెట్టులో గాని, వార్షిక కార్యక్రమంలో గాని చేర్చని ఏదైనా కార్యక్రమం.

★ ప్రస్తుతమున్న పన్నులు పెంచటానికి లేక కొత్త పన్నులకు సంబంధించిన ప్రతిపాదనలు.

★ అభివృద్ధి పనులు చేపట్టుట గురించి

★ ఇంటి పన్ను, బకాయిదారుల పట్టిక చదివి వినిపించుట

★ ఆస్తి మార్పిడిల జాబితా సభ్యులకు చదివి వినిపించుట

గ్రామ సభ సమావేశానికి సర్పంచ్, వారు లేనప్పుడు ఉప సర్పంచు అధ్యక్షత వహించాలి. గ్రామ పంచాయతీలో రెండు లేక మూడు గ్రామాలున్నచో వరుస క్రమంగా ఒక్కొక్క గ్రామ సభ జరుపుకొనవచ్చు.

**లబ్ధిదారుల కమిటీ మరియు కార్యాచరణ కమిటీల ఏర్పాటు**

★ వ్యవసాయం

★ ప్రజారోగ్యం

★ నీటి సరఫరా

★ పారిశుధ్యం

★ కుటుంబ నియంత్రణ

★ విద్య

**పన్నులు - వసూలు విధానం**

గ్రామ పంచాయతీలకు పన్నులు విధించుట ద్వారా నిధులు సమకూర్చుకొనుట చాలా అవసరం. నిధులు లేనిచో గ్రామ పంచాయతీలు సమర్ధవంతంగా పరిపాలన సాగించలేవు. సంఘంలోని సభ్యులు తమ పాలనా యంత్రాంగానికి సామూహిక ఖర్చుల నిమిత్తం ఎటువంటి సేవను అందించకుండా నిర్భయంగా చెల్లించే దానిని పన్ను అంటారు. పన్నుకట్టే వ్యక్తికి ఆ మొత్తానికి సమానంగా గ్రామ పంచాయతీ లాభాన్ని అందించే అవసరం వీలు లేదు. కాబట్టి ప్రతి వ్యక్తి పన్ను చెల్లించుట ఆపరాదు.

**ఇండ్ల పన్ను వసూలు**

★ ప్రతి సంవత్సరం ఇండ్ల పన్ను డిమాండ్ సర్టిపై చేసి బకాయిదారులకు డిమాండ్ నోటీసులు / బిల్లు వత్సములు (150 రోజుల గడువుతో జారీ చేయాలి.

★ డిమాండ్ నోటీసులో ఇంటి నెంబరు, పన్ను చెల్లించవలసిన కాలం, చెల్లించనిచో పర్యవసానం వివరించాలి.

★ సకాలంలో చెల్లించని బకామిదారు ఆస్తిని జప్తు చేయాలి. చరాస్థి మాత్రమే జప్తు చేయాలి.

★ జప్తు చేయబడిన వస్తువుల విలువ ఈ దిగువన వివరించిన అంశాలకు సరిపడ వుండాలి.

1. పన్ను మొత్తం
2. వారంటు ఫీజు
3. జప్తు చేయటానికి అయిన ఖర్చు
4. ఇతర ఖర్చులు ఏదైనా అయినచో

★ వ్యవసాదారునికి జీవనాధారమైన ఎద్దులు, అరక సామానులు, విత్తనాలు మొదలైనవి జప్తు చేయరాదు.

**లైసెన్సు ఫీజులు**

ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ చట్టం ప్రకారం గ్రామ హద్దులలో గల ఏ ప్రవేశం షెడ్యూలు –3లో చూపబడిన పన్నులకు గ్రామ పంచాయతీ నుండి లైసెన్సు పొందనిచో ఎవరూ ఉపయోగించరాదని నోటిఫికేషన్ ప్రకటించాలి. అట్టి నోటిఫికేషన్ గ్రామ పంచాయతీ ఆఫీసు నోటీసు బోర్డునందు, గ్రామంలోని ముఖ్యమైన (3) ప్రదేశాలలో ప్రకటించాలి..

నోటిఫికేషన్‌లో లైసెన్సు రుసుంలు తరగతులుగా విభజించి నిర్ధారించాలి. నోటిఫికేషన్ ప్రకటించబడిన 160 దినాల తరువాత అమలులోనికి వస్తాయి. కల్లు, సారా దుకాణాలు కూడా గ్రామ పంచాయతీ నుండి లైసెన్సు పొందనిచో నడువనీయకూడదు.

★ ఆవిరి శక్తి, నీటి శక్తి లేక ఇతర యంత్ర సంబంధమయిన శక్తి లేక విద్యుత్ శక్తి వినియోగించటానికి ఉద్దేశించిన ఫ్యాక్టరీగాని, కర్మాగారం గాని, పని స్థలంను గాని నిర్మించటానికి లేక యంత్రాలను స్థాపించుటకు ఉద్దేశించేవారు ముందు గ్రామ పంచాయితీకి పర్మిషన్ నిమిత్తం రాత పూర్వకంగా దరఖాస్తు అందజేయాలి.

★ దరఖాస్తుతో పాటు ప్లాను పత్రాలు (5) జత పరుచుచు సెక్షన్ 120 (2) మరియు (4) లో నిర్దేశించిన వివరణములు అందజేయవలెను.

★ గ్రామ పంచాయితీ అనుమతి జారీ చేయుటకు ముందు ఈ దిగువ వివరించిన అధికారులను సంప్రదించి వారి ఆమోదాన్ని పొందాలి.

★ ప్లాను ఇన్‌స్పెక్టరు ఆఫ్ ఫ్యాక్టరీస్ వారి ఆమోదం పొందాలి.

★ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిని సంప్రదించి వారి అభిప్రాయాన్ని పరగణించాలి.

★ డైరెక్టరు, పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖల అనుమతిని, ఫ్యాక్టరీ ఏర్పాటు, వాస్తు శిల్పం గురించి పొందాలి.

★ డివిజనల్ పంచాయితీ ఆఫీసరుకు, సదరు ప్లాను పరిశీలనకు పంపి వారి అభిప్రాయాన్ని పొందనిదే అనుమతి యివ్వరాదు.

**వసూలు**

★ లైసెన్సు ఫీజుల విషయంలో డిమాండు రిజిష్టరు నిర్వహించి, డిమాండు సర్టిఫై చేయాలి.

★ లైసెన్సు పొందకుండా, పునరుద్ధరించకుండా వృత్తి వ్యాపారము చేసుకొను వారికి డిమాండు నోటిసులు జారీ చేయాలి.

★ అప్పటికి కూడా లైసెన్సు పొందని లేక పునరుద్ధరించుకొననిచో పంచనామా చేసి కోర్టులో కేసు నమోదు చేయాలి.

★ ఆర్థిక సంవత్సరం ముగిసిన తరువాత లైసెన్సు ఫీజుకు వసూలు కాలదోషం పట్టును.

## గ్రామ పంచాయతీ లెక్కలు

**జమలు - ఖర్చులు**

గ్రామ పంచాయితీకి చట్ట ప్రకారం లభించిన ఆదాయ వనరులు ముందే వివరించబడ్డాయి. వసూలైన గ్రామ పంచాయతీ ద్రవ్య విషయంలో ఈ క్రింద సూచనలు పాటించాలి.

★ వసూలైన ద్రవ్యం క్యాష్ బుక్కులో నమోదై ట్రెజరీ ఖాతాకు చలాను ద్వారా జమకు తీసుకొనాలి. అవసరాన్ని బట్టి చెక్కులు ద్వారా విడుదల చేసుకొనాలి.

★ వసూలైన ద్రవ్యం నేరుగా ఖర్చు చేయరాదు.

★ పన్నులు-ఫీజులు-లీజు మొత్తములు వసూలు చేసినపుడు వాటికి సంబంధించిన డిమాండు రిజిస్టరులో రశీదు నెం. వసూలు అయిన తేదీ, వసూలైన మొత్తం వివరించాలి.

★ నిర్దేశించిన నమూనా ప్రకారం వసూలు చేసిన మొత్తాను పక్కా క్యాష్ రశీదు జారీ చేయాలి. అట్టి రశీదుపై నగదు ముట్టినట్లు, ఎందు నిమిత్తం ముట్టినది, ఏ సంవత్సరానికి సంబంధించినదో వివరించుతూ సర్పంచ్ లేదా వారి అధికారం పొందిన వ్యక్తి సంతకం చేయాలి.

★ క్యాష్ బుక్కు, దానికి సంబంధించిన ఈ దిగువ వివరించిన ముఖ్యమైన రిజిష్టర్లు విధిగా నిర్వహించాలి.

★ క్యాష్ బుక్కు

★ ఇంటి పన్ను డిమాండు రిజిష్టరు

★ ఇంటి పన్ను ఆరియర్ డిమాండు రిజిష్టరు

★ వృత్తి పన్ను డిమాండు రిజిష్టరు

★ వాహనం పన్ను డిమాండు రిజిష్టరు

★ మిస్సిలేనియస్ డిమాండు రిజిష్టరు

★ ఆదాయం వచ్చు ఆస్థుల పన్ను రిజిష్టరు

★ ఆదాయం-వ్యయాల రిజిష్టరు

★ స్టాకు రిజిష్టరు

★ పేబిల్స్ రిజిష్టరు

★ వేతనాల బట్వాడా రిజిష్టరు

★ ఆడిటు రిజిష్టరు

★ బడ్జెట్ ప్రొవిజను రిజిష్టరు

**ఖర్చులు**

★ గ్రామ పంచాయతీ నుండి చేయవలసిన ప్రతి ఖర్చుకు గ్రామ పంచాయతీ ఆమోదం పొందలి.

★ చెల్లింపులు బిల్సు ఆమోదించుట ద్వారా చెల్లించాలి.

★ పార్టీలకు చేయాల్సిన చెల్లింపులు చెక్కుల ద్వారా చేయాలి.

★ కొద్ది మొత్తం అనగా చిల్లర ఖర్చులు చెల్లింపులకుపకరించుటకు పర్మనెంటు అడ్వాన్సును పర్మనెంటు అడ్వాన్సు రిజిష్టరులో నిర్వహించాలి. నాన్ నోటిఫైడ్ గ్రామ పంచాయతీలు ఆయా జిల్లా కలెక్టరు నిర్దేశించిన మొత్తాలకు మించి చేతి నిల్వ ఉంచుకొనరాదు.

★ చెక్కు బుక్కులు, చెక్కులు విడుదల చేయు వారి వద్దనే ఉంచుకొనాలి.

★ బిల్సు చేయటానికి ప్రింటెడ్ ఫారాలనే వినియోగించాలి.

★ ద్రవ్యోపహరణం, నష్టం మొదలైనవి సంభవించినచో ఆడిటరుకు, సంబంధిత పరిశీలనాధికారులకు రిపోర్టు చేయాలి.

★ బడ్జెట్టు కేటాయింపు లేనిదే వ్యయం చేయరాదు. బడ్జెట్టు కేటాయింపు ఈ క్రింద విధంగా కేటాయించాలి.

| | |
|---|---|
| వ్యవసాయ స్థాపన | 30 శాతం |
| విద్యుత్ దీపాలు | 15 శాతం |
| మంచినీటి సరఫరా | 10 శాతం |
| స్త్రీ మరియు సంక్షేమ క్యాంప్ | 5 శాతం |
| అభివృద్ధి కార్యక్రమాలు | 40 శాతం |

## పనులు-గ్రామ పంచాయితీ పనులు చేయు విధానము

గ్రామ పంచాయతీలో పంచాయతీ నిధులు నుండి అభివృద్ధి పనులు అనగా రోడ్లు, మురికి నీటి కాల్వల నిర్మాణం, భవనాలు, పబ్లిక్ లాట్రిన్స్, మూత్రశాలలు నిర్మాణం, రిపేర్లు చేయ తలపెట్టినపుడు ముందుగా గ్రామ పంచాయితీ సమావేశాలలో చర్చించి ఆ సంవత్సరపు బడ్జెట్టు కేటాయింపు పరిమితిలోనే అంచనాలు తయారు చేయటానికి సాంకేతిక విభాగం వారిని కోరుచూ తీర్మానించాలి. తయారైన అంచనాలకు పరిపాలన మరియు సాంకేతిక ఆమోదాలు పొందాలి.

**వేలము**

ఈ దిగువ వివరించిన అంశాల వేలం ద్వారా కౌలుకు ఇవ్వాలి.

★ మార్కెట్లు
★ పశువుల సంతలు
★ బండ్లు నిలుచు ప్రదేశాలు
★ కబేళాలు
★ చేపలు పట్టుకొను హక్కు
★ రేవులు

మొదలైన పై అంశాల కౌలుకు యివ్వటానికి వేలం వేయదలచినచో ఈ దిగువ నిబంధనలు పాటించాలి.

★ కార్య నిర్వహణాధికారి/సర్పంచ్ ఫీజు వసూలు చేయు విషయం నిర్ధారించుచు కౌలుకు ఇవ్వదలచిన సందర్భంలో ప్రిలిమనరీ నోటిసు దానిలో ఏ ఏ నిబంధనలకు లోబడి వేలం వేయబడునో వివరించాలి.

ప్రిలిమనరీ నోటీసులో వివరించిన నియమ నిబంధనలు గ్రామ పంచాయతీ ఆమోదం పొందాలి. అట్టి నియమ నిబంధనల గత సంవత్సరమే ఆమోదించబడినచో, అందులో మార్పులు, చేర్పులు లేనిచో మరల ఆమోదించనవసరం లేదు. ప్రిలిమనరీ నోటిసు గ్రామ పంచాయితీ ఆమోదించి సదరు నోటిసు ప్రకటించు విధానాన్ని నిర్ణయించాలి.

**కౌలు మంజూరు చేయుటకు ప్రిలిమనరి నోటిసు చేర్చవలసిన నియమ నిబంధనలు**

★ నిర్దేశించిన రూపాయలు గ్రామ పంచాయతీలలో డిపాజిట్ చేయనిదే వేలం పాటలో పాల్గొనరాదు.
★ గత సంవత్సరం కౌలు బకాయి వున్ననూ వేలంపాటలో పాల్గొనరాదు.
★ కౌలు సంవత్సరానికి మించి యివ్వరాదు.
★ వేలంలో ఆఖరి పాట ఖాయపరచబడిన తేదీ నుండి వారం దినముల లోగా కౌలు మొత్తంలో వేలం ప్రారంభములో చెల్లించిన డిపాజిట్/ధరావత్తు కలుపుకొని 1/4 వంతు చెల్లించాలి. ఇట్టి మొత్తం సంవత్సరాంతపు మూడు నెలసరి వాయిదాల క్రింద సర్దుబాటు చేసుకొనాలి.
★ మిగతా కౌలు మొత్తం (9)కి స్త్రీలలో (1)వ ఏప్రిల్‌తో ఆరంభమై నెలలు కౌలునామాలో నిర్దేశించిన ప్రకారం చెల్లించాలి.
★ వేలం ఆఖరి పాటను పంచాయతీ విస్తరణాధికారి ఆమోదించాలి. తరువాత జరపబడు గ్రామ పంచాయతీ సమావేశాలలో కూడా ఆమోదం పొందాలి.
★ వేలం పాటను గ్రామ పంచాయతీ ఆమోదించిన (15) దినాలలోగా కౌలు దస్తావేజు వ్రాయించి రిజిష్టరు చేసుకొనాలి.
★ వేలం వేయటానికి ముందు కార్య నిర్వహణ అధికారి/సర్పంచ్ ఆ కౌలు గత (3) సంవత్సరాల ఆదాయం, ఇంకేమైనా సమాచారం ఉన్నచో అందజేయుచూ కనీస ధర నిర్ణయం, డివిజనల్ పంచాయతీ ఆఫీసరుకు రాసి పొందాలి.
★ వేలం వేయు స్థలము, తేదీ, సమయం నిర్ణయించి సంబంధిత పంచాయతీ విస్తరణాధికారి తెలపాలి. వారి సదరు వేలంలో ఉపయోగించే స్థితులైనచో అక్కడిక్కడే పాటదారుల సమక్షంలో ఎక్కువ పాట ఒప్పుకొనవచ్చును. వారు రాని పక్షంలో కార్యనిర్వహణ అధికారి/సర్పంచ్ గారి ఆమోదానికి పంపాలి.
★ వేలం పూర్తి అయి పంచాయతీ విస్తరణాధికారి ఒప్పుకొనిన వేలములు ఒకటిగాని అంతకంటే ఎక్కువ గాని రాబోవు గ్రామీణ సమావేశంలో ఆమోదానికి ప్రవేశపెట్టాలి.
★ రేవులు వేలం వేయు విషయంలో గాని, లేక చెరువులలో చేపలు పట్టుకునే హక్కు వేలం వేయు విషయంలో గాని ఆ గ్రామ పంచాయతీ ఆఫీసరు నుండి కనీస ధర నిర్ణయం పొందిన వెంటనే అట్టి మొత్తానికి వారు తీసుకొనెదరా? లేదా? అనే విషయాన్ని రాత పూర్వకంగా తెలిపి జవాబు పొందవలెను. వారు తీసుకొనటానికి అంగీకారం తెలిపినచో వారికి ఇచ్చి గ్రామ పంచాయతీ సమావేశంలో ఆమోదం పొందాలి.
★ పైన వివరించిన ప్రకారం సహకార సంఘం తమ అంగీకారము నిర్దేశించిన గడువు లోపల తెలిపినచో డివిజనల్ పంచాయతీ ఆఫీసరు నిర్దేశించిన కనీస ధరకు లోబడి వేలం వేయాలి.
★ వేలానికి సంబంధించిన ఫైలు నిర్వహించాలి. మరియు వేలం రిజిష్టరు అమలు చేసి వసూళ్ళు చెక్ చేయాలి.

**ఆడిట్ - సర్‌ఛార్జ్**

గ్రామ పంచాయతీ లెక్కలు లోకల్ ఫండ్ ఆడిట్ శాఖవారు ఆడిట్ చేయుదురు. ఆడిటరు తాను కనుగొన్న లోపాలను, తప్పిదాలను సవరించుకొని జవాబు పంపటానికి కోరుతూ కార్యనిర్వహణ అధికారి/సర్పంచ్‌కు రిపోర్టు పంపిస్తారు.

చట్ట విరుద్ధమైన ఖర్చులకు అందుకు బాధ్యులయిన వారి నుండి రాబట్టటానికి సర్ ఛార్జీ చేయుదురు. సర్ చార్జి సర్టిఫికెట్ కొరకు కోర్టు డిక్రీతో సమానం.

**నీటి సరఫరా పథకం**

గ్రామ పంచాయతీచే ఆమోదం పొందిన తర్వాత కలెక్టరు అనుమతితో నీటి సరఫరా పథకానికి 'ఒక బైలాస్' తయారు చేసుకొనాలి. దానిలో పొందుపర్చిన నియమ నిబంధనల ప్రకారంగా నల్లా కనెక్షన్లు, నీటి సరఫరా రుసుము వసూలు చేయాలి. నియమాలలో డిపాజిట్ ఎంత తీసుకోవాలి. నీటి సరఫరా రేటు నిర్ణయించుకోవాలి.

– జి. సురేఖ

# భార్యలను కొట్టడం, భాధించడం, అవమానించటం భర్తల హక్కు కాదు... చట్ట ప్రకారం పెద్ద నేరం



**మన దేశంలో గృహ హింస, భార్యలపై అమానుషత్వం చాలా ఎక్కువగానే ఉన్నాయి. మహిళల్లో కూడా అనేకమంది భర్త చేసే హింసాత్మక చర్యలను ఆమోదించే స్థితిలోనే ఉన్నారు. అట్లా ప్రవర్తించటం భర్తకున్న హక్కుగా భావిస్తున్నారు.**

**భా**ర్యను భర్త కొట్టటం చాలా సహజమని అనుకుంటారు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. చాలా కాలంగా మన సమాజంలో నెలకొన్న పురుషాధిక్యత వల్ల మహిళల్లో కుడా అట్లాంటి భావజాలం విస్తృతంగా ఉంది.

ఇట్లాంటి భావజాలం సమాజంలోని దిగువ స్థాయి భార్యాభర్తల్లోనే కాక, బాగా చదువుకున్నవారిలోనూ, ఉన్నత స్థాయి భార్యాభర్తల్లోనూ ఉండటం విశేషం. బాగా చదువుకున్న భర్తలు కూడా తమ భార్యలను కొడుతున్నారు. ఇట్లాంటి పరిస్థితి వల్ల మన దేశంలో లక్షలాది మంది భార్యలు భర్తల చేతిలో దెబ్బలు తింటూ తమకున్న కనీస మానవ హక్కులు, హూందాతనాన్ని కోల్పోతున్నారు. తత్ఫలితంగా వారి శరీరాలు గాయాల పాలవుతున్నాయి. ఇవన్నీ వారు మౌనంగానే భరిస్తున్నారు. ఇళ్లల్లో జరిగే ఈ హింస అమానుషత్వం మన దేశంలో విపరీతంగా వ్యాపించి వుంది.

గృహ హింస, అమానుషత్వం అనేవి రకరకాల రూపాల్లో ఉంటాయి. మానసికంగా వేధించడం, బ్లాక్‌మెయిల్ చేయటం, తిట్టటం, భార్యను, పిల్లలని కొట్టటం, పెద్దవాళ్లను తిట్టటం వంటివన్నీ గృహహింస కిందకే వస్తాయి. భార్యను, పిల్లలను కొట్టటం తమ జన్మహక్కని భర్తలు అనుకుంటారు. కాని ఇది అమానుషం, అమానవీయం. ఇప్పుడు చట్టరీత్యా కూడా నేరం. మన సమాజంలో అనేక శతాబ్దాలుగా నెలకొన్న పురుషాధిక్య భావాలు ఇందుకు కారణం. మహిళలపై అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం మహిళలపై జరుగుతున్న హింసపై నిర్వహించిన వివిధ అధ్యయనాల గురించి చర్చించడానికి ఇటీవల బెంగుళూరులో ఒక కాన్ఫరెన్స్ జరిపింది.

బెంగుళూరు, ముంబై, థానె, గుజరాత్ మొదలైన ప్రదేశాల్లో ఈ

# గృహ హింస నుండి మహిళలకు రక్షణ చట్టం - 2005
# కేంద్ర ప్రభుత్వ చట్టం నెం. 43/2005

**వివక్షతతో కూడిన ఆచారాలు, పద్ధతులు, అభిప్రాయాల వలన, సమాజంలోనే కాకుండా ఇంట్లో కూడా స్త్రీ పురుష సంబంధాలలో అసమానతలు ఏర్పడి, గృహ హింసకు దారి తీస్తున్నాయి. అటువంటి స్త్రీలకు ఉపశమనం కల్పించే దిశగా, ఈ రక్షణ చట్టం ఏర్పడింది.**

**గృహహింస అనగా**

- ★ శారీరక
- ★ మానసిక (మాటల ద్వారా ఉద్రేగపరచడం)
- ★ ఆర్థిక
- ★ లైంగిక

ఇంకనూ బెదిరించడం, భయపెట్టడం, దౌర్జన్యానికి పాల్పడడం, ఆరోగ్యాన్ని కుంటుపరిచే చర్యలన్నీ గృహ హింసకి సంబంధించినవే.

**చట్టం పరిధి**

ఈ చట్టం ప్రకారం బాధితురాలు, ప్రతివాది మధ్య సంబంధం భార్యభర్తల సంబంధమే కానవసరంలేదు. పుట్టుక ద్వారా, పెళ్ళి ద్వారా, దత్తత ద్వారా కలిసి వుంటున్నవారు అయినా, ఒకే ఇంటిలో ప్రస్తుతం కానీ, గతంలో కాని కలిసి నివసిస్తూ ఉన్న స్త్రీ పురుషులు ఈ చట్టం పరిధిలోకి వస్తారు.

**సమాచారం ఎవరు ఇవ్వాలి**

బాధితురాలి సమాచారం ఆమె కాని, ఆమె తరపున ఎవరైనా హింస జరుగుతోంది లేక జరగబోతోంది అని కాని రక్షణ అధికారికి ఇవ్వవచ్చు.

**రక్షణ అధికారి బాధ్యతలు**

- ★ చట్టపరమైన సహాయం, ఉచిత న్యాయసేవలు, ఆర్థిక సహాయం, పిల్లల సంరక్షణ, ఆశ్రయం అందించే సంస్థలు, వైద్య సహాయం గురించి సమాచారం బాధితురాలికి అందజేయాలి.
- ★ జరిగిన హింసను "గృహ ఘటన నివేదిక" రూపంలో మెజిస్ట్రేటు కోర్టుకు అందించి దాని నకలును బాధితురాలికి అందచేయాలి.
- ★ బాధితురాలు కోరినచో "ప్రస్తుతం నివసిస్తున్న ఇంటిలోనే ఉండే హక్కును" పరిరక్షించడం.

**న్యాయ సేవల అధికారి**

- ★ మెజిస్ట్రేటు దరఖాస్తు కోర్టుకు అందిన మూడు రోజుల్లో మొదటి వాదన వినాలి.
- ★ కేసువిచారణ తేదీ తెలిపే నోటీసును రక్షణ అధికారి ద్వారా ప్రతివాదికి, అతను ఇంటిలో లేని పక్షంలో కుటుంబంలోని ఇతర సభ్యులకు అందచేయాలి.
- ★ 60 రోజులలో తుది తీర్పు వినిపించాలి.
- ★ గృహ హింస గురించి ప్రాథమికంగా నమ్మిన తరువాత, మెజిస్ట్రేటు రక్షణ ఆదేశాలు జారీ చేయాలి. ఈ ఆదేశాలలో ఆర్థిక, ఆరోగ్యపరమైన నష్టాల భర్తీ, పిల్లల పోషణ, ఇతర ఖర్చులు, ఏక మొత్తంగా లేక నెల నెలా చెల్లించటం మొదలైన అంశాలలో ఉండవచ్చు. ఇంకనూ తాత్కాలిక నివాసం రక్షణ నిలయాలలో ఇస్తూ, బాధితురాలితో సంబంధాలు కొనసాగించకుండా ఉత్తర్వులు ఇవ్వవచ్చు. ఆర్థిక లావాదేవీలు నిలుపుదల చేయు ఉత్తర్వులు ఇవ్వవచ్చు.
- ★ పై ఉత్తర్వులు ఉల్లంఘిస్తే ఏడాది జైలు శిక్ష గాని రూ. 20,000 (ఇరువది వేలు) జరిమానా గాని రెండింటిని గాని విధించవచ్చు.

**సేవలు అందించే సంస్థలు**

- ★ సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం 1860 క్రింద గాని, కంపెనీ రిజిస్ట్రేషన్ చట్టం 1956 క్రింద గాని రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్త్రీల సమస్యలపై సేవలందించే సంస్థలన్నీ – ఈ చట్టం క్రింద సేవలందించే సంస్థలుగా గుర్తింపు పొందవచ్చు.
- ★ ఈ సంస్థలు బాధితురాలికి, పిల్లలకు, ఆశ్రయం, వైద్య సదుపాయం, కౌన్సిలింగ్ సేవలు అందజేయాలి.

**ఆశ్రయం అందించే సంస్థలు**

- ★ జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపబడిన స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ఆశ్రయ సదుపాయం బాధితురాలి కోరికపై లేక కోర్టు ఆదేశాల మేరకు కల్పించడం.

**పోలీసు అధికారి**

- ★ కోర్టు ఇచ్చిన రక్షణ ఉత్తర్వులు ఉల్లంఘించినదో అది చట్టరీత్యా నేరం. సదరు ఫిర్యాదు రక్షణ అధికారి ద్వారా గాని, బాధితురాలి ద్వారా గాని, లేక మెజిస్ట్రేటు ఆదేశాల ద్వారా గాని చేరినప్పుడు కేసును చట్టంలో సెక్షను 31 క్రింద లేక 498ఎ భారత శిక్షాస్మృతి 1860 క్రింద లోబడి చర్య తీసుకోవాలి.

అధ్యయనాలు జరిగాయి. మహిళలు మానసికంగా, శారీరకంగా అనేకరకాల హింసకు గురవుతున్నారని, వాటి చెడు ప్రభావం వారిపై దీర్ఘకాలికంగా ఉంటుందని, దీని నుంచి బయటపడటానికి వారికి మార్గం దొరకటం లేదని ఈ అధ్యయనాల్లో వెల్లడయ్యాయి.

కొంతమంది మహిళలు భయంకరమైన హింసబారిన పడ్డారు. మహిళలపై జరిగే హింసపై అధ్యనయం నిర్వహించిన అంతర్జాతీయ కేంద్రం పేర్కొంటున్న కథనాలు అమానుషంగా ఉన్నాయి. ఈ కథనాలను పరిశీలిస్తే కొందరు తమ భార్యలను స్తంభానికి కట్టేసి కొడుతున్నారు. మరికొందరు బలవంతాన మూత్రం



తాగిస్తున్నారు. మరి కొంతమంది మరీ అమానుషంగా వేరే పురుషులతో సెక్స్ చేయిస్తున్నారు. ఇట్లా బలవంతంగా సెక్స్ చేయించటం, చేయటం ఎక్కువగా వ్యాపించి ఉంది.

15-44 మధ్య వయస్కులైన మహిళల్లో కేన్సర్, మలేరియా, ప్రమాదాలు, యుద్ధం మొదలైన పరిస్థితులన్నిటిలో మరణిస్తున్నవారి మొత్తం సంఖ్య కంటే గృహ హింసతో మరణిస్తున్న మహిళల సంఖ్యే ఎక్కువగా ఉంది.

### గృహహింస అంటే ఏమిటి ?

★ బాధితురాలిని శారీరకంగా కానీ, మానసికంగా కానీ బాధించటం, ఆమె ఆరోగ్యానికి, భద్రతకు, ప్రాణానికి, అవయవాలకు, యోగక్షేమాలకు నష్టం చేయటం, హాని కల్గించటం, గాయ పరచటం, ప్రమాదం కలిగించటం లేదా అందుకు ప్రయత్నించటం శారీరకంగా, లైంగికంగా బాధించటం, మాటలతోను, మానసికంగాను అవమానించటం, బాధించటం, ఆర్థిక విషయాల్లో నష్టం కల్గించి, బాధ పెట్టటం, అమానుషంగా ప్రవర్తించటం వంటివన్నీ గృహ హింస కిందకే వస్తాయి.



★ చట్టవిరుద్ధమైన డిమాండ్లు తీర్చాలంటూ లేదా వరకట్నం, లేదా ఆస్తిపాస్తులు మొదలైన వాటిని సమకూర్చాలంటూ బాధితురాలిని లేదా ఆమె సంబంధీకులను బలవంత పెట్టడం, వేధించటం, హింసించటం, గాయపరచటం, ప్రాణాలకు ప్రమాదం తేవటం మొదలైనవన్నీ గృహహింస కిందకే వస్తాయి.

★ పైన పేర్కొన్న ప్రవర్తనా ధోరణులకు సంబంధించి బాధితురాలిని లేదా అమె సంబంధీకులను బెదిరించటం కూడా గృహ హింసే.

★ బాధితురాలికి శారీరకంగా, మానసికంగా నష్టం కలుగ జేసే విధంగా ప్రవర్తించటం, గాయపరచటం కూడా గృహహింసే.

### శారీరక హింస

★ బాధితురాలికి శారీరకంగా నొప్పిని, నష్టాన్ని, ప్రాణాలకు, శరీర అవయవాలకు, ఆరోగ్యానికి ప్రమాదాన్ని తెచ్చే విధంగా ప్రవర్తించటం, అందుకు ప్రయత్నించటం, ఆరోగ్యం దెబ్బతినే విధంగా ప్రవర్తించటం, దాడి చేయటం, గాయపరచటం, బలప్రయోగం చేయటం మొదలైనవి శారీరక హింస కిందకి వస్తాయి.

### లైంగిక హింస

బాధితురాలిని లైంగికంగా హింసించటం, అవమానించటం, ఆమె హుందాతనానికి, గౌరవానికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించటం.

### మాటలతో, తిట్లతో, భావావేశాలతో బాధించటం

★ బాధితురాలిని అవమానాల పాలు చేయటం, చులకన చేయటం, తిట్టటం, రకరకాల పేర్లతో పిలిచి అవమానించటం, అపహాస్యం చేయటం, పిల్లలు లేదా మగపిల్లలు పుట్టలేదని తక్కువ చేసి మాట్లాడటం, బాధితురాలిని లేదా ఆమెకు సంబంధం ఉన్నవారిని బాధపెట్టడం.

### ఆర్థిక హింస

★ చట్ట ప్రకారం, సాంప్రదాయం ప్రకారం లేదా కోర్టు ఉత్తర్వుల ప్రకారం బాధితులకి సంక్రమించవలసి ఉన్న ఆర్థిక వనరులను ఆమెకు చెందకుండా చేయటం, కుట్ర పన్నటం, ప్రయత్నించటం ఆర్థిక హింస కిందకు వస్తుంది. అంతేకాక ఆమెకు గల ఆర్థిక అవసరాలను, ఇంటికి కావలసిన అవసరాలను, పిల్లల అవసరాలను పట్టించుకోకుండా వ్యవహరించటం కూడా ఆర్థిక హింసే.

బాధితురాలి పేరున లేదా సమిష్టిగా ఆమెతో కలిసి ఉన్న ఆస్తిపాస్తులను, స్త్రీ ధనాన్ని ఆమెకు దక్కకుండా వ్యవహరించటం, ఇద్దరి పేరిట ఉన్న ఇంటికి వచ్చే అద్దెను ఆమెకు దక్కకుండా చేయటం, ఆమె అవసరాలకు డబ్బు ఇవ్వక పోవటం ఆర్థిక హింస కిందకు వస్తుంది.

★ బాధితురాలికి ప్రవేశం ఉన్న ఆస్తులు, ఇంట్లోని వస్తువులు, భార్య స్థిరాస్తులు, విలువైన వస్తువులు, షేర్లు సెక్యూరిటీలు, బాండ్లు వంటి వాటిని అమ్మివేయటం, లేదా ఇతరులకు అప్పగించటం ఆర్థిక





హింసే. బాధితురాలికి ప్రమేయం లేకపోయినప్పటికీ భార్యగా ఉన్నందున ఆమెకు కూడా ఆ వస్తువులు, స్థిర చరాస్తులను వాడుకునే హక్కు ఉంటుంది. ఆ హక్కును దూరం చేయటం ఆర్థిక హింస కిందకు వస్తుంది. బాధితురాలు ఆమె పిల్లలకు కావలసిన వస్తువులను దూరం చేయడం, వాడుకోనీయకుండా చేయటం ఆర్థిక హింస.

- ★ భార్యగా ఉన్నందుకు స్త్రీకి ఇంట్లోని వస్తువులను, వనరులను ఇంటిని వాడుకునే హక్కు, అనుభవించే హక్కు సంక్రమిస్తాయి. వాటిని వాడుకోనీయకుండా, అనుభవించకుండా నిరోధించటం ఆర్థిక హింస కిందకు వస్తుంది.
- ★ ఈ చట్టం ప్రకారం ఏది గృహహింస కిందకు వస్తుంది? ఏది చేయుటం? ఏది చేయుకపోవటం? ఏ ప్రవర్తన గృహ హింసకిందకు వస్తాయి అనే విషయాలను నిర్ణయించేటప్పుడు అన్ని వస్తువులను, సంఘటనలను, పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవల్సి ఉంటుంది.

**ఎవరు ఫిర్యాదు చేయవచ్చు**

- ★ గృహ హింస కిందకు వచ్చే చర్యలు జరిగాయి. లేదా జరుగుతున్నాయి లేదా జరిగే అవకాశం ఉంది అని అనుకున్నప్పుడు కారణ సహితంగా భావించినప్పుడు ఏ వ్యక్తి అయినా సంబంధిత భద్రతా అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.
- ★ గృహ హింస కింద జరిగే సంఘటలను చర్యలను నివారించటానికి, నిరోధించటానికి మంచి ఉద్దేశ్యంతో ఏ వ్యక్తి అయినా సమాచారం అందజేయవచ్చు. దీనివల్ల అలా సమాచారం అందించిన వ్యక్తికి ఎటువంటి నష్టం ఉండదు. వారిపై ఎలాంటి సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవటం జరగదు.

**ఫిర్యాదులను నిర్ధారిస్తారా?**

1973 (1974 నాటి 2) నాటి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో ఏమి ఉన్నప్పటికీ గృహహింస చట్టంలోని 31 వ సెక్షన్‌లో గల 1 వ సబ్‌సెక్షన్ ప్రకారం ఈ చట్టం కింద నేరస్తుడిని వారంటు లేకుండా అరెస్టు చేయవచ్చు. బెయిల్ కుడా ఇవ్వటానికి వీల్లేదు.అయితే కొన్ని షరతులు, నిబంధనలు విధించి బెయిలు ఇచ్చే విచక్షణాధికారం మేజిస్ట్రేట్‌కి ఉంటుంది. బెయిలు తిరస్కరించే అధికారం కూడా మేజిస్ట్రేటుకు ఉంటుంది. బాధితురాలిని మాత్రం విచారించిన తర్వాత 31 వ సెక్షన్‌లోని 1వ సబ్ సెక్షన్ కింద నేరస్తుడు నేరం చేసాడని కోర్టు నిర్ధారించవచ్చు.

**చర్య తీసుకునేది ఎవరు?**

పోలీసు అధికారి, భద్రతా అధికారి, మేజిస్ట్రేటు మొదలైన వారిలో ఎవరికైనా గృహహింస చట్టం కింద ఫిర్యాదు అందినట్లుయితే వారు చర్య తీసుకోవచ్చు. లేదా గృహహింస కిందకు వచ్చే ఆయా సంఘటనలు జరిగినప్పుడు ఆయా ప్రదేశాల్లో వీరిలో ఎవరైనా ఉన్నట్లయితే తమంతట తామే కూడా చర్య తీసుకోవచ్చు.

**– వై.యస్.**



భారతదేశం సిరిసంపదలతో కూడిన సర్వస్వతంత్రమయిన గ్రామీణ వ్యవస్థను ఏర్పాటు ఏర్పాటు చేయడానికి ప్రయత్నించింది. గ్రామాలలో గతిశీలత ఎప్పుడూ వాంఛనీయంగా భావించబడింది. భూసంస్కరణలు, సహకారసంఘాలు, పంచాయితీరాజ్ సాముదాయక వికాసం అనే నాలుగు స్థంభాల పైన గ్రామీణ సమాజాన్ని నిర్మించడం జరిగింది. నిజమైన స్వతంత్ర సాధనకు పంచాయితీరాజ్ వ్యవస్థ మౌలికమైనది అని చెప్పవచ్చు. పంచాయితీరాజ్ ద్వారానే ప్రజలు రాజకీయ వ్యవస్థలో పాల్గొనే అవకాశాలను కలిగించడమే కాక రాజకీయ నియంత్రణను ప్రజా బాహుళ్యం ద్వారా కొనసాగించవచ్చు. పంచాయితీరాజ్ ద్వారా ప్రజాస్వామ్య వికేంద్రీకరణను అమలు చేయగలం అని ప్రముఖుల అభిప్రాయం.

భారతదేశంలో అతి ప్రాచీనమైన సలహా సంఘాలు కుల వ్యవస్థకే పరిమితమయి ఉండేవి. మన దేశంలోని కుల వ్యవస్థ గురించి మన అందరికి తెలిసిన విషయమే. అయితే ఈ కుల వ్యవస్థ ఆదిలో వర్ణ వ్యవస్థగా

# భారతదేశంలో పంచాయితీరాజ్ వ్యవస్థ పరిణామం

పరిగణింపబడి క్రమేపీ ఇప్పుడున్న కుల వ్యవస్థగా మారినదని చరిత్ర పేర్కొంటున్నది. ప్రతి గ్రామంలో ఎన్నో కులాలు ఉంటాయి. పూర్వం నుంచి ప్రతి కులానికి ఒక నాయకుడు ఉండేవాడు. ఆ కులం సభ్యుల మధ్య ఏవైనా స్పర్థలు వచ్చినప్పుడు కుల నాయకుడు తీర్పు చెప్పేవాడు. కులస్థాయిలో సమస్య పరిష్కారం కానప్పుడు గ్రామ స్థాయికి వెళ్ళేవారు. గ్రామ స్థాయిలోని పంచాయితీకి ఒక నాయకుడు, మరికొందరు సభ్యులు ఉండేవారు. వారందరిని కలిపి పంచ్ ప్రముఖ్ అనేవారు. ఈ విధంగా కులస్థాయిలో పరిష్కరించని సమస్యలు గ్రామస్థాయిలో పరిష్కరించబడేవి. గ్రామస్థాయిలో గల ఈ వ్యవస్థను "పంచాయితీ" అనేవారు. గ్రామ పంచాయితీలు గాక ప్రాంతీయ పంచాయితీలు కూడా ఉండేవి. గ్రామ స్థాయిలో పరిష్కారం గాని సమస్యలకు ప్రాంతస్థాయిలో తీర్పు చెప్పేవారు. అయితే ఆయా స్థాయిలలో సర్వస్వతంత్రమయిన పంచాయితీలు ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాలలో తీర్పు నిర్ణయం భూకామందులయిన దేశ్‌ముఖ్, జాగీర్దారులు, దొరలు మొదలగువారే తీసుకొనే వారు. సమస్యలపై తీర్పులు భూకామందులకు ఆదాయ మార్గాలయ్యేవి. బ్రిటిష్ ప్రభుత్వం న్యాయ పరిపాలనను ఏర్పరచడానికి ముందు న్యాయ పరిపాలనను గ్రామ ప్రజలే కొనసాగించుకొనేవారు. ఆయా కాలాలలో గల ప్రాచీన భారతదేశంలోని పంచాయితీ వ్యవస్థను గమనించవలసి ఉంది.

### వేదకాలంలో పంచాయితీలు

వేదకాలంలో వ్యవస్థీకృతమయిన గ్రామీణ స్థానిక స్వయం పరిపాలన యంత్రాంగాలున్నట్లు పేర్కొన్నప్పటికీ, వాటి కార్యనిర్వహణ పద్ధతిని స్పష్టంగా పేర్కొనడం జరగలేదు. వేదకాలంలో గ్రామ పరిపాలన యంత్రాంగం మౌలిక అంగంగా ఉండేది. "గ్రామణి" అనే వ్యక్తి గ్రామ పరిపాలకుడుగా ఉండి, ప్రజాదరణ గలవాడై, రాజ పట్టాభిషేకంలో పాల్గొనేవాడని శతపత్ర బ్రహ్మణంలో వివరించినారు. ఇట్లా గ్రామణి పట్టాభిషేక ఉత్సవంలో పాల్గొనడం అంటే రాజకీయ వ్యవస్థతో సన్నిహిత సంబంధం ఉన్నవాడని తెలుసుకోవాలి.

### వేదకాల అనంతరం

రామాయణ, మహాభారత గ్రంథాలలో గ్రామీణ సంస్థల గురించి వివరంగా పేర్కొన్నారు. గ్రామాన్ని గ్రామ 'ఘోష' అనడం కూడా జరిగింది. అట్లాంటి గ్రామాలలో పెద్దల సభలున్నట్లు, ఆ సభకు గ్రామణి అనే గ్రామపెద్ద ఉన్నట్లు పేర్కొనడం జరిగింది. ఈ గ్రామణి సుంకం వసూలు చేయడం, గ్రామానికి సంబంధించిన విషయాలను వ్రాసి ఉంచడం, తగాదాలలో తీర్పు చెప్పడం, నేరాలను నియంత్రణ చేయడం, గ్రామం తరపున వాదించటం లాంటి కార్యక్రమాలు కొనసాగించేవాడట. గ్రామంలోని కొందరు పెద్దలు గ్రామసభ సభ్యులుగా ఉండేవారు. ఈ గ్రామ సభ సభ్యులు కూడా తీర్పులలో పాల్గొనేవారు. ఈ సభాసభ్యులు "గ్రామణి" కున్న హక్కులను నియంత్రితం చేసేవారట.



### క్రీ.పూ. 600 నుంచి క్రీ.శ. 600 వరకు

క్రీ.పూ. 600 నుంచి క్రీ.శ. 600 వరకు భారతదేశంలో ఎన్నో స్వతంత్ర దేశాలు అవతరించి, క్షీణించడం జరిగింది. ఈ సమయంలో ఎందరో మహానుభావులు, సామాజిక సంస్కర్తలు అవతరించినారు. గుప్త, మౌర్యరాజుల కాలంలో జరిగిన చారిత్రకాంశాలకు నిదర్శనాలున్నాయి. కౌటిల్యుడు రచించిన అర్థశాస్త్రమను గ్రంథం హిందూ పరిపాలన పద్ధతిని సమగ్రంగా సూచించినది. అదే విధంగా గుప్తరాజుల కాలంలో రచనలు కూడ హిందూ రాష్ట్ర పరిపాలనల గురించి చర్చించినాయి. ఈ విధంగా స్థానిక పరిపాలనపై చారిత్రకాధారాలున్నాయి. కౌటిల్యుడు రచించిన అర్థశాస్త్రమనే గ్రంథంలో గ్రామ పరిపాలన గురించి సంక్షిప్తంగా వివరించినాడు. ఈయన గ్రామంలో కనీసం వంద కుటుంబాలుండేవని పేర్కొన్నాడు. ప్రతి గ్రామంలో

(1) అధ్యక్షులు (Head man)

(2) అకౌంటెంట్ (Accountant)

(3) వైద్యుడు (Physician)

(4) పశువుల వైద్యుడు (Veternary Doctor)

(5) గ్రామ వార్తాహరులు (Village Couriers) మొదలైనవారు గ్రామ పరిపాలనను స్వతంత్రంగా కొనసాగించేవారు. అదేవిధంగా గుప్తరాజుల కాలంలో కూడ గ్రామ పరిపాలన స్వతంత్రంగా కొనసాగుతుండేదని చరిత్ర వల్ల తెలుస్తున్నది.

జైన గ్రంథాలలో గ్రామ పంచాయితీలను గురించి వివరిస్తూ అవి అన్ని వర్ణాల ప్రజలకు బహు ప్రీతికరమై ఉండేవని పేర్కొన్నారు. బౌద్ధ మత గ్రంథాలలో కూడ రాష్ట్ర స్వతంత్రతను గురించి వివరించబడినది. గ్రామాల విస్తరణ ప్రకారం వర్గీకరణ జరుగుచుండేదట. గ్రామాలలో నిర్మాణాత్మక కార్యక్రమాలను కొనసాగించేవారు. కుల వ్యవస్థకు, గిల్డ్ వ్యవస్థకు వాటి వ్యవహారాలలో సర్వ స్వతంత్రం ఉండేది.

**క్రీ.శ. 600-1200 సం॥ల కాలంలో గ్రామ పంచాయితీలు**

జైన రచనల ప్రకారం గ్రామీణ ప్రభుత్వపు నిర్మాణం, ప్రకార్యాల విషయంలో దక్షిణ భారతదేశంలో గల చారిత్రక నిదర్శనాలపై ఆధారపడాలి. ఇట్లాంటి గ్రామీణ ప్రభుత్వ సభలలో పెద్దలు, యువకులు వుండేవారు. దీనినిబట్టి ఈ సభలలో పాల్గొనేటందుకు వయఃపరిమితి లేకుండేది. సభ్యులకు గ్రామంలోని భూమిలో కొంత భాగమైనా ఉండాలి లేదా వ్యక్తపరచబడిన ఆస్తి అయినా ఉండాలి.

ఇట్లాంటి సభలు దేవాలయాలలో లేక సభామంటపాలలో లేక చెట్టు క్రింద సమావేశమయ్యేవి. సభలు కింద పేర్కొన్న సందర్భాలలో ఏర్పాటు చేసేవారు.

(1) కమిటీ సభలను ఎన్నుకోవడానికి

(2) లెక్కలు చూపించేటప్పుడు

(3) కులాంతర స్పర్థలు తీర్చడానికి

(4) స్థానిక సంబంధమయిన విషయాల కోసం

(5) రాజవార్త తెలియపరచడం కోసం

ఈ సభలకు కమిటీలు ఉండేవి. ఈ కమిటీలలో ముఖ్యమైనవి

(1) సంవత్సర కమిటీ

(2) తోటల కమిటీ

(3) సరోవర కమిటీ

(4) న్యాయ కమిటీ

(5) సుంకం కమిటీ

ఈ గ్రామ సభలు పెక్కు కార్యక్రమాలను కొనసాగించేవి.

వాటిలో కింద చూపిన కార్యక్రమాలు ముఖ్యమయినవి:

(1) సభ్యులను రక్షించడం

(2) గ్రామ ద్రోహులను శిక్షించడం

(3) రక్షక భటుల ద్వారా గ్రామాన్ని రక్షించడం

(4) దేవాలయాలు, చెరువులు నిర్మించడం

(5) తీర్పులు చెప్పడం, న్యాయాన్ని రక్షించడం

**మొగల్ పరిపాలనకాలంలో స్థానిక స్వపరిపాలన**

భారతదేశంలో ముస్లిం రాజుల పరిపాలన ప్రముఖ రాజకీయ పరివర్తన తెచ్చినది. జాగీర్దారీ, జమిందారీ వ్యవస్థ అమలులోనికి రావడం వల్ల గ్రామ పంచాయితీలున్నప్పటికీ అవి బలహీనమయినవి. రాజకీయ రంగంలో పంచాయితీలు బలహీనమయినా మత వ్యవస్థలో అవి పటిష్టంగానే ఉండేవి. ఈ విధంగా గ్రామ పంచాయితీలు కేవలం మత విషయాలు తప్ప రాజకీయ విషయాలలో ఇంతకు పూర్వమున్న సర్వ స్వతంత్రాన్ని పొంది వుండలేదు. అయితే ఇట్లాంటి గ్రామీణ స్వయం పరిపాలన బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో అనూహ్యమయిన పరివర్తనలు తెచ్చినవనే విషయము సత్యదూరం కాదు.

**బ్రిటిష్ కాలంలో గ్రామ పంచాయితీలు**

బ్రిటిష్ పరిపాలనలో మొట్టమొదటిసారి గ్రామ పంచాయితీలను చట్టబద్ధమైన (Statutory) సంస్థలుగా గుర్తించినారు. కేంద్ర ప్రభుత్వ పరిపాలన, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించినందువల్ల సాంప్రదాయికమయిన గ్రామీణ సభలు క్రమేపీ పతనం అయ్యాయి. బ్రిటీష్ పరిపాలన కాలంలో సివిల్ (Civil) క్రిమినల్ (Civil Criminal) కోర్టుల విస్తరణ, ఆధునిక విద్యా విధానాభివృద్ధి, భూమి శిస్తు పద్ధతి అమలు పరచడం, భావప్రసారాభివృద్ధి, పోలీసు వ్యవస్థ మొదలయిన కారణాల వల్ల సాంప్రదాయిక గ్రామీణ పరిపాలన విధానం విచ్ఛిన్నమవడం మొదలయింది. తమ పరిపాలనను కాపాడుకోవడమే కాక దానిని సుస్థిర పరచడం కోసం బ్రిటిష్ ప్రభుత్వం గ్రామ ప్రాంతాలలో గ్రామ పంచాయితీలను క్రమేపీ పునర్వ్యవస్థీకరించడంలో అనేక చర్యలను తీసుకొన్నది. 1909వ సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వం స్వతంత్ర వికేంద్రీకరణపైన ఒక ప్రత్యేక కమీషన్‌ను ఏర్పరిచింది. స్థానిక వ్యవహారాలను చూసుకోవడానికి గ్రామ పంచాయితీలను పునర్వ్యవస్థీకృతం చేయడం చాలా అవసరమని ఈ కమిషన్ పేర్కొన్నది. తరవాత ఆయా ప్రాంతాలలో (Provinces) స్థానిక న్యాయపరిపాలన వ్యవస్థలను గ్రామాలలో స్థాపించడం కోసం శాసనాలను ప్రవేశింపజేయడం జరిగింది. ఉదాహరణకు "బెంగాల్ గ్రామ స్వయం ప్రభుత్వ చట్టం 1919" "మద్రాసు, బొంబాయి, సంయుక్త ప్రాంతపు గ్రామ పంచాయితీ చట్టం 1920" "బీహార్, ఒరిస్సా గ్రామ పరిపాలన చట్టం, అస్సాం గ్రామ స్వయం ప్రభుత్వపు చట్టం 1926", "పంజాబు గ్రామ పంచాయితీ చట్టం 1935, ఇతర చట్టాలు".

గ్రామ పరిశుభ్రత, వీధి దీపాలు, అతి స్వల్ప నేరాలు (దొంగిలించడం, పోట్లాటలు, గోపహరణ, సరిహద్దు ఉల్లంఘించడం మొదలయినవి) విచారించి తీర్పులు చెప్పడం, కొంత మేరకు శిక్ష విధించడం మొదలయిన కార్యక్రమాలు గ్రామ పంచాయితీలకు అప్పజెప్పబడ్డాయి. వివిధ రకాలయిన ధన సహాయం, సుంకము, భూమిసెస్, ఆస్తిపన్ను, జరిమాన డబ్బు, టోల్‌ఫీజ్ మొదలయిన వాటి ద్వారా వచ్చే డబ్బు గ్రామపంచాయితీకి రాబడిగా వుండేది.

గ్రామ పంచాయితీలను దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఒకే విధంగా సంస్థాపించలేదు. మద్రాస్, పంజాబ్, బెంగాల్, యునైటెడ్ ప్రావిన్స్ మొదలయిన కొన్ని ప్రావిన్స్‌లు, కొన్ని ప్రత్యేక ప్రదేశాలు పంచాయితీ ప్రదేశాలుగా ప్రకటించబడినాయి. బొంబాయి ప్రావిన్స్ చట్టం 1939వ ప్రకారం అన్ని గ్రామాలలో పంచాయితీలను ఏర్పరచడాన్ని నిర్బంధం చేశారు. కాని ప్రతి పంచాయితీలో 2000 లేదా అంతకు మించి జనాభా ఉండాలి. ఈ విధంగా క్రమేపీ బ్రిటీష్ పరిపాలనలో గ్రామ పంచాయితీలను చట్టబద్ధ అంగంగా గుర్తించి అధికార రీత్యా కొన్ని విధులను, అధికారాన్ని ఇచ్చినారు. అంతేకాకుండా పంచాయితీలకు ప్రత్యేక నిధిని కేటాయించినారు.

**స్వాతంత్ర్యం తరువాత గ్రామ పంచాయితీలు**

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గ్రామ పంచాయితీల

అభివృద్ధి కొత్త వేగాన్నందుకొన్నదని చెప్పాలి. భారత రాజ్యాంగంలోని 40వ నిబంధనకు సంబంధించిన ఆదేశిక సూత్రాల (Directive Principles) ప్రకారం, దేశంలో ప్రతి రాష్ట్రం గ్రామ పంచాయితీలను వ్యవస్థీకృతం చేయాలి. తద్వారా స్వయం పరిపాలన కోసం కావలసిన హక్కులను అధికారాలను పంచాయితీ సంస్థలకు ఇవ్వవలె. అంతేకాకుండా ప్రణాళికాబద్ధమయిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వల్ల పరిపాలన వికేంద్రీకరణ జరగాలి. ఈ పరిపాలనా వికేంద్రీకరణ మౌలిక భావాన్ని అనుసరించి గ్రామ పంచాయితీల సంస్థాపన ఎంతో అవసరమయినది. ఆ కారణం వల్ల ప్రతి రాష్ట్రం గ్రామపంచాయితీలను స్థాపించడం జరిగింది. పంచాయితీలను స్థాపించడమేకాక వాటికి ఇంతకు ముందు కంటే అధికంగా అధికారాలను, హక్కులను ఇచ్చినారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 22,000 గ్రామ పంచాయితీలు ఉన్నాయి.

**సాముదాయిక పథకాలు, జాతీయ విస్తరణ సేవా సంఘము, సలహాలు**

1956–57వ సంవత్సరం ప్రణాళిక పథకాలపై ఒక జాతీయాభివృద్ధి సంఘాన్ని (National Development Council) స్థాపించారు. ఈ సంఘానికి కేంద్ర హోమ్ మంత్రి అధ్యక్షుడుగా ఉన్నాడు. ఈ సంఘం మూడు దళాలను (Teams) నియమించింది. ఈ మూడు దళాలు మూడు ముఖ్యమయిన కార్యకలాపాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది. ఈ మూడింటిలో సాముదాయక పథకాలు మరియు జాతీయ విస్తరణ సేవా సంఘం ఒకటి. ఈ సంఘాన్ని ఇంకొక పేర బలవంతరాయ్ మెహతా కమిటీ అని పిలుస్తూ ఉంటారు. ఈ సంఘం భారతదేశమంతా పర్యటన జరిపి తమ సలహాలను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సంఘం దృష్టిలో సాముదాయిక పథకాలు, జాతి విస్తరణ సేవా కార్యక్రమాలు సత్ఫలితాల నివ్వకపోవడానికి కింద పేర్కొన్న కారణాలను సూచించడం జరిగింది.

(1) ప్రజలలో ఉత్సాహాన్ని రేకెత్తించక పోవడం.

(2) సలహా కమిటీలకు అధికారము, బాధ్యత లేకపోవడం.

(3) బ్లాక్ నిధిని ఏదో విధంగా నిర్ణీత కాలంలో వెచ్చించడం.

(4) బ్లాక్ పరిపాలన సిబ్బంది అధికంగా బ్యూరోక్రటిక్‌గా మారడం.

అందువల్ల బలవంతరాయ్ సంఘం దృష్టిలో ఈ సాముదాయిక వికాస కార్యక్రమాలు సఫలీకృతం కాలేదని నిర్ణయించబడినది. ప్రజలలో ఉత్సుకతను రేకెత్తించి స్వయం సేవా కార్యక్రమాలు చేపట్టే విధంగా చూడవలెనని ఈ సంఘం సలహా ఇచ్చినది. అట్లాంటి సందర్భములో బ్లాక్ సిబ్బందిని ప్రజా ప్రతినిధులు ఆధీనంలో ఉంచవలెనని సలహా ఇచ్చింది. ఇట్లాంటి మార్పువల్ల స్థానిక సంస్థలకు కొత్త బాధ్యతలు నిర్వహించడం కోసం సరిపడే నిధులను, రెవిన్యూ లభించే వనరులను కల్పించాలని కూడా ఈ కమిటీ సిఫారసు చేసింది. ఈ భావాలను దృష్టిలో ఉంచుకుని "మూడంచెల" (Three Tier) స్థానిక ప్రభుత్వాన్ని ఏర్పరచడం కోసం సలహా ఇచ్చింది. మూడంచెల పద్ధతి అనగ గ్రామ, బ్లాక్ మరియు జిల్లా స్థాయిలో స్థానిక ప్రభుత్వమని అర్థం. ఇట్లాంటి మూడంచెల వ్యవస్థలో ప్రజలచే ఎన్నికైన పంచాయితీలు గ్రామ స్థాయిలో, సమితులు బ్లాక్ స్థాయిలో, జిల్లా పరిషత్‌లు జిల్లా స్థాయిలో ఉంటాయి.

పంచాయితీ జీవన ప్రమాణం అయిదు సంవత్సరాలు ఉండాలి. గ్రామ పంచాయితీ బడ్జెట్‌ను పరిశీలించి నమోదు చేసే అధికారాన్ని పొంది ఉండాలి. వ్యవసాయాభివృద్ధి, పశుగణాభివృద్ధి, స్థానిక పరిశ్రమాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజారోగ్యం, విద్య, పరిపాలన మొదలయిన కార్యక్రమాలు గ్రామపంచాయితీలు నిర్వహించాలని ఈ సంఘం సిఫారసు చేసింది. ఈ పరిశీలన బృందం ఈ కింద పేర్కొన్న వనరులను పంచాయితీలకు కేటాయించాలని సలహా ఇచ్చింది.

(1) బ్లాక్‌లో వసూలు అయ్యే రాష్ట్ర భూమి శిస్తు 40 శాతం కంటే తక్కువ కాకుండా ఉండాలి.

(2) భూమి శిస్తు పై సెస్

(3) వృత్తులపై పన్ను

(4) ఆస్తిపై సర్‌ఛార్జి డ్యూటి

(5) పనిముట్లు, అద్దెలపై వచ్చే నగదు రాబడిపై పన్ను

(6) మనోరంజిత కార్యక్రమాలపై యాత్ర, సంతల ద్వారా వచ్చే ఆదాయంపై పన్ను

(7) వాహనాలపై పన్ను

(8) ఐచ్ఛిక ప్రజా చందాలు

(9) ప్రభుత్వ గ్రాంటులు

పంచాయితీ సమితులలో సమన్వయాన్ని పెంపొందించడానికి జిల్లా పరిషత్తులో పంచాయితీ సమితి ప్రెసిడెంట్‌లు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, ఆ ప్రదేశ్ ప్రతినిధులు జిల్లా స్థాయి అధికారులుండవలెనని ఈ సంఘం సిఫారసు చేసింది. జిల్లా పరిషత్ సమితి బడ్జెట్‌ను పరీక్షించి, నమోదు చేసే అధికారాన్ని కలిగి ఉండాలి. సాధారణంగా జిల్లా పరిషత్ పంచాయితీ సమితి కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ ఉంటుంది. కాని, వాటిని నిర్వహించదని అని బల్వంతరాయ్ కమిటీ సలహా ఇచ్చింది.

ఈ విధంగా బలవంత్‌రాయ్ మెహతా కమిటీ ఇచ్చిన సలహాల నివేదికను ప్రభుత్వం స్వీకరించి అన్ని రాష్ట్రాలకు వాటిని అమలు పరచాలని ఆదేశాలనిచ్చింది. అయితే ఆయా రాష్ట్రాలు తమకనుగుణంగా ఈ పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పరచుకోవచ్చునని వివరించడం జరిగింది. దాదాపు అన్ని రాష్ట్రాలు జిల్లా గ్రామ స్థాయిలలో సాధారణ నమూనాను, ఇంటర్‌మీడియట్ స్థాయిలో చాలా రాష్ట్రాలు బ్లాకును యూనిట్ క్రింద పరిగణిస్తే మైసూరు, గుజరాత్ రాష్ట్రాల తాలూకాను యూనిట్‌గా ఏర్పరిచాయి. అన్ని రాష్ట్రాల గ్రామ స్థాయిలో ప్రత్యక్ష ఎన్నికలను అంగీకరించినాయి. మధ్య స్థాయిలో ఏ కొన్ని రాష్ట్రాలలోనో తప్ప అన్ని రాష్ట్రాలు పరోక్ష ఎన్నికలు ఏర్పరచినాయి. జిల్లా స్థాయిలో ఎన్నికలు కూడా ఇదే విధంగా జరుగుతున్నాయి.

పంచాయితీరాజ్ సంస్థాపన మొదటిసారి రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జరిగింది. 1959వ సంవత్సరం అక్టోబరు రెండో తేదీ పంచాయితీరాజ్ వ్యవస్థను రాజస్థాన్‌లో ప్రారంభించారు. 1959వ సంవత్సరం నవంబరు ఒకటవ తేదిన ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించినారు. అది మొదలు దేశంలో క్రమేపీ పంచాయితీరాజ్ వ్యవస్థ అన్ని ప్రాంతాలలో స్థాపించడం జరిగింది. ప్రస్తుతం పంచాయితీరాజ్ వ్యవస్థ మన దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలో ఉంది.

**– డా.బి.వి.వి. బాలకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్**
**పి.జి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటిక్స్,**
**సర్.సి.ఆర్.ఆర్. కాలెజి, ఏలూరు**



# నీటి విషయంలో పరిశుభ్రత చాలా అవసరం

మానవులకు వచ్చే రోగాలు నూటికి 80 శాతం రక్షిత మంచినీటి సదుపాయం లేకపోవడం, అపరిశుభ్ర పరిసరాల వల్ల వస్తున్నాయి. ఎక్కువమంది చిన్న పిల్లలు జబ్బులతో మరణించడానికి కారణం జబ్బులను కలుగచేసే సూక్ష్మక్రిములు నీటిద్వారా శరీరంలోనికి ప్రవేశించడమే. అమ్మవారు, తడపర పొంగు, తట్టు, గజ్జిపుండు (స్కాబిస్), తామర వంటి చర్మవ్యాధులు; గనేరియా, సిఫిలిస్ వంటి సుఖవ్యాధులు, గొంతునొప్పి, గవదబిళ్ళలు (మంప్స్) వంటివి; కలరా, టైఫాయిడ్, నీళ్ళ విరోచనాలు (అతిసార వ్యాధి), బంక విరోచనాలు, చంటి పిల్లల వాతం, పచ్చకామెరలు, నార కురుపు, నలికపాములు వంటి అనేక రోగాలు అపరిశుభ్ర వాతావరణం, పరిసరాలు, కలుషితమైన నీటివలన వస్తాయి.

- ☆ గొట్టపుబావులు, బోరింగులు, చేతిపంపులు, కుళాయిలు వాడే వారికి పరిశుభ్రమైన నీటి సరఫరా ఉంటుంది. జబ్బులు తక్కువగా వస్తాయి. కనుక ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి సదుపాయాలను ఏర్పరిచి ప్రజలను అనేక మరణాపాయ రోగాలనుండి రక్షించవచ్చు. జవహర్ రోజ్‌గార్ యోజన, ఇందిరా ఆవాస్ యోజన వంటి అనేక కార్యక్రమాల ద్వారా ఈ రక్షిత మంచినీటి సదుపాయాలను ప్రతిగ్రామంలో ఏర్పాటు చేయటానికి తగిన చర్యలను చేపట్టాలి.

**నీటి సరఫరా సరిగా లేని వారు నీటిని శుభ్రంగా ఉంచాలంటే:**

- ☆ బావులపై మూతలు ఉంచాలి, బావులకు, తాగేనీటికి, స్నానాల

**నీటి వలన అపరిశుభ్ర పరిసరాల వలన వచ్చే అనర్థాలు - వాటిని మెరుగుపర్చేందుకు తీసుకోవలసిన చర్యలు**

- ఆ ప్రాంతాలలో పశువులను, పిల్లలను మలవిసర్జన చేయకుండా చూడాలి. బట్టలు ఈ ప్రాంతాలలో ఉతకకుండా ఉండేలా చూడాలి. పశువుల పాకలను ఇళ్ళకు, మంచినీటి బావులకు దగ్గరగా ఉంచకూడదు. నీరు తోడటానికి వాడే బక్కెట్టు, తాడు, కుండ మొదలైనవి శుభ్రంగా ఉంచాలి. (బక్కెట్టు నేలపై పెట్టకుండా పైన వేలాడదీయటం మంచిది)
- జంతువులను తాగే నీటి దగ్గరికి రానీయకుండా చూడాలి. వారానికొకసారి లేదా నెలకొకసారైనా బావులలో క్లోరిన్ లేదా బ్లీచింగ్ పౌడర్‌ను చల్లేటట్లు చర్యలు తీసుకోవాలి. మురుగునీరు నిలవకుండా పారుదలకు ఏర్పాట్లు చేసి, మొక్కలు నాటి వాటికి ఆ నీరు అందేటట్లు చూడాలి. ఆ మురుగు నీరు నిలువున్నచోట డి.డి.టి ఇతర క్రిమి సంహారకమందులను చల్లి, దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా చూడాలి.

**శుభ్రమైన బావులు, పంపులు అందుబాటులో లేనిచో కాచి చల్లార్చి తాగితే జబ్బులను నివారించవచ్చు. నీటిని మరగ కాస్తే క్రిములు చచ్చిపోతాయి.**

## ఇంటిలో వాడే నీటిని శుభ్రంగా ఉంచాలంటే:

- శుభ్రమైన మూతలున్న పాత్రలలో నీరు ఉంచాలి. కుండలలోని నీటిని శుభ్రమైన కప్పు/గరిట/గ్లాసుల ద్వారా తీసుకోవాలి.
- జంతువులను ఇంటిలోని రానీయకూడదు.
- శుభ్రమైన బావులు, పంపులు అందుబాటులో లేనిచో కాచి చల్లార్చి తాగితే జబ్బులను నివారించవచ్చు. నీటిని మరగ కాస్తే క్రిములు చచ్చిపోతాయి. కాబట్టి చెరువులు, బావులు, గుంటలు, కాలవలు, వాగులలోని నీటిని అయిదు నిముషాల పాటు బాగా మరగ కాచి, చల్లార్చి తాగాలి.
- ముఖ్యంగా పిల్లలకు ఇచ్చే నీరు తప్పక కాచి చల్లార్చి వాడాలి.





☆ చిన్న పిల్లలలో సూక్ష్మక్రిముల ద్వారా వచ్చే జబ్బులను తట్టుకొనే శక్తి తక్కువగా ఉంటుంది.

☆ నీళ్ళను మరగబెట్టటానికి, అవకాశం లేకుంటే శుభ్రమైన పాత్రలో పోసి మూతపెట్టి ఒకటి, రెండురోజులపాటు నిల్వ ఉంచి తాగితే మంచిది.

**పారిశుధ్యం:**

వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటిలోపల, ఇంటి బయట పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవటాన్ని పారిశుధ్యం అంటారు. వ్యక్తిగత పరిశుభ్రత ఇంటిలో, ఇంటి చుట్టూ పరిసరాలలో, అంతేకాకుండా గ్రామమంతటిలో పారిశుధ్యం ఏర్పరచటం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించితే గ్రామం, అందులోని వ్యక్తులు ఆరోగ్యంగా ఉంటారు. మన గ్రామాన్ని ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దాలంటే వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిశుభ్రత, ఇంటిచుట్టూ పరిశుభ్రత ముఖ్యంగా మెరుగుపరుచుకోవాలి.

**వ్యక్తి పరిశుభ్రత:**

మీరు, మీ పిల్లలే కాకుండా, ఇంటిలోని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తే సంఘం బాగుపడుతుంది.

☆ ప్రతిరోజూ స్నానం చేసి, ఉతికిన బట్టలు వేసుకోవాలి.

☆ మల విసర్జన చేసిన తరువాత, వంట చేయడానికి ముందు పిల్లలకు ఏదైనా తినిపించే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో గాని, ఏదైనా పిండితోగాని కడుగుకోవాలి.

☆ మల విసర్జనకు, ఇంటిలోని పిల్లలూ, పెద్దలూ తప్పక మరుగు దొడ్లను వాడాలి.

☆ సాధారణంగా చిన్న పిలలు మట్టితో ఆడుతూ చేతులు నోటిలో పెట్టుకుంటారు. కనుక తరుచుగా చేతులు కడగాలి. ముఖ్యంగా

**ఇంటిలోని చెత్తను దూరంగా, ఒక పెద్ద గుంట తీసి దానిలో వేసి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా దానిపై ఏదైనా కప్పాలి. అది నిండిన తరువాత మట్టితో కప్పి ఉంచాలి. కొన్ని నెలలైన తరువాత మీ ఇంటి పెరటిలోని మొక్కలకు కూడా అది ఎరువుగా తయారవుతుంది.**

అన్నం పెట్టేముందు.

- కనీసం రోజులో రెండు సార్లు అయినా పిల్లల ముఖం కడగాలి. శుభ్రంగా ఉంటే ఈగలు ముఖం మీద వాలవు. అంతేకాకుండా కంటికి సంబంధించిన వ్యాధులు రావు.

## ఇంటి పరిశుభ్రత

- ప్రతిరోజు ఇంటిని శుభ్రంగా ఊడ్చుకోవాలి.
- త్రాగటానికి కాచి చల్లార్చి, మూతపెట్టిన నీటిని కాని, బోరింగు నుండి తెచ్చిన నీటిని కాని, పరిశుభ్రమైన పరిసరాలలో ఉండి, చెత్త పడకుండా ఉండే బావి నీటిని మాత్రమే తాగాలి.
- ఆహారపదార్థాలపై ఈగలు వాలకుండా మూసి ఉంచాలి.
- ఇంటికి కొంచెం దూరంలో మరుగుదొడ్లను నిర్మించుకోవాలి.
- భోజనం చేసిన తరువాత ఎప్పటి పాత్రలు, మూతలు, ఎప్పటికప్పుడు శుభ్రంగా కడిగి ఉంచాలి.
- ఇంటిలోని చెత్తను దూరంగా, ఒక పెద్ద గుంట తీసి దానిలో వేసి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా దానిపై ఏదైనా కప్పాలి. అది నిండిన తరువాత మట్టితో కప్పి ఉంచాలి. కొన్ని నెలలైన తరువాత మీ ఇంటి పెరటిలోని మొక్కలకు కూడా అది ఎరువుగా తయారవుతుంది. అలాగే పేడ, చెత్త, చెదారాలను కూడా వేయవచ్చు.
- బావులకు, త్రాగునీటికి, స్నానాల గదులకు, అంట్లుతోమే ప్రాంతాలకు దూరంగా, మురికినీరు, మురుగుదొడ్లను ఉంచాలి.
- ఇంటిలోపల, నీరు, తేమ ఉండకుండా చేస్తే చిమటలు, బొద్దింకలు పెరుగవు.
- ఇంటిలోని ప్రతి ఒక్కరు మరుగుదొడ్లను వాడడం వలన జబ్బులు రాకుండా నివారించవచ్చు.
- ఇలా చేస్తే, స్త్రీలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి, దూరం వెళ్ళాల్సిన అవసరం లేకపోవడమే గాక నాలుగు ప్రక్కలా చాటు దొరుకుతుంది.
- మరుగుదొడ్లను రోజూ శుభ్రం చేయాలి. మూతలు వేసి ఉంచాలి. మరుగు దొడ్లను నిర్మించుకోవాలని ముందుకు వచ్చినవారికి నిర్మాణానికి కావాల్సిన సహాయ సహకారాలను పంచాయితీలు అందించాలి.
- మరుగుదొడ్లు అందుబాటులో లేనివారు, పేదవాళ్ళు, పిల్లలు అందరూ కూడా ఆరు బయట మనుష్య సంచారానికి దూరంగా మలం విసర్జించాలి. మనుష్యులు నడిచే చోట నీటిబావులు, చెరువుల దగ్గర, ఇళ్ళ దగ్గర పిలలు ఆడుకోనే చోట కాకుండా దూరంగా మలవిసర్జన చేయాలి. మలాన్ని మట్టిలో కప్పివేయాలి.

## ఇంటి పరిసరాల పరిశుభ్రత

మంచినీటి బోరింగు పంపు దగ్గర మంచినీరు పట్టుకోవడమేకాక



కొందరు బట్టలు ఉతుకుతుంటారు. కొంచెం దూరంలో పిల్లలు మలవిసర్జన చేస్తుంటారు. దీని వలన మన పరిసరాలు, త్రాగునీరు, వాతావరణం కలుషితమై అనేక రోగాలు కలుగచేసే క్రిములకు నివాసమవుతున్నాయి. కనుక మనం మన ఇల్లే కాకుండా, ఇంటి చుట్టు ప్రక్కల, గ్రామంలో ఉండే ఖాళీ ప్రదేశాలు, పరిశుభ్రంగా ఉంచటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- ☆ బావి వద్ద స్నానాలు చేయడం, బట్టలు ఉతకడం, జంతువులను కడగడం, పిల్లలను ఆడనివ్వడం వంటి పనులను చేయనివ్వకుండా చూడాలి.
- ☆ గ్రామంలో బావి లేదా బోరింగు ఉన్నట్లయితే దానిచుట్టూ నీళ్ళు నిలువకుండా సిమెంటుతో గట్టు కట్టాలి. అనవసరమైన నీరు నిలువ ఉండకుండా పారేటట్లు చూడాలి. ఆ నీటిని, దూరంలో మొక్కలకు లేదా చెట్లు నాటి, పారించేటట్లు శ్రద్ధ వహించాలి.
- ☆ చెత్తాచెదారాన్ని పారపోయటానికి దూరంగా గుంటలు త్రవ్వి వాటిలో చెత్తను, పేడను పోయాలి. పశువుల పాకలను ఇళ్ళకూ, మంచినీటి బావులకూ దగ్గరగా ఉండకూడదు. ఇళ్ళకు, బావులకు దగ్గరగా పేడ వేయకుండా చూడాలి.

**మరుగుదొడ్లను రోజూ శుభ్రం చేయాలి. మూతలు వేసి ఉంచాలి. మరుగు దొడ్లను నిర్మించుకోవాలని ముందుకు వచ్చినవారికి నిర్మాణానికి కావాల్సిన సహాయ సహకారాలను పంచాయితీలు అందించాలి.**

- ☆ బోరింగులు, గొట్టపు బావులు లేనిచోట సిమెంటు బావులపై చెత్తాచెదారం పడకుండా తీగ జాలీ కప్పు వేయాలి.
- ☆ బోరింగులు, బావులు దగ్గర బట్టలు ఉతకటం, పిల్లల చేత మలవిసర్జన చేయించటం, పశువులను కడగడం వంటి పనులేవీ చేయకూడదు.
- ☆ ప్రతివారం, లేదా నెలకొకసారి తాజా బ్లీచింగ్ పౌడర్ లేదా క్లోరిన్ మందును వేసి నీటిని సురక్షితం చేయాలి. వాటర్ కెమ్ మాత్రలు కూడా వేయాలి. స్థానిక సంస్థలు, గ్రామీణ ఆరోగ్య శాఖల నుండి నీటిని ఉచితంగా పొందవచ్చు. ఈ మందులు కలరా, టైఫాయిడ్, కామెర్లను కలుగజేసే క్రిములను నశింపచేస్తాయి.
- ☆ చేతబావి, దిగుడుబావులు ఉన్నచోట బయటనీరు రాకుండా ఉండేటట్లు బావి లోపలి భాగాన్ని గచ్చు వేయాలి. సిమెంటును ఉపయోగించి బావి లోపలి, పై భాగాన్ని రాళ్ళతోగానీ, బండలతో గానీ కట్టించాలి. బావి చుట్టూ సిమెంటు వేయించి బైట పడిన నీటిని, వర్షపు నీటిని నీటిని బయటకు వెళ్ళేటట్లు చేయాలి. ఈ నీటిని పెరటితోటలో మొక్కలకు లేదా చెట్లకు పారేటట్లు చూడాలి.

## వ్యాధి నిరోధక టీకాలు:

పుట్టిన ప్రతి వందమంది పిల్లలలోనూ సుమారు ముగ్గురు పొంగుతట్టు వల్ల, ఒక్కరు ధనుర్వాతం వల్ల చనిపోతున్నారు. ప్రతి 200 మంది పిల్లలలో ఒకరు పోలియో వల్ల వికలాంగులవుతున్నారు.

- ☆ వ్యాధి నిరోధక టీకాలు చిన్నతనంలో వచ్చే కొన్ని అతి ప్రమాదకరమైన వ్యాధుల నుండి పిల్లలను కాపాడతాయి. నోటి ద్వారాకానీ, సూదిమందుగా గానీ టీకాలను ఇస్తారు. ఈ టీకాలు పిల్లలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.
- ☆ వ్యాధి నిరోధక టీకాలను వేయించకపోతే పిల్లలకు ఎక్కువగా పొంగు, కోరింత దగ్గు వచ్చే అవకాశం వుంది. ఈ వ్యాధుల వల్ల బిడ్డ చనిపోవచ్చు. ఈ వ్యాధి వచ్చి బతికినప్పటికీ బలహీనంగా అయి ఇతర వ్యాధుల వల్లకానీ, పోషకలోపం వల్లకానీ చనిపోయే అవకాశం వుంది.
- ☆ తట్టు వ్యాధి వల్ల పిల్లలలో పోషకలోప వ్యాధులు గుడ్డితనం వస్తాయి. వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించని పిల్లలకు చాలావరకు పోలియో వ్యాధి రావచ్చు. ఈ వ్యాధి వచ్చిన ప్రతి 200 మంది పిల్లలలో ఒక్కరు జీవితాంతం వికలాంగులుగా వుంటారు.
- ☆ వ్యాధి నిరోధక టీకా వేయించని వారికి దెబ్బలు తగిలి శుభ్రంగా లేకపోతే ధనుర్వాత కారణమైన క్రిములు దెబ్బల ద్వారా శరీరంలోనికి చేరతాయి. దీనివల్ల చనిపోవచ్చు.
- ☆ తల్లిపాలు తాగిస్తే పిల్లల్లో సహజంగానే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. తల్లిలో ఉన్న వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి.
- ☆ గర్భిణీతో ఉన్నవారు, 15-44 సం॥ వయస్సు ఉన్న ప్రతి స్త్రీ ధనుర్వాతం రాకుండా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి.
- ☆ వ్యాధి నిరోధక టీకాలు అత్యవసరం. బిడ్డకు ఏడాదిలోపే వ్యాధి నిరోధర టీకాలన్నీ పూర్తిగా వేయించాలి.
- ☆ జబ్బులో ఉన్న బిడ్డకు కూడా టీకాలు వేయించడం సురక్షితమే.

పిల్లలకు ఏడాది లోపే అయిదుసార్లు టీకాలు వేయించాలన్న విషయాన్ని ముఖ్యంగా గుర్తుపెట్టుకోవాలి.

ఈ టీకాలవల్ల పిల్లలు ఆరు ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ పొందుతారు.

☆ పుట్టగానే వీలయినంత త్వరగా పిల్లలకు క్షయవ్యాధి రాకుండా బిసిజి టీకాలు ఇప్పించాలి. పోలియో చుక్కలు మూడవ మోతాదు వరుసగా మూడు నెలలు వేయించాలి.

☆ తొమ్మిది నెలలు నిండిన పిల్లలకు తట్టు రాకుండా మీసెల్స్ టీకా వేయించాలి.

☆ ఒకటిన్నర సంవత్సరం వయస్సులో డి.పి.టి. బూస్టరు డోసు పోలియో టీకాలు, 5 సం. వయస్సులో ఒక మోతాదు డి.టి. వేయించాలి.

☆ జబ్బులో ఉన్న బిడ్డకు కూడా టీకాలు వేయించడం సురక్షితమే.

**వ్యాధి నిరోధక టీకాలు:**

☆ ఊర్లోని 5 ఏళ్ళ లోపు పిల్లలకు, గర్భవతులకు నెలలో ఒకరోజు

| వయస్సు | టీకాలు | రోగాలు |
|---|---|---|
| పుట్టిన వెంటనే | బి.సి.జి. | క్షయ |
| 6 వారాలు లేదా | డి.పి.టి. (1వ దఫా) | కంఠవాపు, కోరింతదగ్గు |
| 11/2 నెలలు | డి.పి.టి. (1వ దఫా) | ధనుర్వాతం, పోలియో |
| 10 వారాలు లేదా | డి.పి.టి. (2వ దఫా) | కంఠవాపు, కోరింత దగ్గు |
| 2 1/2 నెలలు | ఒ.పి.వి. (2వ దఫా) | ధనుర్వాతం, పోలియో |
| 14 వారాలు లేదా | డి.పి.టి. (3వ దఫా) | కంఠవాపు, కోరింత దగ్గు |
| 3 1/2 నెలలు | ఒ.పి.వి. (3వ దఫా) | ధనుర్వాతం, పోలియో |
| 9 నెలలు | మీజిల్స్ ఇంజక్షన్ | పొంగు (తట్టు/తడపర) |
| 16-24 నెల మధ్య | డి.పి.టి. (బూస్టరు) | కంఠవాపు, కోరింతదగ్గు |
| లేదా 1 1/2 నుండి | ఒ.పి.వి. (బూస్టరు) | ధనుర్వాతం, పోలియో |
| 2 సం॥ మధ్య | | |

తప్పక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరిగేటట్లు చూడాలి. గర్భవతులకు ధనుర్వాతం రాకుండా కాపాడటానికి కూడా ఈ వ్యాధి నిరోధక టీకాలు నిర్ణీత దినాన అందేటట్లు చూడాలి. అలా నిర్ణయించిన రోజున ఏ కారణం చేతనైనా పొందలేకపోతే వారు ఆరోగ్యకేంద్రానికి వెళ్ళి టీకాలు పొందేటట్లు చూడాలి.

☆ ఆరోగ్య కార్యకర్తలు ఈ వ్యాధి నిరోధక టీకాలను ఐస్ వేసిన పెట్టెలో భద్రంగా ఉంచి, వీరికి అందేటట్లు తగిన అజమాయిషీ చర్యలు తీసుకోవాలి.

**వ్యాధి నిరోధక టీకాలు చిన్నతనంలో వచ్చే కొన్ని అతి ప్రమాదకరమైన వ్యాధుల నుండి పిల్లలను కాపాడతాయి. నోటి ద్వారాకానీ, సూదిమందుగా గానీ టీకాలను ఇస్తారు. ఈ టీకాలు పిల్లలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.**

☆ 15-44 సం॥ మధ్య వయస్సు ఉన్న ప్రతి స్త్రీ ధనుర్వాతం రాకుండా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి.

☆ గ్రామంలోని దాయిలు (మంత్రసానులు) ప్రసవ సమయంలో అశుభ్రంగా ఉన్న కత్తి ఉపయోగించి బొడ్డును కోసి ధనుర్వాతం కలుగజేసే ప్రమాదం ఉంది కనుక వారికి తగిన శిక్షణను, డెలివరీ కిట్‌ను ప్రతి ఒక్కరికి అందేటట్లు చూడాలి. వారు ఈ కిట్‌ను తప్పక ఉపయోగించి భద్రపరుచుకొనేలా వారిని ప్రోత్సహించాలి.

☆ఇలాంటి శిక్షణ అందుబాటులో లేని దాయిలు వారు బొడ్డు కోయడానికి ఉపయోగించే వస్తువులను శుభ్రంగా ఉడకబెట్టి చల్లార్చి వాడేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

☆ ప్రసవ సమయంలో ప్రమాద పరిస్థితిని ఎదుర్కొనేందుకు అవసరమైతే సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు తరలించటానికి ఎడ్ల బండ్లను అత్యవసరమైన పరిస్థితులలో ఉపయోగించటానికి ఎప్పుడూ అందుబాటులో ఉండేటట్లు తగిన ఏర్పాట్లు చేయాలి.

☆ఎ.ఎన్.ఎమ్‌లకు, ఇతర ఆరోగ్య కార్యకర్తలకు టీకాల కార్యక్రమం సక్రమంగా జరుగడానికి అవసరమైన సదుపాయాలను పంచాయితీ ప్రాంతంలో కలుగచేయాలి.

☆ అంగన్‌వాడీలు ఉన్నచోట, కార్యకర్తల సహాయంతో గ్రామంలోని పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు, ఎ-విటమిన్ సిరప్, అందేటట్లు, గర్భవతులుగా ఉన్న వారికి ధనుర్వాతం రాకుండా టీకాలు, ఇతర ఆరోగ్య సదుపాయాలు సకాలంలో అందరికీ అందేందుకు సమగ్రమైన చర్యలను చేపట్టవచ్చు. ★

# పంచాయితీరాజ్ సంస్థలలో అకౌంటింగ్



భారత రాజ్యాంగాన్ననుసరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాడ్డాయి. ఈ రెండు ప్రభుత్వాల విధులు, నిధులు, కార్యనిర్వాహక వర్గం అని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొనబడ్డాయి. అయితే పరిపాలనలో ప్రజలు నేరుగా పాల్గొనే అవకాశం, ప్రజాస్వామ్యాన్ని మరింత దిగువ స్థాయికి తీసుకువెళ్ళవలసిన అవసరాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి, రాజ్యాంగం 73వ సవరణ ద్వారా మూడవ అంచె అయిన స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం జరిగింది.

పంచాయితీ రాజ్ సంస్థలు ఇది వరలో ఉన్నప్పటికి, వాటి అస్థిత్వం సరిగా ఉండకపోవడం వలన రాజ్యాంగ సవరణ ద్వారా వాటికి స్థానిక ప్రభుత్వాల ప్రతిపత్తి కల్పించడం జరిగింది. స్థానిక ప్రభుత్వాలైన పంచాయితీరాజ్ సంస్థలు 29 అంశాలలో తమ తమ బాధ్యతలను నెరవేర్చవలసి ఉంటుంది.

ఇన్ని అంశాలను నిర్వహించే సంస్థలకు ఈ క్రింది కారణాలు దృష్ట్యా పరిపూర్ణమైన అకౌంటింగ్ విధానం అవసరం.

1. పంచాయితీరాజ్ సంస్థలు ప్రజాస్వామ్య సంస్థలు కాబట్టి వాటి అకౌంటింగ్ ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉండాలి.
2. ఈ సంస్థల ప్రధాన లక్ష్యం గ్రామీణాభివృద్ధి కాబట్టి, నిర్ణయించిన ప్రాధాన్యాల ప్రకారం ఖర్చు పెట్టడానికి, దానిని పర్యవేక్షణ చేయటానికి వీలుగా ఉండాలి.
3. మూడంచెల పంచాయితీరాజ్ సంస్థల అకౌంటింగ్‌లో సాధ్యమైనంత వరకు ఏకరూపత ఉండాలి.
4. ఈ సంస్థలు రాజ్యాంగబద్ద స్థానిక ప్రభుత్వాలు కాబట్టి వాటి అకౌంటింగ్‌కు చట్టబద్ధత ఉంటుంది.
5. సమగ్రమైన అకౌంటింగ్ విధానం ద్వారా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు మదింపుచేసి, సత్వర ప్రణాళిక ద్వారా నిధులను మరింత అభిలషణీయ స్థాయిలో వినియోగించే వీలుండాలి.

పై అంశాలను దృష్టిలో ఉంచుకొని కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీరాజ్ సంస్థలలో నూతన అకౌంటింగ్ విధానం ప్రవేశపెట్టింది. నూతన విధానంలో ముఖ్య అంశాలు:

▲ బడ్జెట్‌ను అకౌంటింగ్ కోడ్ ప్రకారం ఆదాయ వ్యయాలను వర్గీకరణ చేసి సంబంధిత పద్దులలో తయారు చేయాలి. నిర్దేశించిన బడ్జెట్ నమూనాలో బడ్జెట్ తయారు చేయాలి.



▲ ప్రతి సంవత్సరాంతంలో రాబడుల, వ్యయాల ఖాతాను తయారు చేయాలి. దీనినే సాంవత్సరిక లెక్కల ఖాతా అని కూడా అంటారు.

▲ కొత్తగా 16 రిజిష్టర్లు ప్రవేశపెట్టబడ్డాయి. వీటిని తప్పనిసరిగా నిర్వహించాలి. అయితే ఇది వరలో ఉన్న రిజిష్టర్లను అవసరం మేరకు నిర్వహించాలి. ★



# సంతోష జీవనానికి పర్యావరణమే పునాది

పర్యావరణం అంటే మన చుట్టూ ఉన్న పరిసరాలు. వీటిలో రకరకాలు జీవులు, జీవేతరాలు వస్తువులు అన్నీ ఉంటాయి. జీవేతరాల్లో భూమి, నీరు, గాలి ముఖ్యమైనవి. జీవుల్లో మనుషులు, జంతువులు, మొక్కలు, పురుగులు ముఖ్యమైనవి.

మొక్కలు, జంతువులు తాము పుట్టి పెరిగి, నివశిస్తున్న పరిసరాలకు, పర్యావరణానికి తమను తాము అనుగుణంగా మార్చుకుంటూ ఉంటాయి. పర్యావరణంలో ఏదైనా మార్పు కలిగితే వీటి సాధారణ జీవితానికి అసౌకర్యం కలగవచ్చు. ఇట్లా అసౌకర్యం కలిగించే మార్పులను, లేదా పర్యావరణ క్షీణతను మనం 'పర్యావరణ కాలుష్యం'గా వ్యవహరించవచ్చు. జంతువులు, మొక్కలు, మనుషులు సంతోషంగా జీవించాలంటే మనం పర్యావరణాన్ని జాగ్రత్తగా కాపాడుకోవలసి ఉంటుంది.

## మంచి పర్యావరణాన్ని పెంపొందించుకోవటం ఎట్లా?

మంచి పర్యావరణానికి పర్యావరణంలో ముఖ్య భాగాలైన భూమి, నీరు, గాలి మొదలైన వాటిని కాలుష్యం బారి నుంచి కాపాడుకోవాలి. పరిసరాలన్నీ శుభ్రంగా ఉండాలి. భూమిని, నీటివనరులను, అడవులను, వాతావరణాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. మన అవసరాలు తీరాలంటే ఈ ప్రకృతి వనరులకు, జీవులకు మధ్య ఒక సమతౌల్యాన్ని పాటించాలి.

### భూమి పరిరక్షణ

భూగ్రహం పై పొరే భూమి. దీంట్లో మట్టి, రాళ్లు ఉంటాయి. నీరు కూడా ఈ పొరలోనే ఉంటుంది. వాటిలో పోషకాలు, గాలి ఉండి క్రిమికీటకాలు, మొక్కలు పెరగడానికి ఉపయోగపడతాయి. మట్టిలో పోషకాలు వేలాది సంవత్సరాలుగా ఏర్పడ్డాయి. గడ్డి, మొక్కలు, చెట్ల పెంచడం ద్వారా మట్టికి కవచం ఏర్పాటు చేసి కాపాడకపోతే, వాన వచ్చినప్పుడు, గాలికి ఈ మట్టి పోషకాలు కొట్టుకునిపోయే అవకాశం ఉంది.

### నీటి పరిరక్షణ

నీరే మనకు జీవనాధారం. నీటిలోనే మొక్కలు పెరుగుతాయి. పంటలు బాగా పండుతాయి.





వాతావరణం కూడా నీటితోనే చల్లగా ఉంటుంది. ప్రవహించే నీరు కూడా శక్తివనరే. రవాణాకి సాధనమే.

నీటికి వర్షం ప్రధానాధారం. వాన వచ్చినప్పుడు మట్టి పీల్చుకుని భూమిలో నిల్వ చేస్తుంది. మట్టి పీల్చుకోకుండా ఉన్న చోట కొంత వర్షపు భాగం ప్రవహించి నదులుగా మారి, చివరికి సముద్రంలో కలుస్తుంది. తాగడానికి; చెట్లను, పంటలను పెంచడానికి నీటిని శుభ్రంగా ఉంచుకోవటం అవసరం.

### అడవుల పరిరక్షణ

మన పర్యావరణంలో అడవులు ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఎందుకంటే గాలిని చెట్లే శుభ్రంగా ఉంచుతాయి. వాతావరణాన్ని చల్లగా ఉంచేది చెట్లే. చెట్లు లేకుండా మనం బతకలేము. ఎందుకంటే మనం పీల్చేగాలిని (ఆక్సిజన్) చెట్లే తయారు చేస్తాయి.

చెట్లు సూర్యరశ్మిని పీల్చుకుని, వేడిని తగ్గిస్తాయి. చెట్ల జంతువులకు, మనుషులకు తిండిని, మనుషులకు వంట చెరకును, కలపను, మందులను, తేనెను, జిగురును, లక్కను ఇస్తాయి. చెట్ల వేర్లు మట్టి లోపలికి లోతుగా చొచ్చుకుని పోయి, భూమిలో ఖాళీలను సృష్టిస్తాయి. ఈ ఖాళీలలో నీరు నిల్వ ఉంటుంది. నేలపై పడిన ఎండు ఆకులు నేలను కప్పివేసి, మరింత వర్షపు నీటిని పీల్చుకుంటాయి. ఈ నీరు నెమ్మదిగా కిందికి దిగుతుంది. ఈ విధంగా ఎక్కువ చెట్లను పెంచడం ద్వారా ఎక్కువ వర్షపు నీటిని నేలలో ఇంకేలా చేయవచ్చు. అడవుల్లోని చెట్లను పరిరక్షించడం ద్వారా వరదలను నివారించవచ్చు.

### గాలి పరిరక్షణ

సముద్రమట్టం వద్ద గాలి చిక్కగా ఉంటుంది. సముద్రమట్టం దాటి మనం పైకెళ్లే కొలదీ గాలి పలుచబడుతుంది. ఆక్సిజన్ తగ్గిపోతుంది. సముద్రమట్టానికి 12 కిలోమీటర్ల ఎగువన గాలి స్వభావం మారుతుంది. ఈ పొరలో ఎక్కువ ఓజోన్ ఉంటుంది. సూర్యరశ్మిలోని అల్ట్రావయొలెట్ కిరణాలను ఓజోన్ పీల్చుకుంటుంది. ఓజోన్ పొర పీల్చుకోని పక్షంలో ఈ కిరణాలు భూమికి చేరి మనుషులకు, జంతువులకు, చెట్లకు హాని కల్గిస్తాయి. శబ్దాలను మోసుకెళ్లేది గాలి మాత్రమే. గాలే లేకపోతే, మనకు శబ్దాలు వినపడవు. శబ్దపరిమాణం పెరిగే కొలదీ అది జంతువులను, మనుషులను చికాకు పెడుతుంది. పెద్ద శబ్దాలు అదేపనిగా వింటూ ఉంటే చెవుడు వస్తుంది. అందువల్ల పర్యావరణం మెరుగుపడాలంటే, శబ్దాలు ఎక్కువ లేకుండా ప్రశాంతంగా ఉంచటం అవసరం.

## ఆహారపు గొలుసు








### పర్యావరణంలో జంతువులు

మనుషులు, మన చుట్టూ ఉన్న జంతువులు మన పర్యావరణంలో భాగం. మొక్కలు, జంతువులు మన ఆహారానికి ప్రధానమైన ఆధారం. చెట్లు బాగా పెరగడానికి అవసరమైన ఎరువులను జంతువులు తమ పేడ ద్వారా అందిస్తాయి.


జంతువుల సంఖ్య కాని, మనుష్యుల సంఖ్య కాని తక్కువగా ఉండటం అవసరం. ఎందుకంటే భూమి కోసం, నీటి కోసం, ఆహారం కోసం జంతువులు, మనుష్యుల మధ్య పోటీ నెలకొంటుంది. మనుషులు, జంతువుల సంఖ్య పెరిగితే, తక్కువ సమయంలోనే సహజ వనరులు అంతరించిపోయి, వాటికి కొరత ఏర్పడుతుంది.

వివిధ రకాల పర్యావరణాల్లో వివిధ రకాల మొక్కలు, జంతువులు పెరుగుతూంటాయి. ఆయా పర్యావరణాలకు అనుగుణమైనవి అక్కడ పెరుగుతుంటాయి. మామిడి, సపోటా, కొబ్బరి, అరటి వంటివి ఉష్ణమండలాల్లో పెరుగుతుండగా, యాపిల్స్, ప్లమ్‌లు చల్లటి ప్రదేశాల్లో పెరుగుతాయి. మంచి ఆదర్శవంతమైన పర్యావరణాల్లో మొక్కలు, జంతువులు, మనుషులు కలిసి జీవించగలవు. ఇట్లాంటి పరిస్థితినే పర్యావరణ సమతౌల్యం అంటారు.

### పర్యావరణ సమతౌల్యత అవసరం:

మొక్కలు మనుష్యులకు, జంతువులకు అవసరమైన కనీస వనరు. చెట్లపై ఆధారపడి బతికే చిన్న జంతువులను కొన్ని పెద్ద జంతువులు తింటాయి. ఇతర జంతువులకి, మనుషులకి ఆహారంగా ఉపయోగపడే మొక్కలు, జంతువులు





ఆహారపు గొలుసులో భాగంగా మారుతాయి. ఈ మొక్కలు, జంతువులు నాశనం అయితే, ఆహారపు గొలుసులోని ఇతర జంతువులు, మనుషుల జీవితాలకు ఆటంకం ఏర్పడుతుంది. మన చుట్టూ అనేక ఆహారపు గొలుసులున్నాయి.

ఈ ఆహారపు గొలుసులకు అవసరమయ్యే వివిధ రకాల చెట్లు, జంతువులు సరిపడిన సంఖ్యలో ఉండటం అవసరం. ఇలాంటి పరిస్థితి మంచి పర్యావరణ సమతౌల్యతకు సంకేతం. ఆహారపు గొలుసులు ఎందుకు తెగిపోతాయో కొన్ని ఉదాహరణలు చూద్దాం.

కదలని నీటిలో దోమలు గుడ్లు పెడతాయి. దోమలు లార్వాని, ఇతర పురుగులని కప్పలు తింటాయి. కప్పలని పాములు తింటాయి. పాములను ముంగిసలు, గద్దలు తింటాయి. ఆహారం కోసం వరి పొలాలలోని కప్పలను పెద్ద సంఖ్యలో మనుషులు సేకరించినట్లయితే, దోమలు, ఇతర పురుగుల సంతతి విపరీతంగా పెరిగిపోతుంది. ఇవి పంటలకు నష్టం కలిగించుటమే కాక, మనుషులకు మలేరియా వంటి వ్యాధులు కల్గిస్తాయి. ఆహారానికి కప్పలు సరిగ్గా దొరకనట్లయితే, ఇతర ప్రత్యామ్నాయ ఆహారాలైన ఎలుకలు, గుడ్లు, చిన్న పక్షులు మొదలైన వాటి కోసం వెతుక్కుంటూ పాములు మనుష్యుల ఇళ్లలో, ఊళ్లలో చొరబడతాయి.

ఇదే పద్ధతిలో పులులు, సింహాల సంఖ్య తగ్గిపోతే, లేళ్లు, దున్నపోతుల సంఖ్య పెరిగిపోతుంది. ఆహారం కోసం ఇవి మొక్కలపై ఆధారపడే జంతువులు. వీటి సంఖ్య పెరిగిపోయినప్పుడు, ఇవి అడవులను, మొక్కలను నాశనం చేస్తాయి. ఏనుగులకు అడవిలో సరయిన ఆకులు, మొక్కలు దొరకకపోతే, అవి సమీపంలోని గ్రామాలపై పడి వ్యవసాయ పంటలను తింటాయి. మనుషులు, జంతువుల జనాభా పెరిగే కొలదీ, నేల విస్తీర్ణం పెరగదు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నేలపైనే పెరిగిన జనాభా మొత్తం













ఆధారపడవలసి వస్తుంది. దాంతో పర్యావరణ అసమతౌల్యత ఏర్పడుతుంది.

పాతరోజుల్లో క్రిముల వల్ల కలిగే వ్యాధులతో పెద్ద సంఖ్యలో మనుష్యులు మరణించేవారు. శాస్త్ర విజ్ఞానం పెరిగేకొలదీ, వేక్సిన్లు అభివృద్ధి చేశారు. కలరా, తట్టు, డిఫ్తీరియా, టైఫాయిడ్, టి.బి. మొదలైన వ్యాధులను నివారించడానికి ఈ వేక్సిన్లు ఉపయోగపడుతున్నాయి. అందువల్ల, ఇప్పుడు ఎక్కువమంది ప్రజలు ఈ వ్యాధులను తట్టుకుని దీర్ఘకాలం జీవించగలుగుతున్నారు. దీనివల్ల కూడా జనాభా అధికమవుతోంది. మనుషుల సంఖ్య పెరిగేకొలదీ ఎక్కువ ఇళ్లు కావాలి. మరింత ఆహారం కావాలి, మరింత వంట చెరుకు, ఇంధనం, ఇతర పదార్థాలు కావాలి. కాని వాటిని నిర్ణీతమైన నేలపై మనం తయారు చేయలేము.

1951లో ఒక చదరపు కిలోమీటరు విస్తీర్ణం ఉన్న నేలపై 117 మంది జీవించేవారు. ఇప్పుడు అంతే నేలపై 250 మంది జీవిస్తున్నారు. 147 కోట్ల హెక్టార్ల విస్తీర్ణం ఉన్న పంట పొలాలు 1951లో 36.1 కోట్ల జనాభాకు తిండిపెడితే, ఇప్పుడు 85 కోట్ల జనాభాకు తిండి పెడుతున్నాయి.





ఆహారపు ఉత్పత్తులను ఈ విధంగా పెంచడానికి శాస్త్రవేత్తలు వివిధ రకాల పద్ధతులను అవలంబిస్తున్నారు. అధిక దిగుబడులనిచ్చే వంగడాలను సృష్టించటం, రసాయనపు మందులు, ఎరువులను వాడటం మొదలైనవి వీటిలో కొన్ని. అయితే ఈ రసాయనపు మందులు, ఎరువుల వల్ల గాలి, నీరు, నేల అన్నీ కలుషితమవుతున్నాయి. దీనివల్ల ప్రజలకు ఆరోగ్యపు సమస్యలు అనేకం తలెత్తుతున్నాయి. అయినా ఇన్ని రకాల సమస్యలు ఎదుర్కొంటూ, ఈ పద్ధతులను అవలంచించినప్పటికీ, ఇంకా ఇంకా పెరుగుతున్న జనాభాకు సరిపడా ఆహారపదార్థాలను పండించటం మనవల్ల కాకపోవచ్చు.

ఆహారం సరిగా దొరకనప్పుడు ప్రజలు చేసేదేమిటంటే, అడవులను నరికి, అక్కడి జంతువులను తినటం మొదలుపెడతారు. బతకటానికి తమలో తాము కుమ్ములాడుకుంటారు. పర్యావరణ సమతౌల్యత దెబ్బతింటే, కలిగే దుష్పరిణామాలు ఇవే. అందువల్ల మనుష్యులు ప్రశాంతంగా జీవించాలంటే, పర్యావరణ సమతౌల్యత ఎంతో అవసరం. మనుషుల జనాభాను, జంతువుల జనాభాను అదుపులో పెడుతూ, సహజ వనరులైన నేల, గాలి, నీటిని పరిరక్షించుకుంటే, పర్యావరణం చక్కగా ఉంటుంది.

– పి. మంజుల

అనువాదం: వై. సరోజ (ఈ వ్యాసం తదుపరి భాగం వచ్చే నెలలో)

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బులంద్షర్ జిల్లాలో వున్న ఖుర్జా ప్రజల ప్రధాన వృత్తి కుండల పరిశ్రమ. ఈ ప్రాంతం కుండల పరిశ్రమలకు ప్రసిద్ధి చెందినది. సంప్రదాయకంగా వస్తున్న కుండల తయారీ వృత్తి మీద ఈ ప్రాంత ప్రజలలో ఎక్కువ శాతం మంది ఆధారపడిఉన్నారు.

ఖుర్జా కుండల పరిశ్రమకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. 1946లో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కుండల పరిశ్రమ అభివృద్ధి కేంద్రాన్ని స్థాపించింది. ప్రారంభంలో ఎనిమిది మంది కుండల తయారీ దారులుండేవారు. ప్రస్తుతం అక్కడ 250 కుండల పరిశ్రమలు పని చేస్తున్నాయి. మొదట వీరు తయారు చేసిన ఉత్పత్తులు తక్కువ నాణ్యత కల్గియుండేవి. వీటికి చాలా తక్కువ డిమాండ్ వుండేది. తదుపరి కాలంలో కుండల పరిశ్రమ స్వతంత్రంగా అభివృద్ధి చెందింది. ఈ రంగంలో వ్యాపార అవకాశాలు విస్తృతంగా వుండటం వల్ల ఎక్కువ మంది ప్రజలు ఈ వృత్తి విద్యనే అభ్యసిస్తున్నారు.

# బాలకార్మిక వ్యవస్థ సమాజానికి శాపం

ఖుర్జా ప్రాంతంలో తయారయ్యే వస్తువులు ఎంతో వైవిధ్యం కల్గి ఉంటాయి. అందమైన గాజు వస్తువులు, పింగాణీ పాత్రలు, పూలకుండీలు, కర్ర సామాను, జాడీలు మాత్రమే కాకుండా, రసాయన పరికరాలు, విద్యుత్ ఇన్సులేటర్‌లు మొదలైనవి కూడా తయారు చేస్తారు.

ఢిల్లీ పట్టణానికి సుమారు 85 కిలోమీటర్ల దూరంలో ఖుర్జా ఉంది. బాల కార్మికుల నిర్మూలన సంఘం శిక్షణలో భాగంగా ఖుర్జాలోని ఐదు కుండల తయారీ పరిశ్రమలను సందర్శించాము. అక్కడి పరిశ్రమల యాజమాన్యాన్ని, కార్మికులను కలుసుకొని మాట్లాడేందుకు మాకు అవకాశం లభించింది. ఖుర్జా కుండల పరిశ్రమలో పనిచేసే కార్మికుల్లో ఎక్కువ శాతం మంది బాలకార్మికులే, ముఖ్యంగా స్థానికులే. ఇందులో అతి తక్కువ మంది మాత్రమే 5వ తరగతి వరకు చదువుకున్నవారు. అత్యధికులు నిరక్ష్యరాస్యులే. వీరంతా రైతు కుటుంబాల నుండి వచ్చినవారే. రెక్కాడితే గాని డొక్కాడని బాలకార్మికులు కొందరైతే, చాలా మంది తల్లిదండ్రులు అదనపు ఆదాయం కోసం మాత్రమే తమ పిల్లలను పనికి పంపిస్తుంటారు. పని ప్రదేశాలకు చేరుకోవడానికి బాలకార్మికులు రోజూ 4 లేక 5 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. రోజూ 8 గంటల లెక్కన నెలంతా కష్టపడితే వీరికి వచ్చే ఆదాయం మాత్రం 200 రూపాయలు. వీరికి తక్కువ వేతన మిచ్చి ఎక్కువ గంటలు పని చేయించుకుంటారు.

బాల కార్మికులు తలపై చెక్క, పోతవస్తువులు, మట్టి మొదలైన బరువులను జాగ్రత్తగా మోసుకొని వెళ్ళి జిగ్గర్ జాలీ దగ్గర పనిచేసే కార్మికుడికి అందచేస్తారు. ఈ పనిచేసే బాలలను ఫాంటివాల్స్ అంటారు. ఖుర్జాలోని 95 శాతం మంది బాలకార్మికులు ఈ కోవకి చెందినవారే. కటివాలా అంటే జిగ్గర్ జాలీ దగ్గర పనిచేసే కార్మికుడు. వీరి వద్దకు మట్టి ముద్దలను తీసుకు వెళ్ళేందుకు బాలకార్మికులను ఉపయోగిస్తారు. ఇద్దరు లేక ముగ్గురు బాల కార్మికులు ఒక కటివాలా క్రింద పనిచేస్తుంటారు. వీరందరూ ఒక కాంట్రాక్టరు ఆధ్వర్యంలో పని చేస్తుంటారు. పరిశ్రమల్లో పనిని కాంట్రాక్టర్లుకు అప్పగిస్తారు. వీరు తక్కువ సమయంలో ఎక్కువ పనిచేయిస్తారు. బాలకార్మికులు పెద్దల కన్నా చురుకుగా, వేగంగా పనిచేస్తారు కాబట్టి వీరినే ఎక్కువగా నియమిస్తారు.



తయారు చేసిన కుండలు పాక్షికంగా ఎండబెట్టిన తర్వాత వాటిని జాగ్రత్తగా మోసుకుని వెళ్ళే పని కూడ బాల కార్మికులకు అప్పగిస్తారు. బయటవున్న కుండలను ఎత్తుకుని మోసుకు వెళ్ళి లోపల వున్న కార్మికుల దగ్గర క్రింద పెట్టిన తరువాత బాలకార్మికులకు చేతులు, కాళ్ళు వణుకుతుంటాయి. అక్కడ ఉన్న 5 ఫాక్టరీల్లో. ఒక కట్టె మూతపై 90 లోటాలు పెట్టి తలమీద పెట్టుకుని మోసుకు వెళ్తూ వుంటారు. ఇలా వారు మోయలేని బరువుని వారి చేత మోయిస్తున్నారు.

కొన్ని పరిశ్రమల్లో బాలకార్మికులని మౌల్ట్స్ నుండి హ్యాండిల్స్‌ను తీసివేయడానికి మరియు హ్యాండిల్స్‌ను కావలసిన సైజులో కత్తిరించటానికి ఉపయోగిస్తారు. వీరు రోజులోని ఎనిమిది గంటల షిఫ్ట్‌లో 3000 నుంచి 4000 వరకు వస్తువుల్ని కత్తిరిస్తారు. లోటాలు, పింగాణీ పాత్రల తయారీ పరిశ్రమలలో కూడ బాలకార్మికులు పనిచేస్తారు.

ఒక పరిశ్రమలోనైతే 12 ఏళ్ళ బాలుడు 24 కేజీల బరువున్న వస్తువుని ఒక్కడే మోసుకు వెళ్ళడం నేను గమనించాను. ఆ బరువు మోయలేక అతని శరీరం వంగిపోతున్నది.

పనిచేసే బాలకార్మికుల్ని నేను ఫోటోలు తీయడం గమనించి వారు అక్కడ నుండి మెల్లగా వెళ్ళిపోవటానికి ప్రయత్నించారు. వారిలో ఒక బాలుడు మాత్రమే ధైర్యంగా నాతో మాట్లాడడానికి ముందుకు వచ్చాడు. ఎప్పుడైనా కంపెనీల అధికారి తనిఖీకి వస్తే బాల కార్మికులను పరిశ్రమ యాజమాన్యం వెనుక ద్వారం గుండా బయటకు పంపించి వేస్తుంది. ఒకవేళ తనిఖీ అధికారి

గమనిస్తే రూ. 10,000/- చెల్లించి బయటపడటానికి ప్రయత్నిస్తారు. కొంతమంది యాజమాన్యం బాలకార్మికులను లుంగీలు ధరించి మాత్రమే పనికి అనుమతిస్తారు. 12 ఏళ్ళ నుండి 14 ఏళ్ళ బాలురు కూడ లుంగీలు ధరించడం వల్ల 16 ఏళ్ళు పైబడిన వారిలా కన్పిస్తారు. కొన్ని సందర్భాల్లో తప్పుడు వయస్సు ధృవీకరణ పత్రాలు కూడ సమర్పిస్తారు.

బాలకార్మికులను నేను ప్రత్యక్షంగా కలుసుకుని మాట్లాడే అవకాశం లభించింది. కొందరి బాలల బ్రతుకు పోరాటాన్ని ఇక్కడ పరిశీలిద్దాం.

గత 5 ఏళ్ళుగా ఖుర్జా పరిశ్రమలో పనిచేస్తున్న సుధీర్ అనే 12 ఏళ్ళ అనాధ బాలుడు దైనందిన కార్యక్రమం ప్రొద్దున్న 8 గంటల నుండి మొదలై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. అతని తల్లిదండ్రులు 5 ఏళ్ళ క్రిందట మరణించారు. బ్రతుకు పోరాటానికి ఖుర్జా చేరుకుని కుండల పరిశ్రమలో చేరాడు. నీళ్ళు నిండిన కళ్ళతో, వణికే చేతులతో పనిచేస్తున్న ఆ బాలుడ్ని చూస్తే నాకు ఎంతో బాధ కలిగింది.

మరియొక బాలుడు రాము విషయానికొస్తే 5వ తరగతి వరకు చదువుకుని, చదువులో వెనుకబడి, చదువు వల్ల వచ్చే ఉపయోగాలు తెలియక బడిమానేసి, ఆదాయం వస్తుంది కదాని పనిలో చేరి బాలకార్మికులుగా మారాడు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు రాముని బుద్ధిగా చదువుకోమని చెప్పలేకపోయారు. పని వల్ల సుఖంగా బ్రతుకుతాడని భావించారు.

ఎంతోమంది బాలకార్మికులు చదువుకునే పరిస్థితులు లేక, చదువు వల్ల ఉపయోగాలు తెలియక పరీక్షలు తప్పి బాలకార్మికులుగా మారుతున్నారు. తల్లిదండ్రులకు, వారి పిల్లలకు, అక్షరాస్యత పెంపొందిస్తే, ప్రాథమిక విద్య, అనియత విద్యకు మౌలిక వసతులు కల్పిస్తే కొంతవరకు ఈ బాలకార్మిక వ్యవస్థను తగ్గించవచ్చు.

బాలకార్మికులను కాంట్రాక్టర్ల ద్వారా ఈ కుండ పరిశ్రమలకు ఎలా తరలిస్తున్నారు. కాంట్రాక్టర్లు గ్రామాలకు వెళ్ళి పనికోసం బాలకార్మికులు మాత్రమే కావాలని అడుగుతారు. వారు బాగా పనిచేస్తారని, చెప్పినట్టు వింటారని బాలలను మాత్రమే కార్మికులుగా కోరుకుంటారు. అప్పుడుడప్పుడూ యువకార్మికులను పనిలో పెట్టుకునేందుకు తిరస్కరిస్తారు కూడా.

పరిశ్రమల యాజమాన్యం పనిచేయటానికి బాలకార్మికులనే కోరుకుంటున్నది. ఎందుకంటే తక్కువ వేతనంతో ఎక్కువ పని చేయించుకోవచ్చు. లేతవయస్సు పిల్లలు చురుకుగా వేగంగా ఎంతటి కష్టమైనా ఓర్చుకుంటూ సులభంగా పనిచేస్తారు. వయోజన కార్మికులు కనీస వసతులు కల్పించాలని కోరుకుంటారు. బాలకార్మికులైతే వినయ విధేయలతో పనిచేసుకుంటూ ఉంటారు. ఇబ్బందులు లేకుండా యాజమాన్యపు లక్ష్యాలను సాధించుకోవడం సులభమౌతుంది.

బాలకార్మికుల తల్లిదండ్రుల అభిప్రాయాలను గమనిస్తే, వారికి వచ్చే తక్కువ వేతనాల కారణంగా చిట్టిచేతుల చిన్నారులు కుటుంబానికి ఆర్థికంగా మద్దతునివ్వాలని కోరుకుంటున్నారు. బాలలకొచ్చే ఆదాయంతో కలసి కుటుంబం అంతా మెరుగైన జీవనం సాగించవచ్చు అన్న ఆలోచనలో ఉంటున్నారు.

తల్లిదండ్రుల నిరక్షరాస్యత కారణంగా కూడా వారు తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దలేకపోతున్నారు. పేదరికం వలన బాలకార్మిక వ్యవస్థ, బాలకార్మిక వ్యవస్థ వలన నిరక్షరాస్యత, నిరక్షరాస్యత వలన పేదరికం ఇలా ఒకదాని ఆధారంగా మరొకటి విషవలయంగా పెరుగుతున్నది.

బాలకార్మిక వ్యవస్థ జాతిని సవాలు చేస్తున్న ప్రధాన సమస్య. మన సమాజంలో నేటికి బాలకార్మిక వ్యవస్థ కొనసాగడం దురదృష్టకరం. ఇది సామాజిక-ఆర్థిక వ్యవస్థలతో ముడిపడి ఉంది. దారిద్ర్యం, నిరక్షరాస్యత కొనసాగుతున్నంత వరకు బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడం అసాధ్యం. 1989 వ సంవత్సరంలోని బాలల హక్కుల కన్వెన్షన్ ప్రకారం 18 సంవత్సరాల లోపు వ్యక్తులందరిని బాలలుగా పరిగణించడం జరుగుతుంది. కాని నేడు బాలలు వారి ఆనందమైన, తీపి జ్ఞాపకాలను కల్గియున్న బాల్యాన్ని అనుభవించక ముందే వారి సంపూర్ణమైన బాల్యాన్ని వివిధ రంగాలలో మింగివేయడం జరుగుతుంది.

**తల్లిదండ్రులు తమ జీవనం కోసం పిల్లల జీవితాన్ని పణంగా పెట్టకపోవడం, తల్లిదండ్రులు పిల్లల ద్వారా పొందే స్వల్ప ఆదాయాన్ని ఆశించకుండా ఉండాలి. ప్రభుత్వం రూపొందించే చట్టాలను, విధానాలను ప్రజలు గౌరవించి ప్రోత్సహించాలి. సమాజం చైతన్యవంతమై బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలి.**

మన రాజ్యాంగంలోని 45 అధికరణం 14 సంవత్సరాలలోపు బాల బాలికలకు సార్వత్రిక నిర్బంధ ఉచిత విద్యావకాశాలు కల్పించింది. రాజ్యాంగంలోని 24 వ అధికరణం 14 సంవత్సరాల లోపు బాల బాలికలను కర్మాగారాలు, గనులు లాంటి ప్రమాదరకరమైన ప్రదేశాలలో కార్మికులుగా నియమించరాదని పేర్కొంది. 86వ రాజ్యాంగ సవరణ ప్రకారం 6-14 సంవత్సరాలలోపు బాలల నిర్బంధ ప్రాథమిక విద్యను '21(ఎ) అధికరణం ప్రకారం 'ప్రాథమిక హక్కు'గా మార్చడం జరిగినది. ముఖ్యంగా బాలకార్మికులు అక్షరజ్ఞానంతో పాటు సాంకేతికంగా ఆయా వృత్తులలో నైపుణ్యం పొందేలా చూడాలి. బాలకార్మికుల చట్టాలను ఉల్లంఘించే యజమానులకు శిక్షించే యంత్రాంగం పటిష్టంగా వుండాలి. రాజకీయ పక్షాలు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు శక్తిమేర కృషి చేయాలి.

సమాజ నిర్మాణానికి పునాది బాలలు. ఈ 21వ శతాబ్దంలోనైనా బాలలకు బంగారు భవిష్యత్తు నిస్తుందని ఆశిద్దాం.

- డాక్టర్ ఎస్.సి. నారాయణ, జూనియర్ ఫాకల్టీ,
సెంటర్ ఫర్ నేచురల్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్,
ఎఎమ్ఆర్-అపార్డ్
అనువాదం: టి.నర్మద

# భవిష్యత్ చిత్రపటం

◆ అట్టాడ అప్పల్నాయుడు

**ఊరికి వెలుపలి కొంత దూరంలో – యేనాటిదో మామిడితోట, పోయిన ఆభరణంలా! ఊరి నుంచి తోటకు నడిచే దోవ – ఆకులూ, అలములతోనూ, దుమ్మూ ధూళితోనూ, చనిపోయిన పాము కళేబరంలా! ఆకులలముల్ని, కంపపుల్లల్నీ, చేతికర్రతో తొలగిస్తూ, ముందు నడుస్తున్నాడు జోగయ్య. అతని వెనుక అవనీ, ఆమె తమ్ముడు విశ్వం! ఉదయపు ఎండ కళ్లమీద పడ్తోంది.**

"...తోటకు దోవలేదా?"

"...ఒకప్పుడుండదేమ్మా..."

"...అది తెలుస్తూనే వుంది, గాని యిపుడెందుకు లేదు...?" కాస్త విసుగ్గా ప్రశ్నించేడు, విశ్వం.

దోవతీస్తూ నడిచే జోగయ్య ఆగి, వెనుదిరిగి, అక్కాతమ్ముళ్ల వేపు, శ్రోతలు దొరికిన ఉపన్యాసకుడిలా, తృప్తిగా చూస్తూ–

"...బాబూ, యిపుడేటంటే, నడవడానికీ, బతకడానికీ కనిపించే రకరకాల దోవలు శాశ్వితాలు కావు బాబూ, అశాశ్వితాలు. తాత్కాలికాలు! మరణానికి వొక్కదానికే, దోవ శాశ్వితం..." అని, క్షణకాలం మాత్రమే, ఆగి, శ్రోతల్ని పరిశీలించి–

"...నేను – మీలాగా నగరాల్లంటూ, దేశాల్లంటూ తిరగలేదని, నానా భాషల్లోని నానా గ్రంధాలూ సదవలేదనీ, అందుసేత నాకేటీ తెలవదని మీరు అనుకుంటే, అనుకోవచ్చు. నగరాలోను, నానా భాషల గ్రంధాల్లోను గ్యేనం ఉంది తప్పా, మరొక్కాడ లేదనీ మీరంటే అనుకోవచ్చు. గాని, అది తప్పో, వొప్పో నేను విడమరచను, మీ యింగితానికి వొదిలేస్తాను..." అని, ఆపేడు.

శ్రోతలు, మొహాలు తుడుచుకున్నారు. అవని ముందుగా తేరుకొని, జోగయ్య వేపు చూస్తూ –



"...ఛఛా, మేమలా అనుకోం. అసలు, మా మమ్మీ - నీ గురించి ముందే చెప్పింది, జోగయ్యకు యెన్నో తెలుసుననీ, అతని వెనకాల కళ్లుమూసుకొని వెళ్లండని మమ్మీ మరీ మరీ చెప్పింది..." అనంది.

ఈసారి ఉపన్యాసకుడు గతుక్కుమన్నాడు. వీళ్లెవరు? వీళ్ల మమ్మీ యెవరు? ఆ మమ్మీకి - నా గురించి యెలా తెలుసు? శ్రోతల లోతులు తెలీకుండా, యేవో వాగేసాను? అంతరంగం పీకుతుంటే, మళ్ల ముందుకు అడుగువేస్తూ

"...అహాఁ, అది కాదమ్మా నలుగురు నడిస్తే - నలుగుతాది, దోవ అవుతాది. ఇపుడీ తోట వేపు యెవురూ నడవరు. ఒక్క ఆ మానవుడే అపుడపుడూ తోట నించి యిటువేపొచ్చి, మళ్లీ యెళిపోతుంటాడు. ఎప్పుడో మీలాంటోళ్లు, ఆ మానవుడి కోసం వొస్తంటారు..." అని, చెప్పేడు. కంటికి కనిపిస్తోన్న ఆశ్రమాన్ని చూపిస్తూ, వొచ్చేసేం, రండి రండని నడక వేగం పెంచి-

"...అతగాను బొమ్మలు గీసినోడిలాగ అగుపడడు. దిస్టి బొమ్మలు గీయగల్డేటో...?" అనన్నాడు.

అక్కా తమ్ముళ్లు - జోగయ్య మాటల్ని పట్టించుకోలేదు. నడక వేగం పెంచి, ఆశ్రమాన్ని సమీపించేరు. విశాలమైన ఆశ్రమం పెద్ద హాలు. అందులోంచి తూర్పువేపు రెండు గదులు. వాటికి యెదురుగా మధ్యలోంచి వొక ద్వారం, మరో గదికి దారి తీస్తుంది. దర్భగడ్డి పైకప్పు. వెదురు వాసాలు, మట్టిగోడలు, జేగురు రంగుతో అలికి, అక్కడక్కడా తెల్లగా సున్నపు రాతిపిండితో వేసిన ముగ్గులు. చల్లగా, హాయిగా!

"...లోపలెక్కడో వున్నట్టుగుంది మానవుడు..." లోనకి చూస్తూ జోగయ్య. అక్కాతమ్ముళ్లు - హాలులోని చిత్రపటాలను చూడసాగేరు. పర్వతాలూ, అరణ్యాలూ, పచ్చిక బయల్లూ, పంటభూములూ, నదులూ, పల్లెలు, పట్నాలు, నగరాలూ - మనుషులూ, జంతుజాలాలూ, పశుపక్షాదులూ, ఎండా, వానా, వెలుగూ చీకటి - సమస్త ప్రకృతీ రకరకాల చిత్రాలుగా వొదిగిపోయింది!

అక్కాతమ్ముడూ - మైమరచి చూస్తున్నారు. జోగయ్య, నాలుక కరుచుకొని - హన్నా! మానవుడు సిన్న సిన్నింటోడు కాదు - అనుకున్నాడు!

అప్పుడే, లోనుంచి, చిత్రకారుడొచ్చేడు. అసంకల్పితంగానే, జోగయ్య, ఆ మానవుడికి దండం పెట్టి, అక్కాతమ్ముళ్లిద్దరికీ, చిత్రకారుణ్ణి పరిచయం చేసాడు. పరిచయాలూ, పలకరింపులూ, అయ్యేక, అవని-తాము యెందుకోసం వొచ్చిందో చెప్తూ, తన హ్యాండ్ బ్యేగులోంచి, వొక ఫోటోను తీసి, చిత్రకారునికి యిస్తూ-

"...యితను, మీకు తెలిసుండొచ్చు..." అంది.

చిత్రకారుడు-ఫోటోను చూసి, గుర్తుకుతెచ్చుకొని-

"...యితను, అతనే కదా? అతడి గురించి వినేవాడ్ని. అతను చనిపోయిన దృశ్యాన్ని టీ.వీ.లో చూసేను" అన్నాడు.

"...చనిపోయిన కాదు, అతన్ని చంపుతున్న దృశ్యం అనండి..." సవరణ చెప్పేడు, విశ్వం. కంఠస్వరం గూడా పెంచి.

చిత్రకారుడు, విశ్వం వేపు చూసేడు. ఆ ఫోటోలోని వ్యక్తి పోలికలు కొన్ని విశ్వంలో కన్పించేయి.

విశ్వంలాగే, ఆ ఫోటో చూసినపుడల్లా, అతని గురించి మాటాడుకున్నపుడల్లా, ఉద్వేగానికి గురయి, గుండెల్లో రక్తం దుముకువేస్తుంది, అతనికి. ప్రయత్న పూర్వకంగా, నిభాయించుకొని-

"...నిలువెత్తు చిత్రపటం కావాలి. మళ్లీ, ఆ మహామనిషి సజీవంగా నిల్చున్నట్టుండాలి. పదిరోజుల్లో, అతని సంస్మరణ సభ జరుపుతాం. అప్పటికి కావాలి..." వేడుకోలుగా పలికింది.

చిత్రకారుడు, కాసేపు మౌనం దాల్చేడు. ఆయన యిటీవల చిత్రాలు వెయ్యటం లేదు. అంతకుముందయినా - తన హృదయంలో చలనం కలిగితేనే - చిత్రరచన చేసాడు. ఏదో యెరుకను తెలియజెయ్యడానికే, చిత్రాలు వేసేడు. ఇపుడేదీ యెరుక గావటం లేదు, గనక చిత్రాలు వెయ్యటం లేదంటాడు.

కళ్లుమూసి, దీర్ఘంగా ఆలోచించి, వొక నిర్ణయానికొస్తూ-

"...వేస్తాను. గానీ, యీ ఫోటో అఖర్లేదు..." అనన్నాడు.

అక్కా తముళ్లు, ముఖాలు చూసుకున్నారు.

"...బొమ్మ వెయ్యాల్సినోడికి ఫొటో గావాల గానే, దిస్టి బొమ్మవేసేవోడికి, ఫొటో యేల?" అనుకున్నాడు జోగయ్య మనసులో.

"...అతనెవరు? అతని ముక్కూ, కళ్లూ, కాళ్లూ, శరీరమా అతనంటే? అతని రూపురేఖలా? లేదా, అతని జీవితం, ధీరత్వం, త్యాగం, మనసుపొరల్లోని అలోచనలూ, అనుభూతులూ, అనుభవాలా? ఏవి...?" అని ప్రశ్నించేడు చిత్రకారుడు.

ఆ ప్రశ్నతో, అక్కాతమ్ముళ్లు - ఔనుగదా, అనుకున్నారు.

"రూపు రేఖలు మాత్రమే చిత్ర లేఖనం కాదు, లోలోపలివి ఆవిష్కరణ గావాలి..." అనన్నాడు చిత్రకారుడు.

అప్పుడు, మళ్లీ, తాను యింతకు ముందర చూసిన హాలులోని చిత్రాలన్నిటివేసూ చూసింది. చిత్రకారుని మాటల్తో, మొదట చూసినపుడేదో మిస్సయినట్లన్పించి, అలా చూసింది. ఔను, ఆ చిత్రాల్లో, ప్రకృతి, జీవరాశి-రూపు రేఖల వలన గాక, మరింకెందువలననో వ్యక్తీకరింపబడి నాయి. చేతులు జోడించింది అవని.

చిత్రకారుడు, ఫొటో తిరిగియిచ్చేస్తూ, అతని వివరాలు కావాలి, అనన్నాడు, యేవి చెప్పాలో, యేవి వొదిలెయ్యాలో, నిజానికి, తనకెంత తెలుసు అనుకుంది అవని. ఎప్పట్నించీ తెలుసు? విని తెలుసుకున్న వెన్ని? చూసి, తెలుసుకున్నవెన్ని? లోకులు చెప్పిన వేవి?

"...లోకులు చెప్పిన వాటిని, నేను, గుడ్డిగా విని, నమ్మను..." అవని

ఆలోచనల్ని పసిగట్టినట్టు పలికేడు, చిత్ర కారుడు.

''...లోకనాథం పెద్దమనిషి. అతగానితో వైరమెద్దన్నాను. ప్రతాపనాయుడు, విన్నాడు కాదు...'' వో సందర్భంలో, తన తండ్రి అన్నమాట గుర్తొచ్చింది అవనికి. తండ్రి గూడా – లోకుల్లోని వాడేనా...?

ఎన్నాళ్ల కిందటిదో, వొక దృశ్యం గుర్తొచ్చింది అవనికి. హైస్కూల్లో చదివే రోజులు అవి – చెప్పుకొచ్చింది.

ఈ రోజు సాయంత్రం, వేమ స్కూలు నుండి యింటికి తిరిగొచ్చేసరికి, ప్రతాపనాయుడు, తన కూతుర్ని, కొడుకునీ మా అమ్మకప్పజెప్తూ – అత్తా, యీళ్లని నీ చేతుల్లో పెడ్తన్నాను. మీ పిల్లల్తోపాటు పెంచి, పెద్దచెయ్యాల – అని చెప్పి, తిరుగు ప్రయాణమయ్యేడు. పిల్లలిద్దరూ – ఎలిమెంటరీ స్థాయి. మా అమ్మ యెంతో ఆనందంగా వొప్పుకుంది. అటువంటి ప్రత్యుపకారమేదో చేస్తేగాని, అతని రుణం తీర్చుకోలేనన్న భావం, మా అమ్మలో వుండేదేమో! ప్రతాపనాయుడు, గరికపాలెం తిరిగి వెళిపోయేడు, పిల్లల్ని వొదిలేసి.

గరికపాలెం – మా అమ్మ కన్నవారి ఊరు. గంటేడ ముత్యాల నాయుడికి ముగ్గురు కొడుకులు. ఆడపిల్ల – లక్ష్మీదేవి అంటారు, ఒక్క ఆడపిల్ల పుట్టినా బాగుణ్ణు అని అనుకునేవాడు ముత్యాల నాయుడు. చాన్నాళ్ల తర్వాత, పెద్ద కొడుకు పెళ్లి రోజు నాడు – ఆడ బిడ్డ పుట్టింది! ఆవిడే, మా అమ్మ.

''...నేను పుట్టిన రెండేళ్లకి, ప్రతాపనాయుడు పుట్టేడు, అదిగో ఆగదిలోనే... ఆ మంచమ్మీదనే, అది 'పురిటిగది', అని, వోసారి మా అమ్మ, మా తాతగారింట, ఆ గదిని చూపించింది...

**అప్పట్లో, యిన్ని బస్సులూ, రైళ్లూ లేవు. దూరాబారాలయితే, రైలు ప్రయాణం! రమారమి దూరాలయితే, యెవురో బస్సు లెక్కేవోళ్లు గానీ, అంతోయింతో పూటున్న రైతులు, స్వంత ఎడ్లబండ్ల మీదనే ప్రయాణాలు సాగించేవారు.**

అవని చెప్తూ ఆగి, ఊపిరి పీల్చుకొని, మళ్లీ, ఆ సాయంత్రపు దృశ్యాన్ని కొనసాగించింది.

ఆ సాయంత్రం ప్రతాపనాయుడు వెళిపోయాక, పిల్లలందరమూ అవీ యివీ కబుర్లు చెప్పుకున్నాం. కాసేపు చదువుకున్నాం. రాత్రి భోజనాలు అయ్యేక, మా అందరికీ వొక దగ్గర పడకలు వేసి, మాతో ముచ్చట్లాడ్తూ మా అమ్మ, తన బాల్యంలో జరిగిన వొకానొక ఘటనను, వణికిపోతూ చెప్పుకొచ్చింది.

ఆ రోజుల్లో, రైతుకుటుంబాలు కొన్ని – శివరాత్రి రోజుల్లో తీర్థయాత్రలు చేసేవి. గరికపాలెంలో ముత్యాల నాయుడు యేటా కుటుంబంతో యాత్రలకెళ్లేవాడు. ముత్యాల నాయుడు చనిపోయేక, కొడుకులు కొనసాగించేరు. ఒక యేడాది శ్రీకూర్మ, మరో యేడాది శ్రీ ముఖలింగం, యింకో యేడాది మహేంద్రగిరి – యిలా యాత్రలు!

అప్పట్లో, యిన్ని బస్సులూ, రైళ్లూ లేవు. దూరాబారాలయితే, రైలు ప్రయాణం! రమారమి దూరాలయితే, యెవురో బస్సు లెక్కేవోళ్లు గానీ, అంతోయింతో పూటున్న రైతులు, స్వంత ఎడ్లబండ్ల మీదనే ప్రయాణాలు సాగించేవారు.

బండ్లను కూడా – ప్రయాణాలకు అనువుగా తీర్చిదిద్దేవారు. బండి మీద వెదురు తడకతో గూడు కట్టేవారు, ఎండా వానలను అడ్డడానికి! బండి లోపల – గడ్డి కూరిన గోనె పట్టాన్ని పరుపులా వేసేవారు. బండి పత్రాము కింద వొక గోనెసంచీ పెద్దది వేలాడదీసేవారు, దాంట్లో బట్టలూ, భత్యపు సామాన్లూ వుంచేవారు. మరికొంత ముందుగా నుండే బండి మొగకు కిందున– హరికెన్ లాంతరు , రాత్రిపూట వెలుగు కోసం! ఇక, బండి ఎడ్లో..? మైసూరెద్దులు! మెడలో గంటలు మువ్వలు! ఎడ్ల గిట్టల సవ్వడి, మువ్వల సవ్వడి, మెల్లగా ఊగేట్లుండే బండిలో ప్రయాణం పసందుగా వుండేది.

యాత్ర రోజులకు సరిపడా బత్తెం వుండేది గదా, యాత్రా స్థలానికి వెళ్లేక, అక్కడ నదిలో స్నానాలు జేసి, దైవదర్శనం జేసి తిరిగొచ్చి – ఆ నది ఒడ్డున యిసుక పర్ర మీద, మూడురాళ్లతో పొయ్యి జసి, కర్రా కంపా యేరి తెచ్చి, పొయ్యి అంటించి, వంటా, వార్పూ, భోజనాలు! సాధువులకూ, బిచ్చగాళ్లకూ అన్నదానాలు! ఆ తర్వాత యాత్రా స్థలమంతా తిరిగి చూడటం, దేవుడి బొమ్మల పటాలు, ప్రసాదాలు, సెనగలు, కర్జూరాలు, కుంకుమ, పూసలు, గాజులు యిలాగ ఏవేవో కొనుక్కోవటాలు! తీసుకెళ్లిన డబ్బూ ధస్కం, బత్తెపు గింజలూ ఖర్చుజేసి, సరదాగా కాలం గడపడం, పంటలూ, పశువులూ, పనీపాట్లూ, బతుకు యాతనలూ మరిచిపోయే తీర్థయాత్రలవి!

ముగ్గురు అన్నదమ్ముల కుటుంబాలూ, మూడు బళ్లతో శ్రీముఖలింగం చేరుకున్నవి. ముఖలింగేశ్వర ఆలయం – మట్టిరంగు రాతి నిర్మాణం. ఒడియాబ్రాహ్మలు పూజార్లు. ఓంఢ్ర రాజ్యపు ఆనవాళ్లుగా – ఆలయం! ఊరంతా, యిరుకు వీధులు. ఊరిబయట వంశధార నది, తరతరాల పురాతన జీవధారలా! పూజా పునస్కారాలు పూర్తి అయినాక, మధ్యాహ్న భోజనాలు జేసి బయల్దేరేరు. మరుసటి రోజు మహాశివరాత్రి. ఆ రోజుకి – నాగావళీ, సువర్ణముఖీ నదులు కలిసే తీర్థప్రాంతం ''సంగం'' చేరుకోవాలనీ, అక్కడి నించి, తిరుగు ప్రయాణం అనుకున్నారు.

ముగ్గురన్నదమ్ముల బళ్లూ, కదిలేయి. ముందర పెద్దవాడి బండి! మా అమ్మ వుందట, ప్రతాపనాయుడితో పాటూ, ముందర బండిలో.

అవని కాసేపు ఆ దృశ్యాన్నంతట్నీ తల్చుకొని, ఆ తర్వాత యేం జరిగిందో, వాళ్ల అమ్మ మాటల్లో చెప్పసాగింది.

"...ముందర బండిలో, పెద్దవదినా, ప్రతాపనాయుడూ, వెనకబళ్లల్లో చిన్నన్నలూ, వాళ్ల కుటుంబాలూ. శ్రీ ముఖలింగం నుంచి బయల్దేరి చీకటిపడే వేళకి ఆమదాలవలస చేరేం. కొంతసేపు ఆగితే, ఎడ్లకీ అలసట తీరుతాదని, మనకీ నిద్ర తీరుతుందనీ చిన్నన్నయ్య అన్నాడు. ఎవరో వైశ్యుని సత్రం వుంటే, అక్కడాగి, వంటా వార్పూ చేసి, తిని నిద్రపోయేం...... కాసేపటికి, చుక్క పొడిసింది లెగండి, లెగండన్నాడు పెద్దన్నయ్య."

మళ్లీ బళ్లు కదిలేయి చుక్క, యెక్కడ పొడిచిందో, యేటో, ఆమదాల వలస దాటిన తర్వాత అంతా చీకటే, చీకటి. ఆకాశం ఆర్పేసిన వంట పొయ్యి లాగ, నల్లగుంది.

ఎడ్లు – నెమరు వేసుకు నడుస్తున్నాయేమో, బళ్లు నెమ్మదిగా వెళ్తున్నాయి. ఎడ్ల మెడల్లోని మువ్వలూ, గంటల శబ్దం గూడా, చిన్నగా సత్తులోహాల చప్పుడులా విన్పిస్తోంది. అలాగలాగ, అందరికీ మళ్లీ నిద్ర కమ్మేసింది. బళ్లు తోలేవారూ నిద్రబోయేరు. తొలికోడి కూతకు– 'నవగాం' దాటినాయి బళ్లు. కాసేపటికి, మువ్వల చప్పుడాగింది. బళ్లు ఆగేయి. ఎడ్లు నిలబడి పోయేయి....

"...పెద్దన్నయ్యకి మెలకువ వొచ్చి ఎడ్లని అదిలించేడు. అవి కదలటం లేదు. చూస్తే, చీకటి. చుట్టూ అడవి. ఎడ్లు – చెవుల్ని రిక్కించి, ముక్కుపుటాలు బిగించి, బుసగొట్టి శ్వాసిస్తున్నాయి. ముందుకి అడుగెయ్యటం లేదు. జంతువేదో అలికిడైతే యిలాగే ఎడ్లు ఆగుతాయిగానీ, వెంటనే కాళ్లు దువ్వీ, తోకల్ని విసురుకుంటూ, మోరలెత్తి చూస్తాయి, మీదకి వెళ్తాయి గానీ యిలాగ నిలబడిపోవు! జంతువు కాదు, దొంగలు – అని ఊహించి, గభాల్న బండిలోని బాణాకర్ర తీసి – దొంగలర్రా, దొంగలు! దోవకాసేరు, తియ్యండి బాణాకర్రలని, తమ్ముళ్లకు కేకేసి, ముందుకు నడిచేడు. వెనక తమ్ముళ్లు నడిచేరు. ఏం జరుగుతోందో తెలీదు. నిద్రలేచిన ఆడవాళ్లూ, పిల్లలూ భయంతో బిక్కచచ్చిపోయి, అందరూ



ముందు బండిలోకి చేరేరు.

కేకలూ, అరుపులూ విన్పిస్తున్నాయి. ప్రతాపనాయుడు, వెళ్లబోతే అందరం ఆపేసాం. పెద్ద కొట్లాట జరిగింది. దొంగలకి బాగా దెబ్బలు తగిలేయి, గానీ యెక్కువ మంది వున్నారట. దెబ్బతిన్నవాళ్లు పారిపోతే, మిగిలిన వాళ్ళొస్తన్నారట. చిన్నన్నలిద్దరికి బాగా దెబ్బలు తగిలేయట, తలల మీద! పెద్దన్నయ్య మరేమి ఆలోచించాడో, వెనక్కి తిరిగొచ్చి; బండిలోని పువ్వుల కొరడా, యిదిగో వీళ్ల నాన్న చేతికిచ్చి – ప్రతాపనాయుడూ కొరడా ఝళిపించు. కుటుంబాన్ని భద్రంగా యింటికి చేర్చు. బతికితే వొచ్చి కలుస్తాం. లేదా, యీ కుటుంబాలకి నువ్వే దిక్కు అనన్నాడు. అంతే, వీళ్ల నాన్న కొరడా అందుకున్నాడు. ఎడ్లని అదిలించేడు. వాటికి గూడా, యేమి బోధపడిందో, నాలుగు కాళ్లూ యెత్తి పరుగెత్తేయి. అప్పటికి, వీళ్లనాన్నకి మన విశ్వం వయసుంటాది, ఆ చీకటీ, ఆ కొట్లాటా, అన్నయ్యల చావులూ! మా అమ్మ, దు:ఖంతో మాటాడలేకపోయింది.

"...అంటే? ఆ కుటుంబాలకు, ఆ బాలుడే పెద్దదిక్కు అయ్యేడా?" ఆశ్చర్యమూ, ఆవేదనా కలిసిన గొంతుతో, ప్రశ్నించేడు చిత్రకారుడు.

**"...పెద్దన్నయ్యకి మెలకువ వొచ్చి ఎడ్లని అదిలించేడు. అవి కదలటం లేదు. చూస్తే, చీకటి. చుట్టూ అడవి. ఎడ్లు – చెవుల్ని రిక్కించి, ముక్కుపుటాలు బిగించి, బుసగొట్టి శ్వాసిస్తున్నాయి. ముందుకి అడుగెయ్యటం లేదు."**

"...ఔను, అప్పుడు ఆ కుటుంబాలకూ, తర్వాత ఆ గ్రామానికీ ఆతనే దిక్కు అయ్యేడ"ని చెప్పేడు విశ్వం.

"...నన్నొకసారి, ఆ గ్రామానికి తీసుకెళ్తారా?" అడిగేడు చిత్రకారుడు.

❖ ❖ ❖

గరికపాలెం, ఓ మోస్తరు గ్రామం. రెండో, మూడో డాబా యిళ్లూ, మిగిలినవి పెంకుటిళ్లూ. విశాలమైన వీధులు. వీధి కూడళ్ల వద్ద పెద్దపెద్ద బోర్డులు! వాటి మీద – పంటల గురించిన విషయాలూ, రైతుల అనుభవాలూ; మార్కెట్ ధరవరలూ వగైరాలు, వూరి వారు యెవరో వొకరు రోజూ రాస్తుంటారు. ఊరి మధ్య వీధి కూడలిలో, వొక పెద్ద నల్లబోర్డు! అదే గోడపత్రిక. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ ముఖ్యవార్తలూ, వార్తా వ్యాఖ్యలూ రాస్తారు. తొలి రోజుల్లో ప్రతాప్‌నాయుడు రాసేవాడట. తర్వాత్తర్వాత ,ఊరి యువకులు దాన్ని కొనసాగిస్తున్నారట. ఒక్కోసారి, తెల్లవారే సరికి, ఊరిలో జరిగిన విశేషాంశం, గోడపత్రికలో వచ్చేదట, మంచికి అభినందనా, చెడుకి నిరసనా కన్పించేదట.

వీధులన్నీ కంకర రోడ్లేగానీ, పరిశుభ్రంగా వున్నాయి. ప్రభుత్వ చాలీచాలని నిధుల్ని, కొన్ని వీధుల్లో ఖర్చు జేసి కాంక్రీటు రోడ్డు వేసే బదులు, ఆ నిధుల్తో అన్ని వీధుల్లోనా కంకరరోడ్డు మంచిదన్నాడట ప్రతాప్‌నాయుడు. ఇంకా నిధులు మిగలగా– ఊరి నుండి పొలానికి పోయే దోవలన్నీ, కంకరపోసి, బాగుజేసారు.

ప్రధాన వీధిలో వొకచోట పంచాయితీ కార్యాలయం. అదీ, మూడు గదుల పెంకుటిల్లు. చుట్టూ వెదురు కంప ప్రహరీ. కార్యాలయం దాటి, ముందుకుపోతే వొచ్చే కూడలికి ఈశాన్యంగా విశాల మైదానం. అందులో ఒకప్రక్క గ్రామ దేవత గుడీ, యెదురుగా పెద్ద ఆడిటోరియం ఇది మాత్రం స్లేబు వేసిన బిల్డింగ్. గ్రామస్తులందరికీ, ఆడిటోరియం సాంస్కృతిక సంబరాల వేదిక. కూర్చునేందుకు వీలుగా సిమెంట్ బెంచీల వరుసలు! అక్కడే, గ్రామమొత్తానికి ఉమ్మడి టీ.వి. ఒకటి, పెద్ద సైజు తెరతో వుంది. దాంట్లో వార్తలూ, విజ్ఞాన విశేషాలు మాత్రమే చూస్తారట. రాత్రి పదిగంటలు దాటేక, ఆ టీ.వీ గూడా బందవుతుంది. ఊరి మొత్తమ్మీద రెండో, మూడో మోటారు సైకిళ్లు గానీ, ప్రతి యింటికీ రెండుకి తక్కువ లెకుండా సైకిళ్లున్నాయి. స్త్రీలు గూడా – సైకిళ్ల మీద, పాలకేన్లతో, కూరగాయల గంపల్తో, గడ్డిమోపుల్తో కన్పించేరు.

తెల్లవారు జాము ప్రభాత భేరీ మ్రోగుతుంది. ఊరు మేల్కొంటుంది. ఇల్లూ, వాకిలీ ఊడ్చే చీపుర్ల శబ్దాలు, కల్లాపినీళ్ల గలగలలు, మజ్జిగ చిలికే కవ్వం సవ్వడులూ, కోనేటికి నడిచే కడవలూ, కావిళ్లూ, పశుల దూడల అరుపులూ, పక్షుల కిలకిలలు, జంగం శంఖ నాదం, జమ్మలయ్య జనపద గీతాలాపన – మేల్కొన్న సకల ప్రకృతీ అనుభూతమయ్యింది, ఆ ఉషోదయాన, ఆ ఊరిలో!

ఊరి ముందరి కోనేరు – ఊరి హృదయంలా స్వచ్ఛంగా వుంది. కోనేటికి రెండు చోట్ల, మెట్లతో రేవులు, గట్టుమీద చుట్టూ పూల మొక్కలు! చిత్రకారుడు తన్మయంగా చూస్తుంటే –

" ...యీ కోనేటి గట్టు మీద పూలతోటలూ, ఆడోళ్లకి మగాళ్లకీ వేర్వేరు రేవులూ – ఒకే వొక్క రాత్రి సృష్టించేడు ప్రతాప్‌నాయుడు! ఊరిలోని, ఆడామాగా, ముసిలీముతగా, పిన్నా పెద్దలందర్నీ కదిపి, రాత్రంతా పనిజేయించి, తెల్లవారేసరికి పూర్తి చేసాడు. ఆ రాత్రి నేనూ శ్రమదానం చేసాను..." యేనాటి ముచ్చటనో గుర్తుకుతెచ్చుకు చెప్పాడో రైతు.

ఎక్కడెక్కడ ప్రతాప్‌నాయుడి ముద్రలున్నవో, వాళ్లు చెప్తుంటే ఆ గ్రామంలో ప్రతాప్‌నాయుడి ముద్ర పడని ప్రదేశమే లేదన్పించింది. ప్రదేశమే కాదు, హృదయం గూడా లేదన్నట్టుగా కోనేటి దోవలో వొక ముఖద్వారం, యిటివలే నిర్మించినట్టుంది! ముఖద్వారం మీద "ఆకాశాన్ని చూసి, అతణ్ణి చూడు! అతడు, మండే సూర్య 'ప్రతాపుడు' అన్న అక్షరాలు అందంగా చెక్కివున్నాయి.

కోనేరు దాటేక, విశాల ఆవరణలో పాఠశాల! పాఠశాలే గాదు, కళాశాల గూడా. ప్రాథమిక పాఠశాలగా ఆరంభమయి, ఇంటర్ మీడియట్ వరకూ విస్తరించి కళాశాల అయ్యింది. విడివిడిగా,యే తరగతికి ఆ తరగతి భవంతులు. ప్రభుత్వ ఆధీనమే గానీ, అజమాయిషీ గ్రామస్తులదే. ప్రభుత్వ ఉపాధ్యాయుల్తో పాటూ, ప్రజల విరాళాల్తో కొందరు విద్యా వలంటీర్లు గూడా వున్నారు. ప్రాథమిక విద్యకు ప్రభుత్వం ప్రకటించిన విద్యావేళలేగానీ; ప్రాథమిక స్థాయి దాటిన తర్వాత విద్యకు ఉదయం ఎనిమిది నుండి

రాత్రి ఎనిమిది దాకా తరగతులు నడుస్తాయి. ఏ వేళలో, యే సబ్జెక్టు బోధిస్తారో టైం టేబులుంటుంది. ఆ ప్రకారం, ఆ వేళకే, ఆ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులూ, నేర్చుకొనే విద్యార్థులూ వొస్తే చాలు! మిగిలిన వేళల్లో యే పనిపాటో చేసుకోవచ్చు. ఇంగ్లీషూ, హిందీ భాషలు గూడా మాతృభాష తర్వాత నేర్పుతారు!

విద్యాలయం దాటేక కొద్ది దూరంలో ఆసుపత్రి. అది దాటేక బజారు వీధి. అక్కడి నుండి ఊరిలోకి, వీధులు దారి తీస్తాయి. ప్రధాన వీధి గూండా పోతే, ఊరికొసన, పశువుల ఆసుపత్రి భవంతీ, దాని ప్రక్క విశాల ఆవరణలో పెద్ద పశువులశాల వుంది. గ్రామస్థుల ఉమ్మడి పశువులశాల అది. ఎవరికి కేటాయించిన స్థలంలో వారు తమ పశువుల్ని కడతారు. ఇతర గ్రామాల్లా యిళ్ల ముందరో, వెనకనో పశువులశాలల్లేవు యిక్కడ. ఆ పశులశాలకు యెదురుగా కమ్మరిశాల, కుమ్మరి ఆములూ, మేదరి బుట్టలఅల్లే పనివారూ, రకరకాల గ్రామీణ చేతివృత్తుల ఆవాసాలు కన్పించేయి.

మొత్తమ్మీద గ్రామమంతా ఒక ప్రణాళికతో నడుస్తున్నట్టుగా, వివిధ విశిష్టతల్తో, విపరీతంగా ఆకర్షించింది చిత్రకారుణ్ణి. పట్టణాలను అనుకరించే, పట్నపు మార్కెట్లకు వాకిళ్లుగా మారే గ్రామాలనే చూసేడుగానీ యిటువంటి గ్రామాన్ని చూడలేదాయన. ప్రతాపనాయుడు కోర్టుకేసు సందర్భంగా మీడియా ద్వారా కొన్ని విషయాలు తెలిసినా, యిన్ని విశిష్టతలు తెలీవు. ఈ గ్రామం, యిలా, యీ విశిష్టతలతో సజీవంగా నిలవాలని కోరుకున్నాడు మనసులో. అంతలో అందుకు మరెందరు బలిగావాలో గదా – ప్రతాపనాయుడ్ని తల్చుకొని నిట్టూర్చేడు!

గ్రామానికి మూడు దిక్కులా, మూడు పెద్ద చెరువులు. వాటికింద పల్లపు భూములు. ఉత్తరం వేపు మాత్రం మెట్టభూమి. మూడు దిక్కుల పల్లపు భూమికీ నీటివసతి చెరువుల్లోకి వచ్చిపడే కొండల జలధారలు. అక్కడక్కడా, బోర్లూ, నూతులూ గూడా కన్పించేయి.

"...ఔనూ, యీ గ్రామం యిక ముందు గూడా, యిలా జీవిస్తుందా?" అణచుకోలేని ప్రశ్న చిత్రకారుని నోటివెంట.

అవనీ, విశ్వం ఆ ప్రశ్నలోని లోతుల్ని ఆలోచిస్తున్నారు. వారితో పాటే వున్న ముగ్గురు నలుగురు వ్యక్తులు, అది ప్రశ్నే కాదన్నట్లు చూసి, అక్కడే వున్న, ఒక బోర్డు మీద "ప్రపంచం ఒక పద్మ వ్యూహం – వ్యవసాయం తీరనిదాహం" అని ఒకతను రాస్తే, అది చదివి, మరొక వ్యక్తి 'ప్రపంచం' అనే పదాన్ని చెరిపి, 'మార్కెట్' అని రాసేడు. మూడోవాడు, ఔనానన్నాడు.

"...యీగ్రేమమేటి? ఈ అయిదారు ఫిర్కాల్లో, యే గ్రేమం బతకాలన్నా, లోకనాథం బాబు అనుగ్రహముండాల! లేన్నాడు, ఊరు వల్లకాడయిపోద్ది..." అని చెప్పాలనుకుని, జంకిపోయేడు. ఊరుకోలేక – బావూ, ఊరు చూసేడ అయిపోయింది గదా, యిక యెళిపోదుమా అని చిత్రకారుణ్ణి అడిగేడు, జోగయ్య.

"...ఏది చూసీడిం అయిపోయింది? ఊరంటే, యిల్లూ, వాకిళ్లూ, వీధులేనా?" అని కసురుకున్నాడు చిత్రకారుడు. అందుకు జోగయ్య – "మనిసంటే, ముక్కూమొగమూ రూపురేకలే కావు అని చెప్పిన తవరు, ఊరంటే వీధులూ, యిల్లూ, వాకిళ్లని వొప్పుకుంతారా? వొప్పుకోరు చూసీయండి. యింకా చూసీయండి. మట్టీ మసేనం, అంతా చూసేసి, గీసీయండి బొమ్మలు..." అని, మనసులో గొణుగుకో సాగేడు.

జోగయ్య అనుకున్నట్టుగానే, చిత్రకారుడు ఊరి మీదుగా, పొలాల వేపు దారితీసేడు.

❖ ❖ ❖

గ్రామానికి మూడు దిక్కులా, మూడు పెద్ద చెరువులు. వాటికింద పల్లపు భూములు. ఉత్తరం వేపు మాత్రం మెట్టభూమి. మూడు దిక్కుల పల్లపు భూమికీ నీటివసతి చెరువుల్లోకి వచ్చిపడే కొండల జలధారలు. అక్కడక్కడా, బోర్లూ, నూతులూ గూడా కన్పించేయి.

అది జనవరి నెల మొదటివారపు దినాలు. పొలాల మధ్య అక్కడక్కడా కుప్పలు బోసిన వరివంట, సూర్యకాంతికి స్వర్ణరాశుల్లా కన్పిస్తున్నాయి. చిత్రకారుడు, ఓ పంట కుప్ప దగ్గరకు వెళ్లి, ఆ స్వర్ణరాశిని పరవశంగా చూసి, ఆ కుప్పలోంచి, ఓ ఎన్ను కంకిని లాగి, ముద్దాడి, తన సంచీలో భద్రంగా వుంచుకున్నాడు. పంటకుప్పలుగాక, మిగిలిన భూభాగమంతా, ఆకుపచ్చని పెసర, మినపమొక్కల్తో భూదేవి కట్టిన పచ్చకోకలా వుంది. ఆ అపరాల పంట అందిన తర్వాత, ధాళ్వా పంటకు సిద్ధంచేస్తారు. తూర్పువేపు పొలాల్లో వరిపంట మాత్రమే వేస్తారు.

పడమట దిక్కు పొలాల్లో – పత్తీ, మిరప, పొద్దుతిరుగుడు, పామాయిలూ వంటి వ్యాపార పంటలు. దక్షిణ దిక్కు పొలాల్లో, చెరకూ, అరటితోటలు! ఉత్తరం వేపు మెట్ట భూముల్లో – చోడి, ఉలవ, జొన్న, కంది వంటి పాతకాలపు ఆహారపంటలు పండిస్తారు. అక్కడక్కడా, మామిడి, సపోటా, జామ వగయిరా పండ్లతోటలు గూడా కన్పించేయి. అన్ని దిక్కుల భూములకూ – బళ్లూ, పశువులూ, వాహనాలూ, మనుషులూ తిరిగే వీలుగా దోవలున్నాయి. చెరువుల నుండి, పొలాలకు నీరుపారే ప్రధాన కాలువల వద్ద, బోర్డులున్నాయి. వాటి మీద, యెప్పటికప్పుడు, నీటి సరఫరా వివరాలు, సూచనలూ రాస్తుంటారు. ప్రతీ బోర్డుకీ, బోర్డరు మీద అందంగా "ప్రకృతి నుంచి నీకు కావాల్సినంత మేరకు తీసుకో. మళ్లీ, బదులుగా నువ్వు యివ్వగలిగింది యిచ్చుకో"– వంటి సూక్తులు రాసి వున్నాయి. ఔను గదా, ప్రకృతిని దోచుకుంటే, కొసకు నీకు శూన్యమే మిగులుతుంది గదా! చిత్రకారుడు – ఆ సూక్తులు గల వొక బోర్డుని, అక్షరమక్షరమూ చేత్తో తడిమి, తడిమి చదువుకున్నాడు మళ్లీ, మళ్లీ! ఆ



తర్వాత, అక్కడ నిలబడి చుట్టూ చూసేడు – కనుచూపు మేర భూమి యావత్తూ ఉపయుక్త ఉత్పత్తి కేంద్రంగా కన్పించింది.

"...కడుపుకి తిండి కోసం – ఆహార పంటలూ; యితర అవసరాలకు కావలసిన డబ్బుకోసం, వ్యాపార పంటలూ; జోడెద్దుల బండి నడిపినట్టుంది గ్రామం..." అనన్నాడు చిత్రకారుడు! అతని మాటలకు, అవనీ యేదో చెప్పబోయి ఆగింది. ఇంతలో, అక్కడికి గడ్డిమోపుతో వొచ్చిన యడ్ల పోతయ్య, ఆ మాటలు వినీ –

"...రెండు రకాల పంటల, బతుకుబండి కూలిపోయింది బావూ, కూలిపోయింది. మరియిక రెండు వుండవు! బతుకులు మళ్లా మొదలుకొస్తాయి..." అనన్నాడు. తల మీది గడ్డి మోపు భారంగా వుండి యడ్ల పోతయ్యకు.

అతనికి ఆ గడ్డి మోపు కంటే, భారమైన గతం, కదలాడింది మనసులో...

❖ ❖ ❖

"...వోయ్ ప్రతాపనాయుడో, జనుము జల్ల గూడదా, మెట్లమీద? సంక్రాంతి ముందర, జనప పంట అందతాది. సొమ్ము చేతికొస్తాది..." ప్రక్కగా మెట్టు భూమ్మిద, కంది విత్తనాలు జల్లుతోన్న ప్రతాపనాయుడ్ని అడిగేడు, యడ్ల పోతయ్య.

జనపనార పంట కొనుగోలు కోసం, పట్నంలో షాపులూ, గోదాలూ నిర్మించి, వ్యాపారానికొచ్చేరు మార్వాడీలు. జనప పంటకు మదుపులిచ్చి, రైతుల్ని ప్రోత్సహించేరు. పంటకు ధర గూడా బాగా పలికింది. సరిగ్గా, సంక్రాంతి ముందు పంట అందటం, అమ్మకమూ అవటం, చేతుల్లో రూపాయలు ఆడటంతో – పట్నంలో, సంక్రాంతికి సరుకులూ, కొత్తబట్టలూ కొని, వెనకా ముందూ చూడకుండా ఖర్చు చెయ్యనారంభించేరు రైతులు. ఒక్క ప్రతాపనాయుడే, జనుము పంటకు దిగలేదు. సంక్రాంతికి సందడి గూడా, యేముండేది గాదు. కుటుంబంలో, మగవాళ్లందరికీ వొకే తాను కొనేసి, కుట్టించే వాడు. ఆడవాళ్లకి, కొరసవాడ నేత చీరలు కొనేవాడు. ఇంట్లో పెంచిన కోడి పుంజుల్నే 'కనుమ నాడు కోయించేవాడు. చోడి అంబలి యెక్కువగా, వరిఅన్నం కొంచెంగా తినేవారు.

ప్రతాపనాయుదు, చిన్నగా నవ్వి, నాగేటిచాలులో కంది, విత్తులు జల్లసాగేడు. పోతయ్య తన పొలం నుండి, ప్రతాపనాయుడి దగ్గర కొచ్చి,

అతని చాలు వెంట నడుస్తూ –"...ఓయ్? పిల్లి అన్నతర్వాత, పాలుకోసరం పరిగెత్తాలవోయ్? యిదిగో, మార్వాడీలు, జనుము పంటని నేర్పినారా? అవతల, యెక్కడోళ్లోగాని చెరుకూ, పొగాకూ గోదాంలు కడతన్రు. రూపాయిలు–యిలాగ అడగ నోడిదే పాపం, చేతిల పోసెస్తన్రు. ఇపుడంతా, రూపాయిల తోటిదే గదా యవ్వారం? పరిగెత్తాలవోయ్..." అని బోధించేడు.

"...పరిగెడితే, పిల్లికి పాలు దొరుకుతాయిగాని, రైతోడికి నీళ్ళు దక్కవు. పట్నంలోని గోదాంని నమ్మి – నా యింటిలోని గాదె నింపడానికి పనికి రాని, పంట పండించను. నా గాదె నిండితే నాకు సాల్ను."

"...వోయ్ రూపాయిలు జల్లేసి, కొన్నామంతే – గాదె నిండడం బ్రెమ్మాండం కాదోయ్. సూడవా, మీ మందరం మరి గాదెలు నింపమా?"

"...నా గాదె నిండిన పంట పండించి, తరాత గోదాంల కోసరమూ పంటకి దిగతాను. జూదంకి దిగినావంతే – నస్టంకి తట్టుకోని నిలబడి, ఆడే శక్తి వుండాల! అప్పుడు, నేనూ ఆడతాను జూదం..."

❖ ❖ ❖

యడ్ల పోతయ్యకు, యెపుడు ప్రతాపనాయుడ్ని తలుచుకున్నా యిదే గుర్తొస్తుంది. ఆ తర్వాత, గుండె నిండా దుఃఖం నిండుతుంది. గత పదిరోజులుగా పోతయ్య, పొలాన పంట చేలతో, గారి వెంబడి పశువుల్తో, తానూ

"... ఔను. అది జూదమే. మేము వ్యవసాయమనుకున్నాం. పంట పంటకీ, రూపాయల గుత్తులు పండతన్నాయనుకున్నాం. పంటలు మార్చినాం. పట్నం మార్కెట్ – యెటు పరుగెత్త మంటే, అటు పరుగెత్తాం. గోగునార, పొగాకు పంటతోటి ఆరంభించి, చెరుకు, పామాయిల్, పత్తి లాంటి మార్కెట్ పంటల్నే నమ్ముకున్నాం. మార్కెటుకీ, పంట పొలాలకీ మధ్య రైతుకి యెరుకగాని వాణిజ్య మార్గం! అది పద్మ వ్యూహం!

హ..హ్..కాదు, కాదు, అది శకుని మాయాద్యూతం! శకునెవులు? బుల్లెటుగోడు గదా? ఆడిచేత, పాచికలు వేయించినోడు, కౌరవ రాజు యెవుడు? లోకనాథం గదా? ఔనౌను. మనకి తెలీదు ప్రతాపనాయుడికి తెల్సు. చెప్పేడు. మనము విన్లేదు! విన్నామా? ఔనౌను, విన్నాం! ఎప్పుడు? చేతులు కాలినతరాత..? ఇపుడో..? చేతులేటి? బతుకులే కాలిపోనాయి! దేవుడే కాపాడాల మనల్ని! నా మొకం..? ఇంకెక్కడి దేవుడు..? దేవుడే చచ్చిపోయేడు. చచ్చిపోయేడు. చంపేసేరు, దేవుడ్ని..."

నెత్తిమీద గడ్డిమోపు నేల బడేసి, కుమిలికుమిలి యేద్వసాగేడు పోతయ్య. ఆ రైతునెలా ఓదార్చాలో, చిత్ర కారుడికి బోధపడలేదు. సానుభూతితో చూడసాగేడు. దగ్గరగా వెళ్లి, అతని భుజాలను తట్టి, లేపబోయేడు! ఆ స్పర్శ, సరిగ్గా, ప్రతాపనాయుడి స్పర్శలా అన్పించిందా రైతుకి...

"...లెగలేను ప్రతాపనాయుడూ, లెగలేను. మొలబంటిలోతు బురదల కూరుకు పోనాను. కాళ్లు, నిలవకుంటన్నాయి, లాగేస్తన్నాయి. నన్నెవుళూ మీదకి లాగలేరు. మునిగిపోతున్నాను..." పలవరించేడు.

చిత్రకారుడు, విస్తుబోయేడు. ఆ రైతు, యింకా, గతంలోనే ఉన్నాడు. తనఖా తీసుకున్నాడు లోకనాథం. పోనీ, తీసుకోనీ! వొద్దన్ను! గాని, మిగిలిన భూమిల పంట పండించడానికి విత్తనాలూ మదుపూ యియ్యి బావూ, అని బతిమాలేను. ఇవ్వాలా? ఇవ్వననీసేడు. అయితే యెలాగ సావాల? పంటకి మదుపూలేక, యింటిల బత్తెమూ లేక – సావేగదా యికదారి? ఏటంతేనా? అనన్నాను. ఏమో...? అననీసేడు! అతగాను యియ్యడూ, మరొకడ్ని యియ్య నివ్వడూ! ఇంటిలోన వంటలేదు, పొలాన పంట లేదు..."

ఒక సాయంత్రపు ముసురు వేళ, పశుల సాలలో, దిగాలుగా యేడ్చే పోతయ్యను, ప్రతాపనాయుడు లేవనెత్తేడు. పంటకు విత్తనాల్నీ, యింటికి తిండి గింజల్నీ యిచ్చేడు. ఆ తర్వాత, పోతయ్య పాతబాకీని తీర్చేసి, పొలం తనఖా విడిపించేడు. అలా, ఆ తర్వాత ఆ యిద్దరూ, మరికొందర్ని అప్పుల ఊబిలోంచి, బయటికి లాగేరు.

> **నెత్తిమీద గడ్డిమోపు నేల బడేసి, కుమిలికుమిలి యేద్వసాగేడు పోతయ్య. ఆ రైతునెలా ఓదార్చాలో, చిత్ర కారుడికి బోధపడలేదు. సానుభూతితో చూడసాగేడు. దగ్గరగా వెళ్లి, అతని భుజాలను తట్టి, లేపబోయేడు! ఆ స్పర్శ, సరిగ్గా, ప్రతాపనాయుడి స్పర్శలా అన్పించిందా రైతుకి...**

ఊరిలో, మరొక్కరూ, ప్రతాపనాయుడి మార్గంలోకి మళ్లినారు. ఒకప్పుడు, కాసుల గలగలలకు ఆకర్షితులై, ఆడంబరాల కలవాటుపడి, అప్పులంటే భయం పోయి మార్కెట్ చుట్టూ తిరిగినవాళ్లు; యింటిల్లిపాదీ వొ౦కే తాను బట్ట కుట్టించుకుని, ధరించే ప్రతాపనాయుడి కుటుంబాన్ని 'తానుముతా' అని వెటకరించిన వాళ్లు, 'అంబలిదాకలు' నని యెగతాళి జేసినవాళ్లు – తిండికీ, బట్టకీ, కాసని పంటకీ యిరకాటం పడటంతో బుద్ధి తెచ్చుకున్నారేమో! ఆడంబరాల్ని దూరం చేసారు, ఆహారపంటలే పండించేరు, కుటుంబాలు కుటుంబాలు నాణ్యమైన తానుగుడ్డల వస్త్రాలే ధరించేరు. బతుకు బండి, దారిన పడింది!

యడ్ల పోతయ్య, దుఃఖంలోంచి తేరుకుని –

"....ప్రోనోట్ల మీద కోర్టులో కేసులు. పంటల మీద జప్తు నోటీసులు. బుల్లెటు

నాయుడుగాడు – మూడు బుర్రలోడు ఆడమన్నట్టల్లా ఆడి, అల్లకల్లోలం జేసేడు, రైతుల్ని...” చెప్తూ, ఆగేడు.

“బుల్లెట్ నాయుడెవరు? మూడు బుర్రలోడంటే..?” ప్రశ్నించేడు, చిత్రకారుడు. ఆ ప్రశ్నకు, ఫక్కున నవ్వింది, అవని. మారుపేర్లతో, మనుషుల స్వభావాన్ని నామకరణం చేస్తారు ప్రజలు. అంచేత, తల్చుకుంటే నవ్వొచ్చింది అతనికి. ఆమె, వెంటనే నవ్వుని చెరిపేసి, జవాబు చెప్పబోతుంటే, యడ్ల పోతయ్యే –

“...నాలుగు బుర్రలోడు, సృష్టికర్త బ్రెమ్మ. ఇంచుమించుగ, బ్రెమ్మకి సమానమైనోడు, లోకనాథం. రూపాయి నోట్లు సృష్టించినాడు. కొత్త పంటల యిత్తనాలు, ఆటికి ఎరువులు, మందులు సృష్టించినాడు. మార్కెటు సృష్టించినాడు. మనిసిని తప్ప – అన్నీట్నీ సృష్టించేను, అననేవోడు. అందికని, లోకనాథంకి, మూడు బుర్రలోడు అని మారు పేరెట్టేరు జనం! నాలుగో బుర్ర వుంటే బ్రెమ్మ అయిపోడా? మనిసినీ సృష్టించీడా...?” అని చెప్పి, పోతయ్య గూడా సన్నగా నవ్వేడు.

“... ఆ, లోకనాథంకి గ్రామంలో ఏజెంట్, గంటా నరుసునాయుడు. లోకనాథం ద్వారా అప్పులిప్పించటం, లోకనాథం యిచ్చే విత్తనాలూ, ఎరువులూ, మందులూ అమ్మటం నరుసునాయుడి పన్లు. ఒక యేడాది తర్వాత, కంపెనీ వాళ్లు ‘బుల్లెట్ మోటర్ సైకిల్ యిచ్చేరు. అప్పట్నించి, నర్సునాయుడు బుల్లెట్ నాయుడైనాడట...” చెప్పింది, అవని.

యడ్ల పోతయ్య మళ్లీ, యెక్కడ ఆపేడో; అక్కడ్నుంచి ఆరంభిస్తూ –

“...అప్పుల కోసరం పంటలూ; పంటల కోసరం అప్పులూ! ఏదీ మానుకోలేం! ఏది, యెందుకోసరమో, యెరుకగానీ మాయ యవహారమైంది. గాని బావూ, ఆ మాయ యెరుకయింతరాత, దాన్ని జెయించడానికి, యిన్నన్ని గొడవలూ, గోసలూ, యుద్ధాలూ జరగలేదు. గెలిచినా, వాడినా, మళ్లా పోరాడినాం. మీము యెలుగులోన పోరాడినాం, అవతలోళ్లు సికట్లోన దెబ్బగొట్టినారు. ఆ దెబ్బకి గిలిగిల్లాడిపోయా వోళ్లం...”

యడ్ల పోతయ్యకు, వొకనాటి ఘటన కదలాడింది. సంతలో ఆ రోజు, రైతులు తమ కూరగాయ పంటల్నీ, అపరాల్నీ, కొనడానికి యే వ్యాపారీ ముందుకు రావటం లేదు. ఎవరో, వొకరో, అరా వొచ్చినా, కిట్టుబాటు గాని ధరకు, బేరమాడుతున్నారు. పొద్దు మలిగే వేళ కాదోతోంది, సంత విరిగిపోతుందిక – అప్పుడు,

“...వోయ్, యిచ్చీవోయ్...”

‘...అప్పుల కోసరం పంటలూ; పంటల కోసరం అప్పులూ! ఏదీ మానుకోలేం! ఏది, యెందుకోసరమో, యెరుకగానీ మాయ యవహారమైంది. గాని బావూ, ఆ మాయ యెరుకయింతరాత, దాన్ని జెయించడానికి, యిన్నన్ని గొడవలూ, గోసలూ, యుద్ధాలూ జరగలేదు.”

“...తీసుకో...”

“...అంత ధర లేదు...”

“...కిట్టదు మరి...”

“...అయితే, వొట్టినే కుళ్ల బెట్టుకుంతావా?”

“...పందులూ, కోళ్లేనా తింతాయి...”

“...అయితివ్వవన్న మాట?”

“...యేటి కిట్టాలవోయ్? ఆ పంటకేటి బంగారం ఎరుపే స్సావా, వజ్రాల గుత్తులు కట్టేసావా? కిట్టకపోదానికి!”

“...సెవట సుక్కలు పోసినాం. కండల్ని కరగేసి, పెరిగించినాం. పోని ఆటికి సొమ్ము మధుపక్కర్లేదు, అవి మా శరీరంవి. గాని, ఎరువులో? పురుగు మందులో...? ఆటి సొమ్ముకేనా – కిట్టొద్దా?”

“... అయిత్వివన్న మాట?” అని, చివరిసారి అడిగేడా వ్యాపారి. యడ్ల పోతయ్య తల అడ్డంగా వుంచేడు. అప్పుడే అటుగా వచ్చిన ప్రతాపనాయుడు, ఆ వ్యాపార్ని సూటిగా –

“...అయితే, కొనవన్న మాట?” అని ప్రశ్నించేడు.

“...కిట్టుబాటయితే కొననా?”

“...ఎందుక్కాదు? నువ్వెంతకి కొన్నా, దాని మీద లాభమేసుకొనే గదా, అమ్ముతావు?”

“...ధరెక్కువయితే, కొనీవోళ్లుండొద్దా?”

“...అయితే, ధర నీ చేతిల వుండాలన్నమాట?”

“...పంట నీ చేతిలుంది గదేటి?”

“...అంచేత ధర నీ చేతిలో వుంచుతావన్న మాట?”

“...అవన్నీ యేల? నీకిష్టమైతే అమ్ము, కష్టమయితే, మానీయ్..”

“...అయితె కొనవన్నమాట?”

అప్పటికి పొద్దు మలిగిపోయింది. సంత విరిగిపోయింది. దుకాణాలు యెత్తేసారు. అందరూ తిరుగుముఖం పట్టన్నారు. పంటలు అమ్ముడుపోని రైతులే మిగిలినారు. టమాటా, వంగ, బెండ, చిక్కుడు వగైరా కూరగాయలు, చోలు, మినుములు, కందులు వగైరా దినుసులు! నిలువకు పనికొచ్చేవి – బళ్లకు యెత్తించేడు. నిలువకు పనికిరాని పంటల్ని ఆ సంతలోను గుప్పబోసి వొదిలెయ్యమన్నాడు.

పట్నం వ్యాపార్లు కలిసికట్టుగా, కూడ బలుక్కొని, సంతలో పంటల ధర మీద దెబ్బకొట్టేరు. ఇప్పుడు మనం, పట్నంమీద, ఆ వ్యాపారం మీద దెబ్బకొట్టాల. మనమే కాదు, చుట్టుపక్కల ఊళ్ల వాళ్లూ, యెంత యెక్కువ మంది కలిస్తే, అంత గట్టి దెబ్బ కొట్టగలం అన్నాడు

ప్రతాపనాయుడు. అందరూ, అతణ్ణి బలపర్చేరు.

ప్రతి రైతూ, తన దగ్గరున్న డబ్బూ, ధస్కం, వొంటి మీద వెండి, బంగారం తీసుకొచ్చి ప్రతాపనాయుడికి అప్పజెప్పేరు. ప్రతాపనాయుడు, అలా జమ చేసిన డబ్బుతో, వొక యేడాదికి సరిపడే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులూ; గృహావసర సరుకులూ కొనేసి, నిల్వ చేయించేడు. రైతులందరితో సొసైటీ ఏర్పరిచేడు. గ్రామంకి కావలసినవన్నీ నిలువజేసాక సంతల్ని బహిష్కరించేడు. పట్నానికి పాలూ, పెరుగూ, కూరగాయ, పంట దినుసు యేదీ వెళ్లకుండా నిలువరించేడు. మొదట తన గ్రామం, తర్వాత మరికొన్ని గ్రామాలు కలిసి నిలబడ్డాయి. సంతలు – పంట దినుసుల్లేక, జనాలు లేక, వెలవెలబోయేయి. పట్నం పాలూ, పెరుగూ, పంట దినుసులు అందక గిజగిజ లాడింది. ఎక్కడెక్కడికో పరుగెట్టి యెక్కువ ధర యిచ్చి కొనాల్సి వొచ్చింది. అయినా సరుకు కరువుతో అల్లాడింది పట్నం!

"...దెబ్బకి దిగొచ్చేరు పట్నం సావుకార్నా కొడకలు. పంటలు మన చేతుల్లా, ధరలు ఆళ్ల చేతుల్లా – అట? దెబ్బకిదెబ్బ తీసేమనుకోండి! అయినా, యేదో వొక పితలాటకం పెట్టేవోరు అవతవోళ్లు. గాని, ప్రతాపనాయుడు, సాగనిచ్చేవోడు కాదు.

నీళ్ల కాడ, కరెంటు కాడ, పంచాయితీ నిధులు కాడ– యేదో పితలాటకమెట్టేవోడు, బుల్లెట్ నాయుడు. నీళ్లూ, కరెంటూ తొలుత పంట పొలాలకీ, తర్వాతే గృహాలకీ అనేవాడు ప్రతాపనాయుడు. సారాకొట్ల మూసివేత, ఫైనాన్సు కంపెనీల తరిమివేత, స్కూలూ, రోడ్లు, యివన్నీ వొకరోజుల జరిగిపోలేదు. వొక గొడవతోటి సాగిపోలేదు. ఇక ముందూ, గొడవ లేకుండా, రోజులు యెళ్లవు! గెలిసినామా, వోడినామా అని లెక్కలెయ్యిడం గాదండీ – ధర్మమా, అధర్మమా అని యిచక్షణ సెయ్యండి. లోకమ్మీద ధర్మ దేవత, వొక్క కాలితోటి అయినా నడాల గానీ; అధర్మదేవత నడగూడదండీ, భూమికి భారం! భూమికి భారమయిన బతుకులు, యేం బతుకులండీ? త్ఫూత్..." అని, కాండ్రించి ఉమ్మి, నేలన పడేసిన గడ్డిమోపును, తల మీదకెత్తుకొని, విసవిసా నడిచేడు పోతయ్య..

"మార్కెట్ అన్న తర్వాత, లాభనష్టాలుంటాయి గదా?" చిత్రకారుడు ప్రశ్నించేడు. అవనీ, విశ్వం యేదో చెప్పబోయేరు అంతలో, వొక రైతు బదులు పలికేడు.

"...లాభానికి హద్దుంటాదా? వుండదా?"

"...సంప్రదాయ పంటలూ, పనిముట్లూ వీటితో మీరు అభివృద్ధి అయిపోగలం, అనుకోవడం చిత్రంగా వుంది.."

"..చోడి అంబలీ, వరన్నమే – పరమాన్న భోజనమనుకోం. నాగలే మాకు పరమ ప్రీతి పనిముట్టు అనుకోం. యంత్రాన్ని, మా చేతిలోని నాగలిలాగా, మా సాలలోని పశువులాగా అదుపు జేయగలిగిననాడు, అందుకుంటాం. వొదలం, దేన్నీ వొదలం! అలాగని, దేని కోసరమో వున్నది వొదులుకోం.." అనన్నాడు.

చిత్రకారుడికి ప్రశ్నలాగినయి. మనసులో చిత్రపటానికి వో రూపం కల్గింది. అప్పటికి పొద్దు గూడా వాలబోతోంది. అందరూ, ఊరు దారి బట్టేరు. అవని తల్లితో మాటాడితే బాగుణ్ణనిపించింది, చిత్రకారుడికి.

❖ ❖ ❖

వరహాలమ్మ, చాలాసేపు లోలోపల దు:ఖంతో కుమిలిపోయింది. భోరున యేడిస్తే దు:ఖం కొంత తగ్గేది, కానీ పరాయివ్యక్తి ముందు, అలా యేడ్వలేక పోయింది. అవని, తల్లి భుజాల్ని నొక్కింది సముదాయింపుగా. విశ్వం, దిగులుగా చూస్తున్నాడు. మధ్యాహ్న భోజనాలవీ చేసి, కాసేపు విశ్రమించి, సమాచారం కోసం సంభాషణకు కూర్చుండబెట్టేడు చిత్రకారుడు.

> "ప్రతి రైతూ, తన దగ్గరున్న డబ్బూ, ధస్కం, వొంటి మీద వెండి, బంగారం తీసుకొచ్చి ప్రతాపనాయుడుకి అప్పజెప్పేరు. ప్రతాపనాయుడు, అలా జమ చేసిన డబ్బుతో, వొక యేడాదికి సరిపడే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులూ; గృహావసర సరుకులూ కొనేసి, నిల్వ చేయించేడు."

మేనల్లుడు ప్రతాపనాయుడి జీవితం మొత్తం, వరహాలమ్మ మనసులో కలయదిరిగింది. బాల్యంలో, ఎర్రగొల్ల దొంగల దాడి నుండి, నిన్న మొన్నటి ఉరిశిక్ష వరకూ – యేటికి యెదురీదేడు. ఎప్పుడూ, యేదో కల్లోలమే. నిశ్చింతైన కాలం, క్షణమయినా లేదేమో వాడి బతుకులో నిట్టూర్చింది వరహాలమ్మ.

"...యిదంతా యేనికయ్యా? యేమవతోందయ్యా..?" అనాడు మునిమాపు సాయంకాలం వేళ, యిద్దరి పిల్లల్నీ అప్పజెప్పి, ప్రతాపనాయుడు బయల్దేరినపుడు, ప్రశ్నించింది.

ఊరిలో, యేదో ఘర్షణలు. పంటల గురించీ, మార్కెట్ గురించీ పంచాయితీ ఎన్నికల గురించీ కూడా. చాన్నాళ్లు ప్రతాపనాయుడు తన కుటుంబం గురించే తప్ప, పక్కవాడి గురించి పట్టించుకోలేదు. కుటుంబాన్ని పెంచిపోషించీ, చక్కదిద్దాక; తన కాళ్లు బలంగా నిలదొక్కుకున్నాక – పొరుగు వాడి గురించీ, ఊరి గురించీ నిలబడటం ఆరంభించేడు. అప్పుడు ఆరంభమయ్యిందా కల్లోలం?

"...వరాలత్తా, యిదంతా ముందు జాగ్రత్త కోసం. ఆపదల్ని పసిగట్టి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి, యెవరైనా. ఎర్రగొల్ల దొంగల ఆపద గురించి ఎరుకలేకనే, నా తండ్రి, పినతండ్రులు బలయిపోయేరు. అంత ఆపదలోనూ రేపటికోసం, నన్ను జాగ్రత్త పరిచేడు, నా తండ్రి. అది నాకొక పాఠం! చుట్టూ శత్రువులు. రోజూ ఘర్షణ. ఎప్పుడేమవుద్దో..? వీళ్ళు పెద్దయ్యే దాకా, నీదే రక్షణ బాధ్యత. పెద్దవాళ్లయ్యేక, వీళ్లే, నన్నూ, నీ ఊరినీ రక్షించాలి..." అనన్నాడు.

పిల్లలు అలాగే పెరిగేరు. అలానే తిరిగి, ఊరు వెళ్లేరు. ఊరికోసం నిలబడినారు. వార్ని చూసిగదా, అవనీ, విశ్వం ప్రభావితమయినారు. ఇంతకీ, ఆ పిల్లలు రాలేదేవి? వాళ్లు అజ్ఞాతంలో న్నున్నారట, నిజమా? ఇదంతా, యిన్నేళ్ల తర్వాత, యీ సంభవ ఘటనలను. అన్నేళ్ల కిందట, ముందుగానే యింత స్పష్టంగా ప్రతాపనాయుడు ఊహించాడా? ఆశ్చర్యపోయింది, వరహాలమ్మ.

అప్పుడు, దు:ఖంలోంచి తేరుకొని, యొక్కడో జీవితపు చివరి అంచు నుంచి ఆరంభించి, చెప్పసాగింది –

"...అతను, మా యింటికి రావడం, వొక పూటల్లా కబుర్లు కలిబోసుకోడం, అదే ఆఖరుసారి! ఆ తరాత, మరి రాలేదు. మేము యెళ్ల లేదు. మళ్లా, అతన్ని బతికుండగా చూడ్లేదు..." దు:ఖపు జీర గొంతుని పట్టింది. ఆగి, మళ్లీ ఆరంభించింది –

"...వొకరోజు, లోకనాథం మామ భార్య ఫోన్. తొలుత, సంబరాలకీ, శుభకార్యాలకీ రాకపోకలు సాగితే, అలాగ సఖ్యత పెరిగితే, ఆ తర్వాత మీ మధ్య కలహాలకి సోటుండదు. మీ దాయాదులు, గ్రామదేవత సంబరాలు చేస్తారట. మిమ్మల్నీ పిలుస్తారు. నువ్వు తప్పకుండా, రా. నేను గూడా వస్తాను, అనన్నాది. నాకేమీ బోధపడలేదు..." అని ఆగింది.

చిత్రకారుడికి గూడా, యేమిబోధపడలేదు. ప్రతాపనాయుడి గురించి గాక, దాయాదుల గురిండి ఆరంభించిందేవిటన్నట్టు, చూసేడు.

కిష్టం నాయుడూ, బలరాం నాయుడూ దాయాదులు. చాన్నాళ్ల కిందటే, వీరి ప్రమేయం లేకుండానే వైరం ఏర్పడింది. ఆస్తి పంపకాల దగ్గరో, పెద్దరికాల దగ్గరో, యింకేవో కారణాల వలననో యేర్పడ్డ విభేదాలతో కుటుంబాలు వేరుపడినాయి. బలరాంనాయుడి కుటుంబపు ముందటి తరంవారు, ఆ ఊరికి వాయువ్యంగా ప్రవహించే నది అవతలి ఒడ్డున నివాస మేర్పరుచుకున్నారు. అదొక గ్రామమయ్యింది, తర్వాత! రెండు గ్రామాల మధ్యగా ప్రవహించే నదిలా – ఆ కుటుంబాల మధ్య వైరం ప్రవహిస్తోంది.

తన తరం వచ్చేక, యీ వైరం సమసిపోతే బాగుణ్ణు అనుకునేవాడు కిష్టంనాయుడు. ఈ వైరం వల్ల పొలాలకు ప్రవహించే నీళ్ల వద్ద, రహదార్ల వద్ద, పంటచేల వద్ద ఘర్షణ, కొట్లాట, పంటల ధ్వంసం, రహదార్ల మూసివేత, కేసులూ, కోర్టులూ, ఖర్చులూ అందుకు అప్పులు చెయ్యాల్సిరావటం. ఆడవాళ్ల బంగారు ఆభరణాల సైతం తనఖాలు, భూముల తనఖాలు, పైకి తేలలేని ఊబిలోకి కూరుకుపోవటం..! నిట్టూర్చేడు కిష్టంనాయుడు.

ఎదుట పశుల సాలలోంచి, కోడెదూడలు వొకదాన్ని వెంటదోల్తూ మరొకటి పరుగుదీసేయి. కాలిగిట్టల శబ్దం, రేగిన దుమ్మూ, ధూళీ... విసుగ్గా చూసేడు కిష్టం నాయుడు.

"...భుజాల మీద బరువు వుంతేనే లొంగుతాయి. బరువు తీస్తామా, మన వల్లకాదు, కొయ్యకి కట్టలేం, వొక పట్టాన లొంగవు..." వాటి వెనక పరుగుతీస్తూ, సంజాయిషీగా పలికేడు, నరిసిగాడు.

కిష్టం నాయుడుకి, నరిసిగాడి మాటల్తో, ఆ కోడెగిత్తల్లా దాయాదుల భుజాల మీద గూడా బరువు వేస్తున్నవారు..? మరి, ఆలోచించలేక, తల విదిలించేడు.

సరిగ్గా, అప్పుడు మళ్లీ, వరహాలమ్మ ఆరంభించి –

"...లోకనాథం మామ భార్య అన్నట్టుగానే, గ్రామదేవత సంబరాలకి మా దాయాదులు ఆహ్వానించారు. నీనే యెళ్లేను. ఆప్యాయంగా ఆదరించినారు. ఆడోల్లం, వాకళ్లకొకళ్లం అల్లుకుపోయేం. మా మధ్య వైరం వుండిందంటే నమ్మలేరెవురూ – అంతగా కలిసిపోయేం.

అదిగో, అక్కడ్నించి తిరిగొచ్చేక, యిలాగే యిప్పుడ్లాగే, యీ గడపలే, కూచొని, అక్కడి విశేషాలు చెప్తున్నాను..." అని, ఆగింది, ఆనాటి దాయాదుల గ్రామ సంబరాల్ని, జ్ఞాపకం చేసుకుంటూ.

రామక్రిష్ణం నాయుడు, అందుకొని –

"...సంబరం సరదాల గురించి చెప్పి; అప్పులు జేసి ఆడంబరంగా సంబరాలు జేసేకంటే, అవసరం లేని నగానట్రా కొనడం కంటే, ఆ డబ్బుని పంటల మదుపుకోసమో, పశులకోసమో ఖర్చెడితే బాగుణ్ణు గదండీ; అందుకోసం మళ్లీ అప్పు చెయ్యాల్సిన అవసరం లేకపోయణ్ణు కదండీ, అని అంది నాతో; అప్పుడొచ్చేడు ప్రతాపనాయుడు.."

"...అప్పుడు కాదు, ముందే వొచ్చి వుంటాడు, మనమే చూడలేదు, నా మాటలన్నే విన్నాడు. నా కొసమాటకి, యేదో అన్నాడు. మీరేదో జవాబు చెప్పేరు. ఏటన్నాడపుడూ..."

క్రిష్టంనాయుడికి, నాటి దృశ్యం కదలాడింది.....

"...అప్పిచ్చిన వాడు, యెందుకోసమిస్తాడో, అందుకోసమే ఖర్చు పెట్టాలత్తా. ఒకందుకు అప్పుతెచ్చి, మరొకందుకు ఖర్చుపెడితే వొప్పుకోరు..."

"...ఎలాగయ్యా, మరైతే..?" ఆవేదనగా ప్రశ్నించింది వరహాలమ్మ.

"...అప్పు చెయ్యటం, మానెయ్యటమే..." ప్రతాపనాయుడు.

"నీకేంవోయ్, ఒడ్డెక్కేసావు. బాదరబందీల్లేవు. నువ్వు, వొకరికి చెయ్యి చాపనక్కర్లేదు. మా పరిస్థితి అలాగ లేదు.." కిష్టం నాయుడు.

"...నా కష్టాలు నాకూ వున్నాయి మామా! అయితే, నేనొక దారి యెంచుకున్నాను! మీరు మరొకదారి యెంచుకున్నారు. ఎవురి బాధలు ఆళ్లకున్నాయి.

అసలుకి మామా – యిపుడు నడుస్తోన్న లోకరీతి, మానవాళికి మేలు

**"...భుజాల మీద బరువు వుంతేనే లొంగుతాయి. బరువు తీస్తామా, మన వల్లకాదు, కొయ్యకి కట్టలేం, వొక పట్టాన లొంగవు..." వాటి వెనక పరుగుతీస్తూ, సంజాయిషీగా పలికేడు, నరిసిగాడు".**

చెయ్యదు. కీడు చేస్తుంది ఈ లోకరీతి కోసమా, యీ చట్టాలూ, శాసనాలూ, నీతీన్యాయాలూ, మతాలూ, చదువులూ..! ఛ..!"

అక్కడితో, కాసేపు యెవరూ మాటాడలేదు. భోజనం పెట్టమన్నాడు. భోంచేసి, కాసేపు విశ్రమించి, సాయంత్రం వేళ, తిరిగి బయలుదేరుతూ –

"...మామా, మీ 'కొరిమెరక' భూమిని, నాకు అమ్మకానికిగానీ, తనఖాకు గానీ యిస్తావా?" అనడిగేడు ప్రతాపనాయుడు.

"...అదెందుకువోయ్? పంటకి పనికిరాని తుప్పాడొంకల, ముళ్ల కంపల బంజరు భూమి?"

"...మాకు, ఊర్లోంచి బయటికి మార్కెట్‌కో, మరొక్కాడికో పంటలు తోలుకుపోయే, బంజరు భూమి వుండేదా? దాన్ని, యేవో కంపెనీలు కోసరం గవర్నమెంటు అదుపుజేసింది. ప్రక్కగా, మీ దాయాదుల మెరక భూమిని దోవగా వాడుకుంటన్నాం. వాళ్లు అడ్డుచెప్పలేదు. గానీ, ఆ మెరక భూమిని మీ దాయాదులు లోకనాధంకి అమ్మేసారు. అతను, దారి కింద మెరకభూమిని వొదల్దుగదా? వొదలమని, అడగటానికి నాకూ యిష్టం లేదు..."

"...లోకనాథం, యీ అయిదారు ఫిర్కాలకీ పెద్దమనిషి. అతన్ని కాదని వొక మార్కెట్‌గాని, వొక గవర్నమెంట్ గానీ, నడుచుకోదు. అతగానితో నీకు తగువేలవోయ్?"

"...నాకెందుకండీ అతగాన్తో తగువు? అతగానికే, అన్ని ఊళ్ల తగువులూ కావాలి, అన్ని ఊళ్ల వ్యాపారాలూ కావాలి, అన్ని ఊళ్లూ అతగాని చేతికింద వుండాల. అందరూ అతని కనుసన్నల్లో నడాల. నడిచీ వోళ్లకి మేలు యెంత జరిగిందో, కీడు యెంత జరిగిందో, మీరే ఆలోచించండి..." అనన్నాడు ప్రతాపనాయుడు.

ప్రతాపనాయుడి ఆఖరి మాటతో, అవాక్కయ్యేరు భార్యాభర్తలు. ఎన్నెన్నో జరిగిపోయిన ఘటనలు కొత్తగా అర్థమయ్యేయి. దాయాదుల తగవులు, కేసులు, అప్పులు, వడ్డీమాఫీలు, పండగజల్సాలు, అన్నీ ఆఖరికి, తమ తమ యిళ్లల్లో ఊళ్లల్లో జరిగే, అన్ని కార్యాలకూ లోకనాథం అనుజ్ఞ అవసరమవటం బోధపడింది.

దంపతులింకా తేరుకోలేదు. ప్రతాపనాయుడే –

"...మీరా మెరక భూమిస్తే, దోవకు పోగా, మిగిలిన దాంట్లో, వొక చక్కెర మిల్లు, రైతు సొసైటీ ఆధ్వర్యాన నడపదామనుకుంటున్నా..." నన్నాడు.

దంపతులిద్దరూ, ఆ భూమిని యివ్వడానికి అంగీకరించేరు. గానీ, అమ్మకమూ, కొనుగోలూ అనే వ్యవహారం తమ మధ్య కూడా జరగటం వారికి కిష్టం లేదు. ఉచితంగా, తీసుకోవటానికి ప్రతాపనాయుడు వొప్పుకోలేదు.

"...ఉచితంగా వొద్దు. పోనీ, అమ్మకం యిష్టం లేకపోతే, భూమికి బదులు భూమినిస్తాను, తీసుకోండి..." అనన్నాడు ప్రతాపనాయుడు.

అప్పుడు, తమ బంజరు భూమిలాంటిది, వ్యవసాయోపగ్యం కానటువంటి భూమి యేముంది, ప్రతాపనాయుడి వద్ద? ఏమీ కన్పడలేదు. సాగుభూమిని బదులు తీసుకోవడం న్యాయం కాదు. చాలాసేపు గింజుకున్నది, వరహాలమ్మ, అప్పుడు వొకటి గుర్తొచ్చింది.

అలనాడు మరణించిన తన తండ్రీ, పినతండ్రుల స్మృత్యర్థం వొక జ్ఞాపకగుండం నిర్మించేడు. దానికి చుట్టూ, విశాలంగా పచ్చని పచ్చిక బయలూ, దాని చుట్టూరా రకరకాల పండ్ల తోటలూ పెంచేడు. ఏటా ఆ విశాలమైన తోటలో కుటుంబమంతా నివాళులర్పిస్తారు. వరహాలమ్మ గూడా యేటా వెళ్లి, నివాళులర్పిస్తుంది.

ఆ స్థలాన్ని, బదులుగా తీసుకుంటే తన అన్నదమ్ముల స్మృతి కోసం తన భూమిని యిచ్చినట్టూ వుంటుంది, మేనల్లుడి అవసరమూ తీరినట్టు వుంటుందని భావించింది వరహాలమ్మ.

ప్రతాపనాయుడు ఆనందంగా అంగీకరించేడు. రాతకోతలు అనేవి జరగలేదు గానీ, ఆ విధంగా భూమి మార్పిడి జరిగింది.

**"...సంబరం సరదాల గురించి చెప్పి; అప్పులు జేసి ఆడంబరంగా సంబరాలు జేసేకంటే, అవసరం లేని నగానట్రా కొనడం కంటే, ఆ డబ్బుని పంటల మదుపుకోసమో, పశులకోసమో ఖర్చెడితే బాగుణ్ణు గదండీ;**

"...మేమయినా, అతనయినా, ఆ భూమిని చనిపోయినోళ్ల జ్ఞాపకార్థం వుంచుతాం గదా? అందుకే వొప్పుకున్నాడు. ఆనందంగా వెళిపోయేడు, గాని, అదే స్థలం మృత్యుదేవత అవతాదనుకోలేదు. మేము, భూమిచ్చేమో, మృత్యువిచ్చేమో...! ఆ పాపం, మాది గూడా..." అని, గొల్లున యేడ్చింది వరహాలమ్మ.

అవనీ, విశ్వం తల్లిని అనునయించ సాగేరు. కిష్టంనాయుడు కండువాతో కళ్లొత్తుకుంటూ, అక్కడ నుంచి లేచిపోయేడు. పొలాల్లోకీ, ఊర్లోకీ, తర్వాత వీధుల్లోకి ఆ తర్వాత యిళ్లల్లోకి మెల్లగా చీకటి అలముకొంది. సంభాషణ మరి కొనసాగలేదు.

❖ ❖ ❖

తన కోసం కేటాయించిన, భవంతికి తలారి జోగయ్య వెంటరాగా, నడిచేడు చిత్రకారుడు. అక్కడి నుండి, రెండు వీధుల అవతల వుందా భవంతి. భోజనాలవీ అయ్యేక బయల్దేరేరు గదా, వీధుల్లో – అలికిడిగా వుంది. సారాకొట్టు సందడీ, కలర్ టి.వీల గోలా, యెవరో కయ్యాలాడుకుంటున్న సంసారాలూ పశుల సాలల్లో సంసారాలూ, సంసారాలు, వుండాల్సిన చోట, ట్రాక్టర్లూ, కార్లూ, మోటార్లూ ఒక దగ్గర పేదరికం కుప్పబోసి వుంటే, ప్రక్కనే ధనస్వామ్యం మేటవేసి కన్పించింది.

ఈ ఊరికి, ప్రతాపనాయుడి గరికపాలేనికి, చాలా తేడా అనుకున్నాడు చిత్రకారుడు.

నడుస్తూ, గ్రామాన్ని పరిశీలిస్తూ, భవంతి చేరుకున్నాడే గానీ వరహాలమ్మ చివరి మాటలే, మనసులో మళ్లీ మళ్లీ విన్పిస్తున్నాయి. ఆ భూమి మృత్యుదేవత యోలా అయ్యింది? గవర్నమెంటు స్వాధీనం చేసుకోదలచిన భూమి కోసం – గ్రామమూ, ప్రతాపనాయుడు కలిసి చేసిన పోరాట వార్తలు కొన్ని తెలుసు, కానీ పూర్తి సమాచారం వార్తా మాధ్యమాలకు గూడా తెలీదు కదా? తెలిసిన కొద్దిపాటి దాన్నే ప్రచారం చేస్తాయి మాధ్యమాలు. ఆ కొద్దిపాటి దాన్లో గూడా సత్యమెంత..? ఏం జరిగింది, అసలు...?

వరహాలమ్మ ఆపేసిన దగ్గర నుంచి అందుకొని చెప్పాలన్పించింది, తలారి జోగయ్యకు– కాని, ఆమె దు:ఖం జోగయ్యనూ కమ్ముకుంది. భవంతికి చేరుకుని, చిత్రకారుని సరంజామా సర్దిపెట్టి, నిద్రకు పక్క సర్దిపెట్టి, వాక దీర్ఘ విశ్వాసం తీసి –

"... బావూ, యేటి జరిగింది? పాపపున్నేలెవుళిపీ? నారాయుణుడు సూస్తాడు. నరుడూ సూస్తాడు, గానీ తేల్సిసెప్పడు. గాని, నారాయుడు తేలుస్తాడు! ఆ! తప్పకా తేలుస్తాడు, గానీ ఓర్సాలి! పాపం, పూరాగా పండిందాకా వోర్సాల..." అని ఆరంభించేడు జోగయ్య.

ఆసక్తిగా వినసాగేడు చిత్రకారుడు.

"...చాన్నాళ్లు, అనుకున్న ప్రకారం భూముల మార్పిడి జరిగిన ప్రకారం నడిచింది. అనుకున్నట్లు కిష్టంనాయుడి బంజరుని దోవ కింద, వాడినారే తప్పా, చెరుకుమిల్లు కట్టలేదు. ఉంకో పక్క, ప్రభుత్వం అదుపుజేసిన భూమి కోసరమూ గొడవ సాగుతుంది. పోలీసుల కాల్పులు, వొక రైతు చావు, ప్రతాపనాయుడి అరెస్టూ..." వొక చారిత్రక కథనంలోని మూల మలుపుల్ని, గుర్తు జేసాడు జోగయ్య.

"...అదిగో, ఆయన జెయిల్లో వుండగా, అతని చెరకుతోటకు నిప్పంటించేరు. చెరకు తోటల ప్రక్కగా, బుల్లెటు నాయుడి బుల్లెట్ బండి పడి వుంది. బుల్లెట్ నాయుడు, ఆ రోజు నుంచీ కన్పించలేదట..."

ప్రతాపనాయుడు బెయిలు మీద విడుదలయి, అగ్యాతవోసం వెళ్ళిపోయేడట. గ్రామసైన్యం తయారు చేసాడట. ఏటేటో వార్తలు...! ఎవురెవరో చక్రాలు తిప్పేసేరు.

ఈ సమయంలోనే, ప్రతాపనాయుడి తండ్రుల స్మారకస్థలం, ఆ లోకనాథం బాబు చేతిలోకి వెళ్లింది, లోకనాథం అందులో, నూనెమిల్లు కట్టినాడు.." ఊపిరి పీల్చుకోవడానికి ఆగేడు జోగయ్య.

"...లోకనాథం చేతిలోకి యోలాగెల్లింది?"

"...ఎళ్లక యేటవతాది? కిష్టంనాయుడికి పీకలోతు అప్పులు. కొత్తగా అప్పు యివ్వడంకి హామీ కావాలన్నడు లోకనాథం. ఆ హామీ గూడా, ఆ భూమే కావాలన్నాడు. కాదనగల్డేటి...?"

చిత్రకారుడికి మొత్తం దృశ్యం కదలాడింది. పద్మవ్యూహమేదో, ప్రతాపనాయుడి చుట్టూ...

"...ఆ తండ్రుల సమాధుల స్థలంలో నూనెమిల్లు పెట్టేడు లోకనాథం. ఎలాగ జరిగిందో, నూనెమిల్లుకి అగ్గి అంటుకుంది. మిల్లులో వొకటో రెండో శవాలు. ఆ శవాల్లోన బుల్లెట్‌నాయుడి శవముందట. ఈ పాపమెవుల్ది? ఎవుళుజేసారు? చక్రమెవుళు తిప్పేరు? ఎవుళు అమిరిపోనారు కుట్రకి? ఎవుళు తేలుస్తారు సత్యాన్ని? నువ్వూ, నేనూ కాదు – ఆ నారాయణుడు తేల్సాల. ఆ! అది బాబూ, నాకు తెల్సిన వృత్తాంథం! నాకు మరి నిద్రొస్తంది. సెలవిస్తే, గడపల కునుకుదీస్తాను..." అని సెలవు కోసం ఆగకుండానే, గడపలో నిద్రకు ఉపక్రమించేడు జోగయ్య.

చిత్రకారుడుకి, ప్రతాపనాయుడి మీదా, ఆ గ్రామస్థులు కొందరి మీద నడిచిన మిల్లు దగ్ధంకేసూ, బుల్లెట్ నాయుడి హత్య కేసూ విచారణ సందర్భంగా, పత్రికల్లో రాతలు గుర్తొచ్చేయి.

"...మిల్లు దగ్ధం చేసావా?" కోర్టు ప్రశ్న

"...నేను రైతుని, సృష్టికర్తని..." ప్రతాపనాయుడి జవాబు.

"...బుల్లెట్ నాయుడ్ని చూసావా?"

"...కలుపు మొక్క పీకకపోతే, పంట కాపాడలేదు రైతు..."

ఇంతే. ఇలాంటి జవాబులే. ఉరిశిక్ష పడింది. ఉరితాటిని, స్వయంగా మెడకి వేసుకుని, కానీయమని ఉరిదీసే ఉద్యోగులకు సైగజేసేడట!

అన్నీ కదలాడగా, చిత్రకారుడు, సరంజామా తీసేడు. యేవేవో రేఖాలూ, దృశ్యాలూ, ఉద్వేగాలూ, ఉద్రేకాలూ– పరిసరాలు మర్చిపోయేడు చిత్రకారుడు, కాలాన్ని మర్చిపోయేడు.. చిత్రపట రచనలో మునిగిపోయేడు.

మర్నాటి ఉదయం, అవనీ, విశ్వం వచ్చి చూస్తే, చిత్రకారుడు కన్పించలేదు. గడపలో జోగయ్య గూడా లేదు. ఏమయినారని, అందోళనగా యింట్లో వెదికితే, వెనకవేపు గదిలో వో 'చిత్రపటం' కన్పించింది.

మహాకాయంతో, ఓ మానవాకారం వికృతంగా! కడుపున్నచోట ధనరాశులు. భుజాల మీద, చట్టాలూ, శాసనాలూ. పంటపొలాల మీద లేచిన ఇనుప స్థంభాల–కాళ్లు! సొరంగం లాంటి నోరు– గ్లోబుని మింగ తెరచినట్టు! భయంకరాకారం!

ఇంత భయంకరాకారానికీ – కళ్ళల్లో మాత్రం భయం కన్పడ్తోంది. మడమెత్తి పరుగెడ్తూ, మెడ వెనక్కి దిప్పి భయంగా చూస్తోంది. పెనుశక్తి యేదో వెంట తరుముతున్నట్లు! ఆ పెనుశక్తి ప్రతాపనాయుడిలా, ఆ గ్రామంలా, వందలూ, వేలూ, లక్షలూ, కోట్లాదిలా. . . . . .!

**– సమాప్తం కాదు**

# పంచాయితీలు బలోపేతం

**భారతదేశంలో పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగ బద్ధత కల్పిస్తూ చేయబడిన 73వ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చి 15 సం.లు అయిన సందర్భంలో కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ గత ఏడాది న్యూఢిల్లీలో పంచాయతీ సమ్మేళనాన్ని నిర్వహించింది. ఈ సమ్మేళనానికి దేశంలోని వివిధ రాష్ట్రాలనుండి జిల్లా పరిషత్తు ఛైర్మన్లు. మండల పరిషత్తు ఛైర్మన్లు సుమారు 8000 మంది హాజరు అయ్యారు. మన రాష్ట్రం నుండి సుమారు 700 మంది ప్రతినిధులు హాజరయినట్లు అంచనా.**


దేశవ్యాప్తంగా పంచాయతీ రాజ్ సంస్థలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ, "సంఘటిత పాలన కొరకు సంఘటిత అభివృద్ధి'' అనే నినాదంతో ఈ సమ్మేళనానికి హాజరయిన ప్రజాప్రతినిధులందరూ ఒక "ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్" తయారుచేసి ప్రధాని మన్మోహన్ సింగ్ మరియు యు.పి.ఎ. ఛైర్ పర్సన్ శ్రీమతి సోనియాగాంధీకి అందచేశారు. ఈ ఛార్టరులోని ముఖ్యమైన అంశాలను ఈ వ్యాసంలో చర్చిద్దాం.


**ఈ ఛార్టర్ ఆఫ్ డిమాండ్సులోని ముఖ్యమైన అంశాలు**

- భారత రాజ్యాంగపు 11వ షెడ్యూలులోని 29 అంశాలను వెంటనే పంచాయతీ రాజ్ సంస్థలకు బదలాయించాలి.
- వివిధ స్థాయిలలోని పంచాయతీ రాజ్ సంస్థలు నిర్వహించవలసిన విధుల విభజనలో స్పష్టత కొసం వెంటనే అన్ని రాష్ట్రాలు 29 అంశాలలో యాక్టివిటీ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసి, ఈ యాక్టివిటీ మ్యాపింగ్ ఆధారంగా అధికారాల బదలాయింపు జరపాలి.
- పంచాయతీ రాజ్ సంస్థలకు సమాంతరంగా పనిచేస్తూ పంచాయతీ రాజ్ సంస్థల స్ఫూర్తిని దెబ్బతీసే డి.ఆర్.డి.ఏ/గ్రామైక్య సంఘాలు/విద్యా కమిటీలు/తల్లుల కమిటీలు/నీటివినియోగ దారుల సంఘాలు/గ్రామ ఆరోగ్య సంఘాలు మొదలగు సమాంతర వ్యవస్థలను రద్దు చేయటమో లేక ఈ సంస్థలను పంచాయతీ రాజ్ సంస్థలతో విలీనం చేసి, పంచాయతీ రాజ్ సంస్థలను బలోపేతం చేయ్యాలి.
- పంచాయతీ రాజ్ సంస్థలను స్థానిక స్వపరిపాలనా సంస్థలుగా తీర్చిదిద్దడానికి వీలుకల్పిస్తూ, వీటి పరిధిని విస్తరిస్తూ న్యాయ, పోలీసు, రెవెన్యూ, రెగ్యులేషన్, అభివృద్ధి విధులను పంచాయతీలకు సంక్రమింపచెయ్యాలి.
- పంచాయతీ రాజ్ సంస్థలకు చెందిన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ జాబితాలోంచి తొలగించి కేంద్ర ప్రభుత్వ లేదా ఉమ్మడి జాబితాలోనికి తీసుకొని రావటానికి ప్రయత్నాలు చెయ్యాలి.
- జిల్లా ప్రణాళికా కమిటీలలో గ్రామ పంచాయతీ ప్రతినిధులకు, మండల పరిషత్తు ప్రతినిధులకు సభ్యత్వం కల్పించాలి.
- రాష్ట్ర బడ్జెట్‌లో శాఖల వారీగా ప్రత్యేక పంచాయతీ విండోను ఏర్పరచి నిధులను నేరుగా పంచాయతీ రాజ్ సంస్థలకు బదలాయించాలి.
- వివిధ స్థాయిలలోని పంచాయతీ రాజ్ సంస్థలు తమ ప్రాంతాల అభివృద్ధికి తావే ప్రణాళికలు తయారు చేసుకొని, అమలుపరచుకొనటానికి వీలుగా వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధి లాంటి నిబంధితం కాని (అన్‌టైడ్) నిధులను పంచాయతీ రాజ్ సంస్థలకు పెద్ద మొత్తంలో అందుబాటులోనికి తీసుకొని రావాలి. ఇందుకుగాను గ్రామీణ ప్రాంతాలలో అమలు జరుగుతున్న ఉపాధిహామీ పథకం, జాతీయ ఆరోగ్య మిషన్, రాజీవ్ విద్యామిషన్

(ఎస్.ఎస్.ఎ), పి.యం.జి.ఎస్.వై. మధ్యాహ్న భోజన పథకం. ఐ.సి.డి.ఎస్., గ్రామీణ నీటి సరఫరా పథకం, సంపూర్ణ పారిశుధ్య పథకం వంటి కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ పథకాల నిబంధనల్లో తగు మార్పులు చేయాలి.

- వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల నియమ నిబంధనలు ఎప్పటికప్పుడు పంచాయతీ రాజ్ సంస్థలకు అందుబాటులోనికి తీసుకొని రావటానికి చర్యలు చేపట్టాలి.
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులను నేరుగా పంచాయతీరాజ్ సంస్థల ఖాతాలలోకి ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ సిస్టం ద్వారా బదలాయించాలి. పంచాయతీరాజ్ సంస్థలకు కేటాయించిన నిధులను ఇతర శాఖలకు బదలాయించే విధానాలకు స్వస్తి పలకాలి.
- పంచాయతీ రాజ్ సంస్థలచే వినూత్నంగా తయారుచేయబడిన ప్రాజెక్టులకు నిధులను సమకూర్చటానికి కేంద్ర ప్రభుత్వంలో ఒక ప్రత్యేక గవాక్షాన్ని ఏర్పరచి ఇతర స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహిస్తున్నట్లే పంచాయతీరాజ్ సంస్థలను కూడా ప్రోత్సహిచటానికి వెంటనే చర్యలు చేపట్టాలి.
- తమ స్వంత ఆదాయాల నుండి పంచాయతీలు చేసే పెట్టుబడులు, వ్యయాలపై రాష్ట్రాలు ఎటువంటి షరతులు విధించరాదు.
- గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు కనీస సౌకర్యాలయిన త్రాగునీరు, ఆరోగ్యం, విద్య, ప్రజాపంపిణీ వంటివి సమర్ధవంతంగా అందచేయటానికి ఈ శాఖల సిబ్బందిని పంచాయతీరాజ్ సంస్థల పూర్తి నియంత్రణలోనికి తీసుకొనిరావాలి.
- పంచాయతీరాజ్ సంస్థలలో పనిచేసే సిబ్బందికి సంబంధించిన రహస్య నివేదికలు రాసే అధికారం సంబంధిత పంచాయతీ రాజ్ సంస్థ అధ్యక్షులకు సంక్రమింపచేయాలి.
- పంచాయతీ రాజ్ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధులకు సముచిత రీతిలో నెలసరి పారితోషకం అందచేయటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చాలి. అదేవిధంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు రవాణా, కరువు భత్యాలు చెల్లించాలి.
- పంచాయతీ రాజ్ ప్రతినిధులకు, ఈ సంస్థలతో పని చేస్తున్న అధికారులకు "నేషనల్ కేపబిలిటీ ఫ్రేమ్ వర్క్" ను అనుసరించి స్థానిక భాషలో అత్యున్నతమైన శిక్షణను అందచేయాలి.
- శిక్షణ అందచేయుటకు ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థలను, శాటిలైట్ టి.వి. ఛానళ్ళను విస్తృతంగా వినియోగంలోనికి తీసుకొనిరావాలి.
- ప్రజాప్రతినిధుల పదవీకాలంలో వివిధ అంశాలపై పలుమార్లు శిక్షణ అందచేయాలి. శిక్షణను ఒక నిరంతర ప్రక్రియలాగా రూపొందించాలి. ఎస్.సి/ఎస్.టి/మహిళలు వంటి ప్రత్యేక తరగతులవారికి ప్రత్యేక శిక్షణ అందచేయాలి. నిరక్షరాస్యులైన ప్రజాప్రతినిధులను అక్షరాస్యులుగా మార్చటానికి తగిన శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలి.
- 1996 పెసా (షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరించినటు వంటి





పంచాయతీలు) చట్టాన్ని అనుసరించి గిరిజన ప్రాంతాలలో పంచాయతీలకు ప్రత్యేక అధికారాలు దఖలు పరచటానికి తగిన నిబంధనలను వెంటనే అన్ని రాష్ట్రాలు చేపట్టాలి.

- ❖ స్థానిక పరిపాలనకు చెందిన విద్యను పాఠశాల సిలబస్‌లో చేర్చాలి. దీనివలన పిల్లల్లో స్థానిక ప్రభుత్వాల్లో పాల్గొనాలనే స్ఫూర్తి కలుగుతుంది.
- ❖ సమాచార సాంకేతిక వ్యవస్థలను పంచాయతీ స్థాయి వరకు విస్తరించి దశల వారీగా ఈ-గవర్నెన్సు ప్రాజెక్టును రానున్న 3 సంవత్సరాలలో అమలుచేయాలి.
- ❖ ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే పోటీకి అనర్హత వంటి నిబంధన తొలగించాలి. ఇది పంచాయతీ స్థాయి ఎన్నికల్లో ప్రతిభావంతమైన నాయకత్వాన్ని నిరోధిస్తుంది.
- ❖ పంచాయతీ రాజ్ చట్టాలలో పంచాయతీ పాలకవర్గాన్ని తొలగించి ప్రత్యేక అధికారులను నియమించటానికి వెసులుబాటు కల్పించే నిబంధనలను తొలగించాలి.
- ❖ గ్రామ పంచాయతీ/మండల/జిల్లా స్థాయిలలో వికేంద్రీకృత ప్రణాళికలు తయారు చేయటానికి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలన్నిటికీ ఒక సమగ్రమైన ప్రణాళికను తయారుచేయటానికి పంచాయతీ రాజ్ సంస్థలను ప్రాతిపదికగా తీసుకోవాలి. పంచాయతీలు తయారు చేసిన ప్రణాళికలను ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయిలో గౌరవించాలి మినహా మార్పులు చేయరాదు.
- ❖ పార్లమెంటు/శాసనసభ్యులు ప్రాంతీయ నిధులుకూడా స్థానికంగా తయారుచేసిన ప్రణాళికానుసారంగా కేటాయించేలా నిబంధనలను మార్చాలి.
- ❖ ప్రణాళికల రూపకల్పనలో వివిధ అభివృద్ధి శాఖల అధికారులు తప్పనిసరిగా పంచాయతీ రాజ్ సంస్థలకు సహకరించేలా అన్ని శాఖలు నిబంధనలు రూపొందించాలి.
- ❖ గ్రామ సభ స్ఫూర్తిని పెంపొందించేలా ప్రజలకు గ్రామ సభపై నమ్మకం కలిగేలా గ్రామసభను ఒక నిర్మాణాత్మకమైన వేదికగా మలచటానికి అవసరమైన అధికారాలు కల్పించాలి.
- ❖ దేశంలోని వివిధ పంచాయతీ రాజ్ సంస్థల మధ్య సాన్నిహిత్యం పెంచడానికి, సంఘటిత పరచడానికి సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవటానికి గాను పంచాయతీ నెట్‌వర్కును ఏర్పరచాలి.
- ❖ ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పంచాయతీ రాజ్ సంస్థలలో పనిచేస్తున్న సుమారు 2.6 లక్షల మంది ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పైఅంశాల సాధనకు కృషి చేసి ప్రభుత్వ సానుకూలతను సాధించటానికి ప్రయత్నిస్తే పంచాయతీ రాజ్ సంస్థలు కొంతమేరకయినా బలోపేతం అవుతాయనటంలో సంశయించనవసరంలేదు.

**డా॥ వి. శివశంకర్ ప్రసాద్,**
జూనియర్ ఫ్యాకల్టీ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి

**కార్పోరేట్ సంస్థల వీడియో ఫిల్ములు, వెబ్‌సైట్ల నిర్వహణ, హౌస్ జర్నల్స్ మొదలైన వాటికి సంబంధించి ఇటీవల నిర్వహించిన అఖిల భారతస్థాయి పోటీలో ఎలిమినేటి మాధవరెడ్డి ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎఎమ్ఆర్-అపార్డ్) సంస్థ నాలుగు బహుమతులను గెలుచుకుంది.**




పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ తన 10 వ వార్షిక కాన్ఫరెన్స్ నిర్వహణ సందర్భంగా ఫిబ్రవరి నెలలో కార్పోరేట్ వీడియో ఫిల్ములు, వెబ్‌సైట్లు, హౌస్ జర్నల్స్‌కు సంబంధించి అవార్డులు ఇవ్వడానికి అఖిలభారత స్థాయి పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో

### అఖిలభారతస్థాయి హౌస్ జర్నల్స్ పోటీల్లో

# 'స్థానిక పాలన' పత్రికకు అవార్డు



**గ్రామీణ పరిపాలనా వ్యవస్థను మెరుగుపరచడంలో, శిక్షణ ఇవ్వటంలో ఎవమ్ఆర్– అపార్ట్ ఒక నోడల్ ఏజెన్సీలా పనిచేస్తోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకంతో సహా, వివిధ గ్రామీణ అభివృద్ధి పథకాలు అమలు, ప్రణాళికల తయారీ మొదలైన అంశాల్లో సామర్థ్యాలను పెంపొందించే కార్యక్రమాలను కూడా ఎవమ్ఆర్ – అపార్డ్ అమలు చేస్తోంది.**

ప్రభుత్వ శాఖలు, సంస్థలు, పబ్లిక్ సెక్టార్ సంస్థలు, వ్యాపార వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, తదితర సంస్థలు పాల్గొన్నాయి.

ఈ పోటీలకు ఎవమ్ఆర్–అపార్డ్ మొత్తం నాలుగు ఎంట్రీలు – వీడియో ఫిల్ములు రెండు, హౌస్ జర్నల్ ఒకటి, వెబ్‌సైట్ ఒకటి– దాఖలుచేసి, ఈ నాలుగు బహుమతులను గెలుచుకుంది.

### పోటీల వివరాలు:

**1. ఉత్తమ కార్పోరేట్ వీడియో ఫిల్ములో అఖిలభారత పోటీ:**

సంస్థ కార్పోరేట్ ఇమేజ్‌ను పెంపొందించడానికి, వీడియో ప్రొడక్షన్‌లో నైపుణ్యాలను, నేర్పరితనాన్ని పెంచడానికి, ఈ రంగాల్లో పరిణితిని పెంపొందించడానికి ఈ పోటీలు నిర్వహించారు.

**2. హౌస్ జర్నల్స్‌లో అఖిలభారతస్థాయి అవార్డులు, ప్రదర్శన:**

పబ్లిక్ రిలేషన్స్ రంగంలో పనిచేస్తున్న వారికి హౌస్ జర్నల్స్ ప్రచురణలో నైపుణ్యాలను పెంచడానికి, జర్నల్ అంశాలలో, ప్రచురణలో ఉత్తమ ప్రమాణాలను పెంచడానికి ఈ పోటీని నిర్వహించారు. ఈ అఖిలభారత స్థాయి పోటీని నిర్వహించడం ఇది తొమ్మిదవ సారి.

**3. వెబ్‌సైట్ల నిర్వహణలో అఖిలభారత స్థాయి అవార్డులు:**

పబ్లిక్ రిలేషన్స్ రంగంలోని వారు అవలంబించే కమ్యూనికేషన్ సాధనాల్లో హైటెక్ సాధనాల వాడకాన్ని, నైపుణ్యాలను పెంపొందించడానికి, వెబ్‌సైట్లు, బ్లాగ్‌ల నిర్వహణను మెరుగుపరచడానికి హైదరాబాద్ చాప్టర్ మొదటిసారి ఈ పోటీలను నిర్వహించింది.

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన ఈ అవార్డుల కార్యక్రములో ప్రెస్ అకాడమి ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మాజీ ఛైర్మన్ శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గవర్నర్‌గారి సెక్రటరీ శ్రీ ఎం.జి. గోపాల్ ముఖ్య అతిథిలుగా పాల్గొని అన్ని అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో ఫిబ్రవరి 15 న జరిగింది. ఎవమ్ఆర్–అపార్ట్ తరపున డిప్యూటీ డైరెక్టర్ (అకౌంట్స్) శ్రీ మహమ్మద్ తకీయుద్దీన్ ఈ అవార్డులను స్వీకరించారు.

### ఎవమ్ఆర్ అపార్డ్‌కు అవార్డులు తెచ్చిన ఎంట్రీల వివరాలు:

**వీడియో ఫిల్మ్ ప్రొడక్షన్**

గ్రామీణ పరిపాలనా వ్యవస్థను మెరుగుపరచడంలో, శిక్షణ ఇవ్వటంలో ఎవమ్ఆర్– అపార్ట్ ఒక నోడల్ ఏజెన్సీలా పనిచేస్తోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకంతో సహా, వివిధ గ్రామీణ అభివృద్ధి పథకాలు అమలు, ప్రణాళికల తయారీ మొదలైన అంశాల్లో సామర్థ్యాలను పెంపొందించే కార్యక్రమాలను కూడా ఎవమ్ఆర్ – అపార్డ్ అమలు చేస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో సహా, ఇతర గ్రామీణ అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు తెలియజేయడానికి ఎవమ్ఆర్ – అపార్డ్ రెండు వీడియో ఫిల్ములను నిర్మించింది.

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, జాబ్‌కార్డుల జారీ, ఈ చట్టం కింద వేతనాలు పొందే వారి హక్కులపై ఒక ఫిల్మ్.
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల గుర్తింపునకు అవలంబించే ప్రణాళికా ప్రక్రియపై మరొక ఫిల్మ్.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నిర్వహణాంశాల గురించి ఈ రెండు ఫిల్ములు పూర్తి అవగాహన కల్పిస్తాయి. ఈ పథకాన్ని అమలు చేస్తున్న సంస్థలకు, అధికారులకు లబ్దిదారులకు అంటే కూలీలకు అవగాహన కల్పించే విధంగా ఈ ఫిల్ములను తయారుచేశారు.

**హౌస్ జర్నల్**

ఇటీవల ఎవమ్ఆర్– అపార్డ్ 'స్థానికపాలన' పేరిట ఒక మాసపత్రికను ప్రారంభించింది. ఫిబ్రవరి నెలలో ప్రారంభించిన తొలి పత్రికతోనే ఈ అవార్డును గెలుచుకొవటం విశేషం.

ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థల అధికారులు వివిధ సంస్థలకు సమాచార వినిమయ సాధనంగా 'స్థానిక పాలన' పత్రిక విశిష్టమైనపాత్ర పోషిస్తోంది.

**వెబ్‌సైట్**

వెబ్‌సైట్‌ను సందర్శించిన వారికి నాయకత్వ నైపుణ్యాలను, వివిధ సేవలను అందించే విధంగా ఎవమ్ఆర్–అపార్డ్ ఒక వెబ్‌సైట్‌ను నిర్వహిస్తోంది.

**- వై.యస్**



# పంచాయితీరాజ్ సంస్థల ముందున్న సవాళ్ళు

**"డెట్రాయిట్ నుంచి ఢిల్లీ దాకా నివసించే కోట్లాది మంది జనాభాకు ఇది గడ్డుకాలం. ఎన్నో కుటుంబాలు తమ ఉపాధిని, ఇళ్లను కోల్పోయారు. ఆరోగ్య పరిరక్షణ కరువైంది. పూట గడవని పరిస్థితి ఎదురైంది" అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి బాన్-కీ-మూన్, అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు అల్‌గోర్ ఇటీవల ఒక సందేశంలో ప్రపంచ ప్రజలను హెచ్చరించారు.**

ఆర్థిక మాంద్యం కోరల్లో చిక్కుకొన్న దేశాల్లో అమెరికా మరింతగా దెబ్బతింది. శక్తిని మించి ఖర్చులు పెట్టడం వల్ల 19 బ్యాంకులు దివాళా తీశాయి. మాంద్యం తాలూకు దుష్పరిణామాలు ఐరోపా దేశాలలో కొంచెం తక్కువగా వున్నాయని చెప్పవచ్చు. సంపాదించిన దాంట్లో కొంత దాచుకోవాలన్న సాంప్రదాయమున్నందున భారతదేశంలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. అయినా మనం ఈ మాంద్యపు కోరల నుంచి బయట పడలేకపోతున్నాం. కారణం, పారిశ్రామిక ఉత్పత్తుల పెరుగుదల తిరోగమనంలో వుంది. 1960 దశకంలో గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజల్లో 81 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడగా, అది యిప్పుడు 68 శాతానికి పడిపోయింది. జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 20 శాతం ఉండగా, రైతులు, భూమి లేని నిరుపేదలంతా దారిద్ర్యరేఖకు దిగువన జీవించడం విచారకరం.

ప్రస్తుతపు ఆర్థిక మాంద్యపు దుష్పరిణామాలను 1932 నాటి మహా ఉపద్రవంతో కొందరు ఆర్థికవేత్తలు పోల్చుతున్నారు. నేడు అమెరికాలో 1.1 కోట్ల మంది ఉపాధి కోల్పోయారు. ఈ దుస్థితి నుంచి బయట పడటానికి కనీసం మరో రెండేళ్లైనా పడుతుందని అంటున్నారు.

ఇదిలా ఉండగా, ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యభద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఈ ఏడాది చివరికల్లో ఆకలి బాధలతో తల్లడిల్లిపోయేవారి సంఖ్య 100 కోట్లకు చేరుకుంటుందని ఐక్యరాజ్యసమితి సంస్థ ఇటీవల విడుదల చేసిన ఒక నివేదికలో హెచ్చరించింది. పౌష్టికాహార లోపం వున్న వారి సంఖ్య భారతదేశంలోనే ఎక్కువుంది. ఇక్కడ అత్యధికంగా 20 కోట్ల మంది ఉన్నారు. పుండుమీద కారం చల్లినట్లు గత ఆరునెలల్లో పెరుగుతున్న ఆహారపదార్థాల ధరల వల్ల పరిస్థితి మరింత దిగజారుతోంది. గత ఏడాది అక్టోబర్‌లో 13 శాతం ఉన్న ద్రవ్యోల్బణం, ఈ ఏడాది మార్చి మొదటి వారానికల్లా 2.4 శాతానికి పడిపోయినప్పటికీ, ఈ మధ్య కాలంలో ఆహారధాన్యాల ధరలు 11 శాతం, ఇతర తినుబండారాలు ధరలు 8 శాతం పెరగడం ఆర్థికవేత్తలను సైతం ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది.

ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చి ఫౌండేషన్ సహకారంతో వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం సంస్థ రూపొందించిన ఒక నివేదిక ప్రకారం, ఆకలితో అలమటించే ప్రపంచ జనాభాలో సగం మంది భారతదేశంలోనే నివసిస్తున్నారు. అలాగే ప్రపంచంలో పౌష్టికాహార లోపంతో మరణించే పిల్లలు సగంమంది భారతదేశంలో ఉండటం అత్యంత విచారకరం. అయిదేళ్లలోపు పిల్లల్లో పౌష్టికాహార లోపంతో బాధపడేవారు ఆఫ్రికాలోని అతిపేద దేశాల్లో 28 శాతం మంది ఉంటే, వారి సంఖ్య భారతదేశంలో 47శాతం ఉంది.




అంతర్జాతీయ ఆహార పరిశోధనా సంస్థ గత ఏడాది విడుదల చేసిన తొలి 'ఆకలి సూచిక' ప్రకారం భారతదేశ పరిస్థితి 'అతి ప్రమాద స్థాయి'లో ఉంది.

2007-08 సంవత్సరంలో మన ఆహార ఉత్పత్తి రికార్డు స్థాయిలో 23 కోట్ల టన్నులకు చేరుకొన్నప్పటికీ, దారిద్ర్యపు రేఖకు ఎగువనున్న వారు ఎందరో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్లు తేలింది. తినుబండారాలపై పెట్టే ఖర్చు నిష్పత్తి గణనీయంగా పెరగడమే దీనికి కారణంగా చెబుతున్నారు.

వచ్చే మూడేళ్లలో మనకు 25 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు అవసరమవుతాయి. ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రతిపాదించిన 'రెండో హరిత విప్లవం' కోసం ఉద్యమించకపోతే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం కాదు.

దాదాపు 50 ఏళ్ల కిందట, ఇటువంటి పరిస్థితుల్లోనే పంచాయితీరాజ్ సంస్థలను పరిపుష్టం చేసి స్వయం సమృద్ధికి బాటలు వేశారు మన నేతలు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబించి, వ్యవసాయ కార్యకలాపాలను ముమ్మరం చేయడం ద్వారానే ఇది సాధ్యమవుతుంది.



ఇదే పంచాయితీరాజ్ సంస్థల ముందున్న ప్రథమ కర్తవ్యం.

పౌష్టికాహార లోపం మరో పెద్ద సవాలు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా బక్కచిక్కిపోయిన తల్లులూ, మందుకు వేళ్లాడే బొజ్జలతో పిల్లలు కన్పిస్తుంటారు. దీనిక్కారణం, పేదరికం ద్వారా వచ్చే దీర్ఘకాలిక పౌష్టికాహార లోపమేనని వేరే చెప్పనక్కర్లేదు. ఈ దుస్థితిని మార్చటానికి నాల్గో పంచవర్ష ప్రణాళికలో మొదటిసారిగా ప్రయత్నాలు ప్రారంభమైనాయి.

1974-75వ సంవత్సరంలో మన దేశంలో 53 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నట్లు మొదటిసారిగా కనుగొన్నారు. అప్పటి నుంచి నిర్విరామంగా 25 ఏళ్లపాటు చేపట్టిన పథకాల కారణంగా ఈ సంఖ్య 25 శాతానికి తగ్గించగలిగాం.

గత 58 ఏళ్లలో మన ఆర్థిక ప్రగతి ఈ దిగువ పేర్కొన్న విధంగా ఉంది.

| | | |
|---|---|---|
| 1951-52 | 1961-62 | 3.91% |
| 1961-62 | 1970-71 | 3.7% |
| 1971-72 | 1980-81 | 3.07% |
| 1981-82 | 1990-91<br>(1989-90 మినహా) | 5.08% |
| 1991-92 | 2000-01 | 5.58% |
| 2001-02 | 2007-08 | 7.65% |

పేదరిక నిర్మూలనకు అభివృద్ధి రేటును పెంచడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదు. అభివృద్ధి రేటు గణనీయంగా పెరిగినా ప్రస్తుతం మన దేశంలో 22 నుంచి 28 కోట్ల మంది నిరుపేదలున్నారు. ప్రజా సాధికారతను పెంపొందించడానికి వీలుగా ప్రభుత్వ విధానాలుండాలి. అయితే ఇక్కడొక ముఖ్యమైన అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఇటువంటి, సున్నితమైన స్థితిలో చిన్నపాటి సంక్షోభాలు వచ్చినా (ఉదాహరణకు ధరలు కొద్దిగా పెరిగినా) కోట్లాది మంది దారిద్ర్యరేఖ దిగువకు నెట్టి వేయబడతారు. వచ్చే అయిదేళ్లలో ప్రపంచ జనాభాలో సగంమంది ఆకలితో



ప్రకారం, ప్రపంచంలో ప్రతి ఏటా జరిగే 97 లక్షల శిశుమరణాలకకు పారిశుధ్య లోపమే ఏకైక కారణమని పేర్కొంది.

మనదేశంలో ఏటా 4 లక్షల 2 వేల మంది పిల్లలు నీళ్లవిరోచనాలతోనూ, 2 లక్షల 17 వేల మంది పౌష్టికాహార లోపంతోనూ చనిపోతున్నారు. మరో ఆశ్చర్యకరమైన విషయమేమంటే, ప్రపంచంలో 110 కోట్ల మందికి రక్షిత తాగునీరు అందుబాటులో లేకపోవడం, 260 కోట్ల మందికి ప్రాథమిక పారిశుధ్య సౌకర్యాలు లేకపోవడం.

గాలిలో కార్బన్-డై-ఆక్సైడ్, మిథేన్ వంటి విష వాయువుల అధికమవడం వల్ల భూమి వేడెక్కి అనేక అనర్థాలకు హేతువుతోంది. పెట్రోలియం ఉత్పత్తులు, బొగ్గు వాడకం వల్ల 1990లో 2.100 కోట్ల టన్నుల విష వాయువులు వెలువడుతుండగా అది 2004 నాటికి 2700 కోట్ల టన్నులకు చేరింది. భూమి వేడెక్కడం వల్ల హిమఖండాలు కరిగిపోతాయి. రుతుపవనాలు సక్రమంగా రావు. వరదలు, కరువు కాటకాలు ఎక్కువవుతాయి. సముద్రమట్టం పెరుగుతుంది. వీటన్నింటి కారణంగా ధాన్యం ఉత్పత్తి పడిపోతుంది. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్ల అలర్జీల, చర్మవ్యాధులు, ఊపిరి తితుత్తకు సంబంధించిన జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయి.

ప్రపంచ వ్యాప్తంగా చూస్తే, వాహన కాలుష్యంలో భారత్ వంతు చాలా తక్కువేనని చెప్పుకోవచ్చు. ప్రపంచ తలసరి సంఖ్యలో నాల్గోవంతు మాత్రమే వుంది. కార్బన్ దుష్ఫలితాలను అరికట్టటానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతనే నిర్వహించక పోతే భవిష్యతులో మూల్యం చెల్లించుకోక తప్పదు.

దానికి ఏం చేయాలంటే :

1. సాధ్యమైనంత ఎక్కువగా సౌరశక్తిని వినియోగించాలి.
2. చిత్తు కాగితాలు, సీసాల వంటి వస్తువులను రీసైకిల్ చేయాలి.
3. నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి.
4. అత్యవసర పరిస్థితుల్లో తప్ప, ఇతర సమయాల్లో ప్రజా రవాణా సౌకర్యాలను వినియోగించాలి.

గ్రామీణ ప్రాంతాల్లో పంచాయితీ రాజ్ సంస్థలకు ఎన్నికైన సభ్యులు ప్రజలకు సన్నిహితంగా ఉంటున్నారు. భూమి వేడెక్కకుండా తీసుకొనే చర్యలు అనేకం చేపట్టటానికి వీరికి అవకాశం ఉంది. ముఖ్యంగా సామాజిక అడవుల పెంపకం వంటి కార్యకలాపాలలో ప్రజల సహకారంతో అనేక చర్యలు చేపట్టవచ్చు.

అలమటిస్తారని ఐక్యరాజ్య సమితి శతాబ్దపు అభివృద్ధి లక్ష్యాల నివేదికలో పేర్కొన్నారు.

ఈ నివేదికలో ప్రస్తావించిన మరో ముఖ్య విషయం సార్వత్రిక విద్య గురించి వెనకబడిన తరగతుల కుటుంబాలలో విద్యాభ్యాసాన్ని మానివేసిన (డ్రాప్ అవుట్స్) వారి సంఖ్య క్రమంగా పెరగడం గమనార్హం

| | మొత్తం సగటు | షె.కులాలు | షె.తరగతులు | బాలికలు |
|---|---|---|---|---|
| 5వ తరగతి వరకు | 29% | 34% | 42% | 25.4% |
| 8వ తరగతి వరకు | 50% | 57% | 65% | 51% |
| 10వ తరగతి వరకు | 62% | 71% | 78% | 63% |

6-14 ఏళ్ల మధ్య వయస్సు వున్న పిల్లలందరికీ విద్యను 2002లో ప్రాథమిక హక్కుగా గుర్తించారు. సమాజంలో ఆర్థిక అసమానతలు, గ్రామీణ-పట్టణ వ్యత్యాసాలు, ఎస్.సి., ఎస్.టిల పేదరికం చాలా అనర్థాలకు తావిస్తున్నాయి. ధనికుల్లో 72 శాతం మందికి అక్షరాస్యత ఉండగా, మధ్య తరగతి వారిలో 65 శాతం మందికి, బడుగు వర్గాల్లో 45 శాతం మంది మాత్రమే అక్షరాస్యులు.

ఐక్యరాజ్య సమితి ముందుగా నిర్దేశించుకొన్న లక్ష్యాల ప్రకారం, 2015 నాటికి, తన 179 భాగస్వామ్య దేశాల్లో ఆకలిని రూపుమాపాలనీ, పౌష్టికాహార లోపాల్ని, నిరక్షరాస్యతను, మాతా, శిశు మరణాలను అరికట్టాలని ప్రతిన పూనింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతిఏటా ఒక నివేదికను విడుదల చేస్తుంది. తాజా నివేదిక ప్రకారం, అనారోగ్యంతో చనిపోయిన ప్రతి 10 మందిలో ఆరుగురు 'అరక్షిత తాగునీరు' కారణంగానే చనిపోతున్నారని తెలిపింది. భారతదేశంలో ఏటా 1 కోటి 3 లక్షల మంది చని పోయుంటారు. వారిలో 7 లక్షల 80 వేల మంది అరక్షిత తాగునీరు, అపరిశుభ్రత వల్లనే చనిపోతున్నారు.

లండన్ నుంచి వెలువడే 'లాన్ సెట్' పత్రిక ప్రచురించిన ఒక రిపోర్టు

– సెబాస్టియన్ రాజు
సి.డి.సి & ఎ. సెంటెర్ హెడ్,
అనువాదం : కె. ఎస్. రెడ్డి.

# 'మన టివి' చానల్‌లో అపార్డ్ 'గ్రామ వికాసం'

**ఎ.ఎం.ఆర్. – ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ గ్రామ వికాసం పేరిట, మన టి.వి. ఛానల్ 3లో, 2009 ఫిబ్రవరి 13వ తేదీ నుంచి దూర విద్యా శిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టింది.**

వారంలో ఒక రోజు ఉదయం 10 గం.ల నుండి సాయంకాలం 5 గం.ల వరకు ఈ శిక్షణా కార్యక్రమాలు రాష్ట్రంలోని అన్ని మండల కార్యాలయాలలోను ఎ.యం.ఆర్. అపార్డ్ నిర్వహిస్తుంది. ఈ దూర విద్యా బోధన కార్యక్రమాలు పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలకు చెందిన ఎన్నికైన ప్రతినిధులకు, కార్యకర్తలను ప్రత్యేకంగా నిర్దేశించినవి. ఈ కార్యక్రమాలకు ఆహూతులైన అభ్యర్థులు ఆసక్తి కరమైన కొన్ని డాక్యుమెంటరీ చిత్రాలను చూడవచ్చు. తమ సహచరులతో పరస్పరం అభిప్రాయాలు వినిమయం చేసుకోవచ్చు. అంతేకాదు, మన టి.వి. స్టూడియోలో వున్న నిపుణులను కూడా సంప్రదించవచ్చు. ప్రముఖ శిక్షణ కేంద్రంగా ప్రసిద్ధి కెక్కిన ఈ అకాడమీ క్యాంపస్‌లో నిర్వహించే శిక్షణా శిబిరాలలో అభ్యర్థుల సామర్థ్యాలను పెంపొందించి, వారికి స్వయం ప్రతిపత్తి కల్పించి, నైపుణ్యాన్ని పెంచేందుకు సంస్థ అవిశ్రాంత కృషి చేస్తోంది.

అంతటితోనే ఆగకుండా, టి.వి. మాధ్యమాన్ని వినియోగించుకొని 'గ్రామ వికాసం' అనే దూర విద్యా బోధన కార్యక్రమాలను ప్రవేశపెట్టి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి రంగంలోని 3 లక్షల మంది ఎన్నికైన ప్రతినిధులకు, కార్యకర్తలకు శిక్షణనిచ్చే మరో ముందడుగు కూడా అపార్డ్ వేసింది.

'గ్రామ వికాసం' – దూరవిద్యా బోధన కార్యక్రమం నుంచి పూర్తి లబ్ధి పొందేందుకు శిక్షణ కార్యక్రమ సమయంలో జరిగే వివిధ అంశాలను గురించి అభ్యర్థులు ముందుగా తెలుసుకోవడం ఎంతో అవసరం, ఉపయోగకరం.

'గ్రామ వికాసం' – దూర విద్యా శిక్షణ కార్యక్రమంలో మూడు విశిష్టమైన అంశాలున్నాయి.

ఎ. వీక్షణం – మన టి.వి. లో ప్రసారమయ్యే సమాచార సంచరితమైన డాక్యుమెంటరీ చిత్రాలను చూడడం.

బి. చర్చలు – స్థానిక నిపుణులతోను, సహ అభ్యర్థులతోను తమ భావాలనూ, అనుభవాలనూ వినిమయం చేసుకొని చర్చించడం.

సి. సంప్రదింపులు – మన టి.వి.లో లైవ్ – ఇంటరాక్టివ్ కార్యక్రమ ప్రసార సమయంలో, స్టూడియోలో ప్రజల సందేహాలు తీర్చడానికి సిద్ధంగా వున్న నిపుణులతో మాట్లాడటం.

### 1. వీక్షణం – డాక్యుమెంటరీ చిత్రాలు చూడడం.

గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ వ్యవస్థలకు సంబంధించిన ప్రత్యేక అంశాలను గురించిన వివిధ డాక్యుమెంటరీ చిత్రాలు, ఎన్నికైన



## ROT ఉపయోగించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు

### చేయవలసినవి

1. తగిన ఎర్తింగ్ కలిగిన త్రీపిన్ సాకెట్‌కు యుపిఎస్ యొక్క విద్యుత్ ప్లగ్‌ను కనెక్ట్ చేసేలా చూడండి.
2. కేబుల్ కనెక్టర్లన్నింటినీ తగిన విధంగా జత చేసేలా మరియు గట్టిగా కలిపి కట్టేలా చూడండి.
3. యూనిట్లు, అంటీనా డిష్, టివి కేబినెట్ మొదలైన వాటిపై పేరుకుపోయే దుమ్మును శుభ్రపరిచేలా చూడండి.
4. మృదువైన మరియు పొడి గుడ్డతో యూనిట్లను శుభ్రపరిచేలా చూడండి.
5. యూనిట్లు స్విచాఫ్ స్థితిలో ఉన్నప్పుడే శుభ్రపరిచేలా చూడండి.
6. భూమిలో చేసిన ఎర్త్ పిట్ ఛాంబర్ కనీసం వారానికి ఒక సారి క్రమం తప్పకుండా నీరు పోసేలా చూడండి.
7. పరికరం యొక్క సంబంధిత పాస్ వర్డ్ (సంకేతపదం)ను సురక్షితమైన స్థలంలో పొందుపరచి ఉంచండి.
8. ఎల్ ఎన్ బి సమీపంలో ఆర్ ఎఫ్ కనెక్టర్‌కు స్వయం విలీన (సెల్ఫ్ అమల్గమేటింగ్) టేపు ద్వారా వర్షపు నీటి ఇంకుదల నుంచి రక్షణ కల్పింపబడింది. ఆ టేపు ఊడిపోయినపుడు మరొక టేపు వేసేలా చూడండి.
9. సిస్టమ్ ఉపయోగాన్ని సమీక్షించేందుకు వీలుగా ఒక లాగ్ బుక్‌ను నిర్వహించండి.

### చేయకూడనవి

1. యుపిఎస్‌కు విద్యుత్తు సరఫరాను స్విచాఫ్ చేయవచ్చుదు. ఇన్‌పుట్ విద్యుత్ స్విచాఫ్ చేయడం వల్ల బ్యాటరీ డిశ్చార్జి నెమ్మదిగా జరుగుతుంది మరియు బ్యాటరీ ఉపయోగకాలపరిమితి క్షీణిస్తుంది.
2. యుపిఎస్ ఔట్‌పుట్‌కు ఫ్యాన్, ట్యూబ్‌లైట్ మొదలైన పరికరాలను మరియు ఎలాంటి అదనపు లోడ్‌లను కనెక్ట్ చేయకండి.
3. యూనిట్‌ల వెనుక/పైన గల కవర్లను తొలగించకండి.
4. యూనిట్లను నేరుగా సూర్యకాంతి కింద ఉంచకండి. వాటికి తడి తగలకుండా, దుమ్ము పేరుకు పోకుండా చూడండి.
5. యూనిట్ల / చెక్క కేబినెట్‌లకు గాలి ఆడే రంధ్రాలను మూసి వేయకండి.
6. యూనిట్లు / చెక్క కేబినెట్‌లను విద్యుత్ ఆన్‌లో ఉన్నప్పుడు వేరే చోటికి మార్చడం లేదా కదపడం గానీ చేయకండి.
7. యూనిటల్ గాలి ఆడేందుకు ఏర్పాటైన రంధ్రాల ద్వారా వైరు / పిన్ను/స్క్రూ డ్రైవర్ దూర్చకండి.
8. ఉపరితలాన్ని శుభ్రపరిచేందుకు బెంజిన్ మరియు థిన్నర్ వంటి ఘాటైన ద్రావణాన్ని ఉపయోగించకండి. దుమ్మును శుభ్రం చేసేందుకు పొడిగుడ్డను వాడండి.
9. పరికరానికి సమీపంలో మండే స్వభావం గల పదార్థాలను నిల్వ ఉంచకండి.
10. అంటీనా స్థానాన్ని / దిశను మార్చకండి.
11. ఐ ఆర్ డి ఆన్‌లో ఉండగా ఐ ఆర్ డి మరియు ఎల్ ఎస్ బి మధ్య కేబుల్‌ను డిస్‌కనెక్ట్ / కనెక్ట్ చేయకండి.
12. టివి సమీపంలో ఎలాంటి లోహ / అయస్కాంత పరికరాన్ని ఉంచకండి.
13. పరికరానికి సంబంధించిన పాస్ వర్డ్‌ను పోగొట్టకండి.

పంచాయితీరాజ్ ప్రతినిధులను, కార్యకర్తలను, స్థానిక స్వపరిపాలనకై ఆయత్తం చేయడంకోసం అవసరమైన సామర్థ్యాన్ని, ప్రావీణ్యాన్ని సమకూర్చి, వారిని బలోపేతం చేయడానికి నిర్దేశించినవి. ఆయా రంగాల నిపుణులతో లోతుగా చర్చించిన తరువాత, ఈ అంశాలను ఎంపిక చేసినందువలన, ఈ డాక్యుమెంటరీ చిత్రాలు అందరికీ అమూల్యమైన సమాచారాన్ని అందిస్తాయి. ప్రతి శిక్షణ కార్యక్రమంలోనూ ఇటువంటి నాలుగు చిత్రాలను అందరూ కలిసి చూడవచ్చు.

### 2. చర్చలు – స్థానిక నిపుణులతో కలిసి చర్చించడం.

ఈ డాక్యుమెంటరీ చిత్రాలు చూడగానే అనేక అంశాలపై పలు సందేహాలు కలగవచ్చు. కొత్త కోణాలపై అనేక ప్రశ్నలు తలెత్తవచ్చు. డాక్యుమెంటరీలో ప్రస్తావించిన కొన్ని అంశాల గురించి మరికొంత సమాచారం కావాలనిపించవచ్చు లేదా, కొన్ని అంశాల గురించి అంగీకరించకపోవచ్చు. ఈ విషయాన్ని గుర్తించి, ప్రతి డాక్యుమెంటరీ ప్రసారం తరువాత 15 నిముషాల విరామ సమయం కేటాయిస్తున్నారు. ఈ విరామ కాలంలో, అక్కడే వున్న స్థానిక నిపుణులు అభ్యర్థులతో డాక్యుమెంటరీ గురించి చర్చిస్తారు. అభ్యర్థులు నిర్మొహమాటంగా చిత్రాన్ని గురించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చు. ఆ డాక్యుమెంటరీ నుంచి తాము గ్రహించిన విషయాల గురించి, ఆ సమాచారం తమకు ఎంత వరకు ఉపయోగకరమో, నిర్భయంగా చెప్పవచ్చు. ఇదో ప్రయోజనకరమైన వినూత్న అనుభవం.

### 3. సంప్రదింపులు – 'మన' టి.వి. స్టూడియోలో సిద్ధంగా వున్న నిపుణులతో సంభాషణ

శిక్షణ, తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుంది. మన టి.వి.లో ప్రసారం కానున్న లైవ్ – ఇంటరాక్టివ్ ఫోన్ ఇన్ కార్యక్రమానికి ఎం.ఎల్.ఓ.లు (మండల అక్షరాస్యతా నిర్వాహకులు) నిపుణులు అభ్యర్థులను సిద్ధం చేస్తారు. 90 నిముషాల వ్యవధిగల ఈ కార్యక్రమంలో, రాష్ట్ర వ్యాప్తంగా, డాక్యుమెంటరీలలో ప్రదర్శించిన అంశాలను గురించి మన టి.వి. స్టూడియోలోని నిపుణుల బృందంతో మాట్లాడవచ్చు. మన టి.వి. కల్పిస్తున్న ఈ సౌలభ్యంతో, విషయ నిపుణులతో తమ సందేహాలు ఫోన్‌లో అడిగి వెంటనే సమాధానాలు తెలుసుకోవచ్చు. నిపుణుల బృందంతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి తమ సందేహాలకు సమాధానాలు వెంటనే తెలుసుకోవడం ఈ దూర విద్యా బోధనలోని విశిష్టత! అంతేకాదు, ఇతర మండలాల ప్రతినిధుల ప్రశ్నలకు నిపుణులు చెప్పే సమాధానాలు, వివరాలు తెలుసుకొని, పరిజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకొనే అవకాశం కూడా ఉంది.

### తరచూ తలెత్తే ప్రశ్నలు

1. 'గ్రామ వికాసం' అనే ఈ దూర విద్యా బోధన ఎక్కడ నిర్వహిస్తారు? అక్కడ టి.వి.లు అమర్చారా?

జ. ఈ దూర విద్యా బోధన రాష్ట్రంలోని అన్ని మండల కార్యాలయాలలోనూ ఏక కాలంలో జరుగుతుంది. బోధనకు అవసరమైన సాధన సామగ్రిని ఏర్పాటు చేయడంతో బాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మండల కార్యాలయాలన్నింటిలోనూ ప్లాస్మా టి.వి. సెట్‌లని కూడా సమకూర్చింది.

2. ఈ బోధన కార్యక్రమంలో ఎలా పాల్గొనవచ్చు?

జ. మన రాష్ట్రంలో వివిధ వర్గాలకు చెందిన, ఎన్నికైన ప్రతినిధులూ, పంచాయితీ రాజ్ కార్యకర్తలూ ఉన్నారు. ప్రతి వర్గానికీ, విభిన్న శిక్షణ అవసరాలుంటాయి. కనుక, ప్రతి బోధన కార్యక్రమం, ఒక నిర్దిష్ట వర్గానికి సంబంధించినదై వుంటుంది. ఉదాహరణకు, వార్డు మెంబర్లు, గ్రామ పంచాయితీ అధ్యక్షులు, ఎం.పి.టి.సి.లు, పంచాయితీ కార్యదర్శులు వగైరా. మండల అభివృద్ధి అధికారులు (ఎం.పి.డి.ఓ), జిల్లా రిసోర్స్ పర్సన్లు, మండల పరిషత్ మండల అక్షరాస్యతా కార్యకర్తలు (ఎం.ఎల్.ఓ.) సంయుక్తంగా కలిసి మీకు ముందుగానే సమాచారం అందించి, 'గ్రామ వికాసం' – దూర విద్యా బోధనలో, మీ వర్గానికి ఉపయుక్తమైన కార్యక్రమంలో మీరు పాల్గొనే సౌకర్యం కల్పించే బాధ్యతను వహిస్తారు.

3. 'మన' టి.వి.లో అనేక ఛానెళ్ళున్నాయి. గ్రామ వికాసం కార్యక్రమాలు ఏ ఛానెల్‌లో ప్రసారమవుతాయి?

జ. 'మన' టి.వి.లో – ఛానెల్ 3, ప్రత్యేకంగా గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ కార్యక్రమాలకని నిర్దేశించింది. మా బోధన ప్రణాళిక ప్రతి లో సూచించిన విధంగా ఆయా తేదీలలో నిర్దేశిత సమయంలో, 'మన' టి.వి.లో ఈ కార్యక్రమాలను చూడవచ్చు.

4. లైవ్ – ఇంటరాక్టివ్ సమయంలో నిపుణులతో మాట్లాడి నా సందేహాలు తీర్చుకునే అవకాశం నాకు తప్పక లభిస్తుందా?

జ. ఖచ్చితంగా చెప్పలేము. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థులు ఒకే సమయంలో ప్రశ్నలడగాలనుకుంటారు. మీకు ఫోన్ కనెక్షన్ దొరక వచ్చు, దొరకకపోవచ్చు. ఈ ఇబ్బందుల గురించి సదావగాహన ఉంటే మీరు నిరుత్సాహపడరు. అయితే, ఈ ఇంటరాక్టివ్ కార్యక్రమం చివరి వరకూ మీరు చూస్తే, మీకున్న సందేహాలు మరో వ్యక్తి ఫోన్ చేసి అడిగినప్పుడు దానికి నిపుణులు చెప్పే సమాధానం మిమ్మల్ని కూడా సంతృప్తి పరచవచ్చు. అయితే అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు ప్రశ్నలడిగే సౌకర్యాన్ని సమకూర్చడానికి అపార్డ్ బృందం తీవ్రంగా కృషి చేస్తోంది.

5. నాకు నేనుగా అభ్యర్థిని కావచ్చునా? అయితే, నేను ఎవరిని సంప్రదించాలి?

జ. మీరు స్వయంగా హాజరు కావాలనుకుంటే, వెంటనే మా కార్యకర్తలను సంప్రదించండి. అయితే, స్థానిక సంప్రదింపులకు, ఆయా ప్రాంతాల బోధనకు, మండల అక్షరాస్యతా నిర్వాహకులను (ఎం.ఎల్.ఓ.) ప్రత్యేకంగా నియమించడం జరిగింది. ఈ ఎం.ఎల్.ఓ.లను సంప్రదించి అభ్యర్థిత్వం పొందడం, ఇతర వివరాలు తెలుసుకోవడం, సహాయం అందుకోవడం ఉత్తమ మార్గం.

6. బోధన కార్యక్రమం గురించి ముందుగానే నాకెలా తెలుస్తుంది?

జ. మేము అన్ని మండలాలకు, ఎం.ఎల్.ఓ.లకూ ఒక బోధన ప్రణాళికా ప్రతి (ఫిక్స్‌డ్ పాయింట్ చార్ట్) పంపుతున్నాం. 'గ్రామ వికాసం' – దూర విద్యా బోధన ప్రణాళిక ప్రతిని మీరు తీసుకుని, రానున్న కార్యక్రమాల గురించి ముందుగానే తెలుసుకోవచ్చు. బోధన సమయంలో మీకు అందించే సదుపాయాలను గురించి కూడా ముందుగానే తెలుసుకోవచ్చు.

7. ఈ డాక్యుమెంటరీ చిత్రాలను నేను మా ఇంట్లోనే కేబుల్ టి.వి. ద్వారా చూడగలనా?

జ. వీలుకాదు. 'మన' టి.వి. కె.యు బ్యాండ్ డిష్ ద్వారా మాత్రమే 'గ్రామ వికాసం' కార్యక్రమాలు ప్రసారమవుతాయి. పైన పేర్కొన్నట్టు, బోధన మీ మండల కార్యాలయంలోనే జరుగుతుంది. అక్కడే 'మన' టి.వి. డిష్‌తో కూడిన ప్లాస్మా టి.వి. ఉంది.

8. ఇంటరాక్టివ్ కార్యక్రమంలో మాట్లాడేందుకు ఓ ప్రత్యేక పద్ధతి ఏదైనా ఉందా?

జ. ఉంది. మా సూచనలు కొన్ని ఉన్నాయి. లైవ్ – ఇంటరాక్షన్‌లో మీరు పాటించవలసిన విధానాలు క్రింది సూచికలు చదివితే తెలుస్తాయి.

## లైవ్ ఇంటరాక్షన్

'గ్రామ వికాసం' – దూర విద్యా బోధనలో 'మన' టి.వి. స్టూడియోలో ఆసీనులైన నిపుణులతో నేరుగా లైవ్ ఇంటరాక్షన్ ద్వారా సంప్రదించడం, వారి సమాధానాలు ప్రత్యక్షంగా చూడటం ఎంతో ఆసక్తి దాయకమైన అంశం. అయితే ఇంతకు ముందు పేర్కొన్నట్లు ప్రతి దూర విద్యా బోధన కార్యక్రమంలో షుమారు 1200 మండల కార్యాలయాలలో పాల్గొంటున్న వేలాది అభ్యర్థులుంటారు. కాబట్టి అందరి ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం సాధ్యపడకపోవచ్చు. అభ్యర్థుల ప్రశ్నల సంఖ్యను నియంత్రించవలసిందని మండల కార్యాలయంలో ఉండే ఎం.ఎల్.ఓ.లకు ఆదేశాలు అందాయి.

## అభ్యర్థులుగా మీరు ఈ క్రింది విషయాలను గుర్తుంచుకోవాలి

1. లైవ్ ఇంటరాక్షన్ కొరకు ప్రత్యేకంగా సమకూర్చిన ఫోన్ నెంబర్లు ఇవి:
   040-23551989
   040-23553473
   టోల్‌ఫ్రీ: 18020425-4038
   వీటిలో ఏ నెంబరుకైనా మీరు ఫోను డయల్ చేయవచ్చు.
2. కనెక్షన్ దొరకగానే మీ టి.వి. సెట్టు వాల్యూమ్ తగ్గించండి.
3. మీ పేరు, ఊరి పేరు, మండలం పేరు చెప్పి మిమ్మల్ని మీరు పరిచయం చేసుకోండి.
4. మీ ప్రశ్నను స్పష్టంగా అడగాలి. మీరు అడగదలచుకున్న ప్రశ్న ముందుగానే రాసి సిద్ధంగా పెట్టుకోవడం ఉత్తమం. ఇలా చేస్తే ప్రశ్న అడుగుతున్నప్పుడు తడబాట్లలో సమయం వృధాకాకుండా ఉంటుంది.
5. మన టి.వి. స్టూడియోలో ఆసీనులైన నిపుణులకు (ఎక్స్‌పర్ట్ ప్యానెల్ సభ్యులకు) మీ ప్రశ్న అర్థమయ్యాక ఫోను డిస్కనెక్ట్ చేసి టి.వి. వాల్యూమ్ పెంచుకోండి. మీ ప్రశ్నకు నిపుణుల సమాధానం టి.వి. సెట్‌పై చూడండి.

## సాటిలైట్ సమాచారం:


**ఇన్సాట్ 3 టి.వి. 83° E లాంగిట్యూడ్**

అప్‌లింక్ & డౌన్‌లింక్ కొలమానాలు:
అప్‌లింక్ ఫ్రీక్వెన్సీ : 14357 Mhz
డౌన్‌లింక్ ఫ్రీక్వెన్సీ : 11557 Mhz
సింబల్ రేట్ : 13333 KSPS/13.33 MS/S
ఫార్వర్డ్ ఎర్రర్ కరెక్షన్ : 1/2
డౌన్‌లింక్ పోలరైజేషన్ : వర్టికల్, లీనియర్ ★

Printed & published by Phanikumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Printers, 11-4-668, Redhills, Hyderabad, A.P.
Published at Andhra Pradesh Academy of Rural Development, Rajedndranagar, Hyderabad-30 Rangareddy. **Editor : Phani Kumar**



# వసంత రుతుశోభ


సంతోష జీవనానికి పర్యావరణమే పునాది